మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40




నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


అక్షర ఆయుధధారి... 'ఆవంత్స'



06


సంపుటి 07, సంచిక: 347 | సోమవారం | 18-11-2024 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00




## తప్పుడు ప్రచారం పటాపంచలు

**కాళేశ్వరంతో సంబంధం లేకుండా రికార్డుస్థాయిలో పండిన వరి**

**ఈ ప్రాజెక్టు వల్లనే పెద్ద ఎత్తున ధాన్యం దిగుబడి అంటూ బిఆర్ఎస్ అబద్ధపు ప్రచారం**

**'ఎక్స్' వేదికగా సిఎం రేవంత్‌రెడ్డి**

ప్రజాపక్షం / హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టు వల్లనే తెలంగాణ రాష్ట్రంలో వరి సాగు పెరిగిందనే బిఆర్ఎస్ తప్పుడు ప్రచారం పటాపంచలైందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. ''కాళేశ్వరంలో భాగమైన మేడిగడ్డ కుంగిపోయి నీటిని నిల్వ చేసే పరిస్థితి లేకపోయినా, ఎన్‌డిఎస్ఎ సూచన మేరకు అన్నారం, సుందిళ్లలో నీటిని నిల్వ చేయకపోయినా కాళేశ్వరంతో సంబంధం లేకుండా తెలంగాణ ఆవిర్భావం తర్వాత తొలిసారి రికార్డు స్థాయిలో వరిధాన్యం పండింది'' అని ఆయన పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్లనే తెలంగాణ రాష్ట్రంలో వరి సాగు పెరిగిందని ఇటీవల బిఆర్ఎస్ నాయకులు ప్రకటనలు చేయడం, రాష్ట్రంలో ప్రస్తుతం పెద్ద ఎత్తున వరి ధాన్యం దిగుబడిపై సిఎం రేవంత్‌రెడ్డి 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఒక పోస్ట్ చేశారు. ''ఇది తెలంగాణ రైతుల ఘనత. వారి శ్రమ, చెమట, కష్టం ఫలితం. తెలంగాణ రైతు దేశానికే గర్వకారణం. ఈ ఘనత సాధించిన ప్రతీ రైతుకు హృదయపూర్వక అభినందనలు'' అని సిఎం తన ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు.



## హైపర్ సోనిక్ క్షిపణి పరీక్ష సక్సెస్

**అతికొద్ది దేశాల సరసన చేరిన భారత్**

**న్యూఢిల్లీ :** భారత సైన్యం అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరింది. తొలిసారి దీర్ఘశ్రేణి హైపర్ సోనిక్ క్షిపణిని డిఆర్‌డిఒ విజయవంతంగా పరీక్షించింది. శనివారం ఒడిశాలోని అబ్దుల్‌కలాం ద్వీపం నుంచి డిఆర్‌డిఒ క్షిపణి పరీక్ష నిర్వహించింది. ఈ పరీక్షతో దీర్ఘశ్రేణి హైపర్ సోనిక్ క్షిపణులున్న అతికొద్ది దేశాల జాబితాలో భారత్ చేరింది. 1500 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను ఈ క్షిపణి ఛేదించగలదని అధికారులు తెలిపారు. వివిధ రకాల వార్‌హెడ్‌లను అమర్చేలా క్షిపణిని డిజైన్ చేశామని వెల్లడించారు. ఇక ఈ పరీక్ష సైనిక దళాలకు చెందిన కీలక అధికారులు, శాస్త్రవేత్తల సమక్షంలో జరిగింది. క్షిపణి గమనాన్ని వివిధ వేదికల నుంచి జాగ్రత్తగా ట్రాక్ చేసినట్లు, చివరి దశలో అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాన్ని ఢీకొన్నట్లు డిఆర్‌డిఒ వెల్లడించింది. హైదరాబాద్‌లోని డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలామ్ మిసైల్ కాంప్లెక్స్‌లో క్షిపణిని రూపొందించిగా, దేశంలోని ఇతర డిఆర్‌డిఒ ల్యాబ్‌లు, పరిశ్రమలు సహకరించాయి. దీర్ఘశ్రేణి హైపర్‌సోనిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించడం వల్ల భారత్ ఓ పెద్ద మైలురాయిని దాటిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. ఈ చారిత్రక ఘట్టంతో అత్యాధునిక మిలిటరీ టెక్నాలజీని సాధించిన అతికొద్ది దేశాల జాబితాలో భారత్ చేరిందని పేర్కొన్నారు. క్షిపణిని తయారీలో భాగస్వామ్యమైన తరువాయి 2లో



## మామునూర్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంలో ముందడుగు

**భూసేకరణకు రూ.205 కోట్లు విడుదల**

ప్రజాపక్షం / హైదరాబాద్

వరంగల్ జిల్లా మామునూర్ ఎయిర్ పోర్ట్ నిర్మాణంలో ముందడుగు పడింది. ఎయిర్ పోర్ట్ విస్తరణకు అవసరమైన 253 ఎకరాల భూసేకరణకు రూ.205 కోట్లను విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు చేసింది. ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి సంబంధించి డిజైన్లతో కూడిన డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డిపిఆర్)ను సిద్ధం చేయాలని ఎయిర్ పోర్ట్ అథారిటీకి తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ లేఖ రాసింది. మామునూర్ ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న 150 కిలోమీటర్ల ఒప్పందాన్ని జిఎంఆర్ సంస్థ విరమించుకుంది. ఇప్పటికే ఎయిర్ పోర్ట్ పరిధిలో 696 ఎకరాల భూమి ఉంది. అదనంగా 253 ఎకరాల భూమిలో కొంత రన్ వే విస్తరణ, టెర్మినల్ బిల్డింగ్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఎటిసి), నెవిగేషనల్ ఇన్‌స్ట్రూమెంట్ ఇన్‌స్టాలేషన్ విభాగాల కోసం నిర్మాణాలు చేపట్టనున్నట్లు తరువాయి 2లో

# రాష్ట్రంలో నేటి నుంచి 'ఇవి' పాలసీ అమలు



**ఈ నూతన విధానం 2026, డిసెంబర్ 31 వరకు వర్తింపు**

**అన్ని రకాల ఎలక్ట్రిక్ వాహనాలకు రిజిస్ట్రేషన్ ఫీజు నుంచి మినహాయింపు**

**వివరాలు వెల్లడించిన మంత్రి పొన్నం ప్రభాకర్**

ప్రజాపక్షం / హైదరాబాద్

తెలంగాణలో నూతన 'ఎలక్ట్రిక్ వెహికిల్స్ పాలసీ' ఈ నెల 18వ తేదీ నుంచి అమలులోకి రానుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు (జిఓ 41) జారీ చేసింది. రాష్ట్రంలో ఇకపై కొనుగోలు చేసే అన్ని ఇవి వాహనాలకు రిజిస్ట్రేషన్ ఫీజు నుంచి మినహాయింపు ఇవ్వనున్నట్లు, జిఓ 41 ద్వారా తీసుకువచ్చిన ఈ కొత్త ఈవి పాలసీ 2026, డిసెంబర్ 31 వరకు అమలులో ఉంటుందని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కొత్త 'ఎలక్ట్రిక్ వెహికిల్స్ పాలసీ' వివరాలను మంత్రి ప్రభాకర్ వెల్లడించారు. ఎలక్ట్రిక్ టూ వీలర్స్, ఆటో, ట్రాన్స్‌పోర్ట్ బస్సులకు తరువాయి 2లో



## సచివాలయంలో బాహుబలి గేటు తొలగింపు

**3 నెం. గేటువద్ద ఏర్పాటు చేసే అవకాశం**

ప్రజాపక్షం / హైదరాబాద్

తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం బాహుబలి గేటును తొలగించారు. ఈ గేటును హుస్సేన్‌సాగర్ వైపు ఉన్న గేట్ నెంబర్ 3 వద్ద ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. సెక్రటేరియట్ ప్రాంగణంలో మెయిన్ గేట్ ఎదురుగా 'తెలంగాణ తల్లి విగ్రహం' ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో మార్పులు చేపట్టారు. ఇప్పటికే ఈ మెయిన్ గేట్‌ను రేకులతో మూసివేశారు. కొత్తగా ఏర్పాటు చేసే గేటు దగ్గర కూడా పనులకు ఇబ్బంది రాకుండా రేకులతో మూసివేశారు. అయితే, గత బిఆర్ఎస్ సర్కార్ నిర్మించిన తెలంగాణ సెక్రటేరియట్‌లో వాస్తు దోషం ఉందని ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. దీంతో బహుబలి గేటుగా పిలిచే మెయిన్ ఎంట్రెన్స్ తాళం వేసి దాదాపు 6 నెలలు మూసివేశారు. తాజాగా గేటును తొలిగించారు.



## కల్తీపై ఉక్కుపాదం

**అల్లం పేస్ట్ తయారీ కేంద్రంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి**

**8 మంది అరెస్ట్ - రూ.4 లక్షల విలువైన సరుకు స్వాధీనం**

ప్రజాపక్షం/హైదరాబాద్

కల్తీ ఆహారపదార్థాలకు కేర్‌ఆఫ్ అడ్రస్సుగా హైదరాబాద్ మారిందని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) సంచలన నివేదిక ఇవ్వడంతో టాస్క్‌ఫోర్స్, జిహెచ్‌ఎంసి అధికారులు అప్రమత్తమయ్యారు. హోటళ్లు, రెస్టారెంట్లు, తినుబండరాళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో 65 శాతం నిల్వ ఉన్న పదార్థాలతో ఆహార పదార్థాలు తయారు అవుతున్నాయని తేలింది. దీంతో హైదరాబాద్‌లో నకిలీ తయారీ దారులపై పోలీసులు, జిహెచ్‌ఎంసి అధికారులు ఉక్కుపాదం మోపారు. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లో పెద్ద మొత్తంలో కల్తీ అల్లం పేస్ట్ ను తయారు చేస్తున్న కేంద్రంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఓల్ బోయిన్ పల్లి రాజరాజేశ్వరినగర్ లో ఈ ఘటన చోటు చేసుకుంది. 8 మంది తరువాయి 2లో

## ర్యాగింగ్‌పై కఠినం



**ఖమ్మం ఘటన పునరావృతం కావద్దు**

**అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు**

**అధికారులకు మంత్రి దామోదర రాజనర్సింహ్మ ఆదేశం**

ప్రజాపక్షం/హైదరాబాద్

ర్యాగింగ్ వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా అన్ని కళాశాలల్లో కార్యక్రమాలు నిర్వహించాలని,ఇందుకు పోలీస్ శాఖ సహకారం తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ ఆదేశించారు. ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలలో మొదటి సంవత్సర విద్యార్థికి గుండు కొట్టించిన ఘటనపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై విచారణ చేపట్టి, తక్షణమే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఉన్నతాధికారులతో మంత్రి దామోదర రాజనర్సింహ్మ ఆదివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వైద్య కళాశాలలో ర్యాగింగ్ ఘటనలపై దామోదర రాజనర్సింహ్మ అసంతృప్తి వ్యక్తం చేశారు. ర్యాగింగ్‌తో విద్యార్థుల భవిష్యత్‌పైన ప్రభావం పడకుండా చూడాలని ఉన్నతాధికారులకు సూచించారు. తమ జూనియర్లతో సీనియర్లు స్నేహపూర్వకంగా ఉండాలని, ర్యాగింగ్ పేరుతో భయాందోళనకు గురి చేయవద్దని మంత్రి సూచించారు.

**'108 సేవ'లు మరింత బలోపేతం**

అత్యవసర పరిస్థితులలో రోగులకు సేవలు అందించే 108 అంబులెన్స్ సేవలను మరింత బలోపేతం చేస్తున్నామని మంత్రి తరువాయి 2లో

# నిరసన 'జ్వాలల్లో' మణిపూర్



**నలుగురు ఎమ్మెల్యేల ఇళ్లకు అల్లరిమూకలు నిప్పు**

**సిఎం బీరెన్‌సింగ్ నివాసం ముట్టడి ప్రయత్నం భగ్నం**

**నిరసనకారులపై టియర్‌గ్యాస్, రబ్బరు బుల్లెట్లు ప్రయోగించిన భద్రతాబలగాలు**

ప్రభుత్వానికి ఎన్‌పిపి మద్దతు ఉపసంహరణ 05

**ఇంఫాల్ :** మణిపూర్ రాష్ట్రం భగ్గుమంటోంది. ఆగ్రహంతో ఊగిపోతున్న అల్లరిమూకలు ఆదివారం నాడు మరో నలుగురు ఎమ్మెల్యేల ఇళ్లకు నిప్పంటించారు. ఇళ్లకు నిప్పంటించబడిన బాధిత ప్రజాప్రతినిధులలో ఒక సీనియర్ మంత్రి సహా ముగ్గురు బిజెపి శాసనసభ్యులున్నారు. అయితే 4వ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీకి చెందినవారు.అల్లరిమూకల హింసాత్మక ఘటనల్లో భాగంగా మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్.బీరెన్‌సింగ్ పూర్వీకుల నివాసాన్ని ముట్టడించేందుకు చేసిన ప్రయత్నాలను భద్రతా బలగాలు అడ్డుకున్నాయని అధికారవర్గాలు వెల్లడించాయి. శనివారం రాత్రి నిరవధిక కర్ఫ్యూ విధించినప్పటికీ జిరిబం జిల్లాలో మిలిటెంట్లు ఒక్కొక్కరూ ముగ్గురు మహిళలను, పిల్లలను చంపడంతో ప్రజలు ఆందోళన చెందారు. ముగ్గురు రాష్ట్ర మంత్రులు, ఆరుగురు ఎమ్మెల్యేల నివాసాలపై దాడులు జరిగాయి. దీంతో ఆగ్రహించిన ప్రజలు నింగ్‌థౌకాంగ్ వద్దనున్న పిడబ్ల్యుడి మంత్రి గోవిందాస్ కొంథౌజమ్, లాంగ్‌మీడొంగ్ బజార్‌లో ఉన్నటువంటి హియాంగ్లామ్ అసెంబ్లీ నియోజకవర్గం తరువాయి 2లో



## అధికారం, రాజకీయంపైనే బిఆర్ఎస్‌కు యావ

**ప్రభుత్వ పథకాలపై తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టేందుకే ప్రగతి సభ**

**ఢిల్లీకి మూటలు మోసే అలవాటు కాంగ్రెస్‌కు లేదు**

**ఇతర రాష్ట్రాల్లోకి డబ్బు మూటలు మోసిన చరిత్ర గులాబీ పార్టీదే**

**మంత్రులు కొండా సురేఖ, సీతక్క ధ్వజం**

**సిఎం సభా ఏర్పాట్లు పరిశీలించిన మంత్రులు**

ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి

బిఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టేలా ప్రగతి సభను హనుమకొండలో నిర్వహిస్తున్నామని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. ఈ నెల 19వ తేదీన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వరంగల్ జిల్లా పర్యటన సందర్భంగా హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళాశక్తి బహిరంగసభ ఏర్పాట్లను మంత్రులు కొండ సురేఖ, సీతక్క, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణ తదితరులు ఆదివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రులు మాట్లాడుతూ కెటిఆర్, కెసిఆర్, హరీశ్‌రావులకే మూటలు మోసే అలవాటు ఉందని, తెలంగాణ తరువాయి 2లో

## గుజరాత్‌కు ప్రాజెక్టులు తరలింపు... 'మహా'లో ఉపాధి కొరత

**ఉద్యోగాలు లేక యువత ఆత్మహత్య : ఎన్నికల ప్రచారంలో ప్రియాంకాగాంధీ**

**ముంబయి :** అధికార బిజెపి అనుసరిస్తున్న విధానాలపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ వాద్రా తీవ్రంగా మండిపడ్డారు. కొన్ని పెద్ద ప్రాజెక్టులను గుజరాత్‌కు తరలించడంతో మహారాష్ట్ర భారీగా ఉద్యోగాలును కోల్పోయిందన్నారు. మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లాలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో ప్రియాంక పాల్గొని మాట్లాడారు. అధికార కూటమిలోని భాగస్వామ్యపక్షాల నేతలు వాస్తవ సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. ఓట్ల కోసం మద్దతు కూడగట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకమైన తరువాయి 12లో



## కిషన్‌రెడ్డి మూసీ నిద్ర ఫొటో షూట్ కోసమే

**ప్రాజెక్టును ఆపేందుకు బిఆర్ఎస్,బిజెపి కుమ్మక్కు : మహేష్ కుమార్‌గౌడ్**

ప్రజాపక్షం/హైదరాబాద్



మూసీ ప్రాజెక్టును ఆపేందుకు బిజెపి, బిఆర్ఎస్ కుమ్మకై కుట్రకు పాల్పడుతున్నాయని టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ ఆరోపించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఫోటో షూట్ కోసమే 'మూసీ నిద్ర' చేశారని ఎద్దేవా చేశారు. బస చేసే ముందే ఆ ప్రాంతంలో దోమలు, ఈగల తరువాయి 12లో




# సమన్వయంతో ముందుకెళదాం ట్రంప్ నాయకత్వంతో కలిసి పనిచేస్తాం

## చైనా- అమెరికా బంధం ప్రపంచానికి కీలకం

### జో బైడెన్‌తో భేటీలో జిన్‌పింగ్

**లిమా:** సమన్వయంతో ముందుకెళదామని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. పరస్పరం గౌరవించుకుంటూ, సంప్రదింపులు జరుపుకుంటూ మన బంధాన్ని మెరుగు పర్చుకోవడం ద్వారా చైనా, అమెరికా ప్రజలకే కాక మొత్తం మానవాళికి మేలు చేయగలమన్నారు. అమెరికాలో కొత్తగా ఏర్పాటయ్యే డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సిద్ధమని చెప్పారు. చైనా, అమెరికా సంబంధాలు గత నాలుగేళ్లుగా ఎన్నో ఒడిదుడుకులను తట్టుకొని నిలబడ్డాయని, ఇందుకు సంప్రదింపులు దోహదమయ్యాయని అన్నారు. సహకారం వల్ల తమ సంబంధాలు తిరిగి గాడిన పడ్డాయన్నారు. ఆసియా పసిఫిక్ ఎకనామిక్ కోపరేషన్ (అపెక్) శిఖరాగ్ర సదస్సు సందర్భంగా పెరూ రాజధాని లిమాలో జిన్‌పింగ్, జో బైడెన్ భేటీ అయ్యారు. దౌత్యం, భద్రత, వాణిజ్యం, ఆర్థిక వ్యవహారాలు, సైన్యం, వ్యవసాయం, వాతావరణ మార్పు, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ తదితర రంగాల్లో రెండు దేశాల సహకారం గురించి మాట్లాడుకున్నారు. గత అనుభవాల నుంచి నేర్చుకున్న పాఠాలతో భవిష్యత్‌ను తీర్చుదిద్దుకోవాలని సంకల్పించారు. సైబర్ క్రైం, తైవాన్, దక్షిణ చైనా సముద్రం, రష్యా తదితర అంశాలపై దాదాపు రెండు గంటలకుపైగా చర్చించారు. అదే సమయంలో సహకారాన్ని పెంచుకునేందుకు ఏడు సూత్రాల విధానాన్ని అనుసరించాలని నిర్ణయించారు. సంబంధాల మెరుగుదలకు ముందుగా వ్యూహాత్మక దృక్పథాన్ని సరిచేసుకోవాలని, మాటలను ఆచరణలో పెట్టాలని, గౌరవాన్ని ఇచ్చిపుచ్చుకోవాలని, రెడ్ లైన్ (పరిధులు) దాటరాదని, సంప్రదింపులు సహకారాన్ని పెంచుకోవాలని ఏకాభిప్రాయానికి వచ్చారు. తమ ప్రజల ఆకాంక్షలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రధాన దేశాల బాధ్యతలనూ తీసుకోవడం కీలక అడుగు కాగలదని జిన్‌పింగ్ చేసిన సూచనలతో బైడెన్ అంగీకరించారు. మానవాళి భవిష్యత్ దృష్ట్యా ప్రపంచ శాంతికి అమెరికా, చైనా బాధ్యత తీసుకోవాలని జిన్‌పింగ్ నొక్కి చెప్పారు. ప్రపంచ ఐక్యతకు తోడ్పడాలని సూచించారు. 45ఏళ్ల దౌత్య బంధం స్ఫూర్తిగా పరస్పరం నమ్మకంతో భాగస్వాములుగా ముందుకెళితే సమస్యల పరిష్కారం సాధ్యమని హితవు పలికారు. ఒకవేళ రెండు దేశాలు శత్రువులుగా మారితే సంబంధాలు చెడిపోవడమే కాకుండా తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని జిన్‌పింగ్ హెచ్చరించారు. ఇద్దరికి ప్రయోజనం ఉండే సహకార మార్గం ద్వారా సమ్మిళిత వృద్ధి సాధించగలమన్నారు. చైనాఅమెరికా మధ్య పటిష్ఠ బంధం రెండు దేశాల ప్రజలే కాదు యావత్ మానవాళి భవిష్యత్‌కు కీలకమని నొక్కిచెప్పారు. సుస్థిరమైన చైనాఅమెరికా సంబంధాలకు కట్టుబడి ఉన్నామని జిన్‌పింగ్ అన్నారు. ఉక్రెయిన్ వ్యవహారంలో చైనాది ఎప్పుడు న్యాయ పక్షమే అని చెప్పారు. శాంతి చర్చలను ప్రోత్సహిస్తూ శాంతికి, సైనిక ఉపసంహరణకు యత్నిస్తున్నట్లు తెలిపారు. కొరియా ద్వీపకల్పంలో అస్థిరత, ఘర్షణకు చైనా అనుమతి ఇవ్వబోదని... వ్యూహాత్మక భద్రత, కీలక ప్రయోజనాలకు ముప్పు వాటిల్లే పరిస్థితి ఏర్పడితే చైనా చూస్తూ ఊరుకోబోదని జిన్‌పింగ్ స్పష్టంచేశారు.

**చైనాతో యుద్ధాన్ని అమెరికా కోరడం లేదు: బైడెన్**

అమెరికాచైనా సంబంధాలు ప్రపంచంలోని అత్యంత ముఖ్యమైన ద్వైపాక్షిక బంధమని జో బైడెన్ అన్నారు. తమ మధ్య పోటీ ఘర్షణగా మారకుండా చూసుకోవల్సిన బాధ్యత రెండు దేశాల ప్రభుత్వాలపై ఉందని చెప్పారు. తమ దేశం కొత్త ప్రచ్ఛన్న యుద్ధాన్ని కోరుకోవడం లేదని, చైనా వ్యవస్థలో మార్పు తేవాలని అనుకోవడం లేదని బైడెన్ స్పష్టంచేశారు. తైవాన్ స్వాతంత్ర్యానికి మద్దతివ్వాలని చైనాకు వ్యతిరేకంగా తమ మిత్ర పక్షాలను క్రియాశీలం చేయడం లేదని అన్నారు. చైనాతో ఘర్షణను అమెరికా కోరడంలేదన్నారు. సంప్రదింపులను మరింత పెంచుకునేందుకు కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. నాలుగేళ్లుగా అనేక మార్గాల్లో సంప్రదింపులు జరపడం ద్వారా కలిసి పనిచేసినట్లు తెలిపారు. దౌత్యభద్రతా బృందాల వ్యూహాత్మక చర్చలతో రెండు దేశాలు పరస్పర అవగాహనతో ముందుకు సాగగలిగాయని బైడెన్ అన్నారు. గతేడాది శాన్‌ఫ్రాన్సిస్కో భేటీ తర్వాత తమ సంబంధాల్లో పురోగతి కనిపిస్తోందన్నారు. 2026లో అపెక్, జీ20 సదస్సుల నిర్వహణలో పరస్పరం సహకరించుకోవడం ద్వారా రెండు దేశాలు సఖ్యత, సమన్వయంతో ముందుకెళ్లగలవని ఆకాంక్షించారు.

## జిన్‌పింగ్ స్టార్ అట్రాక్షన్



పెరూలో ముగిసిన రెండు రోజుల ఎపెక్ సదస్సులో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఈ సదస్సులో స్టార్ అట్రాక్షన్‌గానిలిచారు. అమెరికా అధ్యక్షుడిగా రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ఎన్నికైన నేపథ్యంలో, అధ్యక్ష హోదాలో చివరి విదేశీ పర్యటనలో ఉన్న బైడెన్ సంప్రదాయానికి విరుద్ధంగా గ్రూప్ ఫొటో కోసం చాలా ఆలస్యంగా వేదికపైకి వచ్చారు. ఆయన రాకకోసం పలు దేశాల నేతలు సుమారు ఐదు నిమిషాలు అక్కడే వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. డయాస్ పైకి రావడానికి కష్టపడిన బైడెన్ గ్రూప్ ఫొటోలో వెనుక వరుసలో, 38 ఏళ్ల థాయిలాండ్ ప్రధాన మంత్రి పెటోంగ్‌టార్న్ షినవత్రా, వియత్నాం అధ్యక్షుడు లువాంగ్ కువాంగ్ మధ్య నిల్చుకున్నారు. వేదిక దిగడానికి ఆయన షినవత్రా సాయం తీసుకున్నారు. కాగా, జిన్‌పింగ్ మొదటి వరుసలో, సదస్సుకు ఆతిథ్యం ఇచ్చిన పెరూ దేశాధ్యక్షుడు దినా బొలువర్తే పక్కన నిలబడ్డారు. ప్రపంచ వాణిజ్యానికి నాయకత్వ బాధ్యతల నుంచి వైదొలుగుతామని ఎన్నికల సమయంలో ట్రంప్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే. అధికారికంగా ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టకపోవడంతో, డెమోక్రాటిక్ పార్టీకి చెందిన ప్రస్తుత అధ్యక్షుడు బైడెన్ ఆ పదవిలో కొనసాగుతున్నారు. అయితే, కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఆయనకు ఉండవన్నది బహిరంగ రహస్యం. దీనితో అపెక్ కూటమికి చైనా మార్గదర్శకం చేసే అవకాశాలు పెరిగాయి.

# లెబనాన్ గ్రామాలు బిక్కుబిక్కు

## బాంబులు, ఫిరంగులతో ఇజ్రాయెల్ దాడులు



### తాజా వైమానిక దాడిలో 11 మంది మృతి

### మృతుల్లో ఒకే కుటుంబం నుంచి ఆరుగురు

**బీరుట్:** లెబనాన్‌లోని తూర్పు, దక్షిణ ప్రాంతాల్లో ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది. అక్కడి గ్రామాలు, పట్టణాలపై బాంబులు, ఫిరంగులతో వరుస దాడులు చేస్తోంది. దీంతో స్థానికులు బిక్కుబిక్కుమంటున్నారు. ఏ క్షణంలో ఎటు వైపు నుంచి దాడి జరుగుతుందో తెలియక తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నారు. తాజా వైమానిక దాడుల్లో 11 మంది చనిపోగా మరో 11 మంది గాయపడ్డారు. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ఉన్నారు. ఈ మేరకు ఎన్ఎన్ఏ నివేదించింది. తూర్పు బాల్‌బెక్ హెర్మెల్ గవర్నరేట్‌లోని ఖరీబే గ్రామంలోని ఇంటిపై దాడితో 11 మంది గాయపడ్డారని తెలిపింది. మున్సిపల్ గోడౌన్ లక్ష్యంగా జరిగిన దాడితో నబాతియే మున్సిపాలిటీలో పనిచేసే ఐదుగురు మరణించారని వెల్లడించింది. లెబనాన్‌లోని తూర్పు, దక్షిణ గ్రామాలు, పట్టణాల్లో గత 24 గంటల్లో దాదాపు వంద సార్లు ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు, డ్రోన్లు దాడి చేసినట్లు సైనిక వర్గాలు తెలిపాయి. 16 గ్రామాలపై బాంబులు కురిపించగా, పట్టణాలపై 75 ఫిరంగి దాడులు జరిగినట్లు వెల్లడించాయి.

**క్షిపణులతో హిజ్బొల్లా దాడులు**

ఇజ్రాయెల్‌కు చెందిన మెర్కావా టాంకును ధ్వంసం చేసినట్లు హిజ్బొల్లా ఒక ప్రకటన చేసింది. దక్షిణ లెబనాన్‌లోని ఛమా గ్రామంలో ఆ ట్యాంకుపై క్షిపణితో దాడి చేసినట్లు తెలిపింది. దీంతో ఇజ్రాయెల్ సైనికులు చనిపోయినట్లు వెల్లడించింది. దక్షిణ లెబనాన్‌లోని సరిహద్దు ప్రాంతాల్లోకి చొరబడిన ఇజ్రాయెల్ సైనిక సమూహాలు, వాహనాలు లక్ష్యంగా క్షిపణి దాడులు చేసినట్లు ప్రకటన పేర్కొంది. ఇజ్రాయెల్ స్థావరాలపై రాకెట్లు ప్రయోగించినట్లు తెలిపింది. ఆర్కే, హైఫా, సఫేద్, కిర్యాత్ షోమా నగరాలు సహా ఉత్తర ఇజ్రాయెల్‌లోని కొన్ని నిర్దేశిత లక్ష్యాలపై దాడులు చేసినట్లు హిజ్బొల్లా ప్రకటించింది.

# హౌతీల డ్రోన్ దాడులు

యెమన్‌కు చెందిన హౌతీలు బాంబులతో కూడిన డ్రోన్లతో ఇజ్రాయెల్‌లోని దక్షిణ పోర్టు నగరం ఇలియత్‌లోని లక్షిత ప్రాంతంపై దాడి చేశారు. పలస్తీనా, లెబనాన్‌కు మద్దతుగా ఇజ్రాయెల్‌లోని లక్షిత ప్రాంతాలపై డ్రోన్లతో మా సైన్యం దాడి చేసిందని హౌతీ సైన్యం అధికార ప్రతినిధి యాహ్యా సరియా ఒక ప్రకటన చేశారు. తమ ఆపరేషన్ విజయవంతమైందన్నారు. గాజా, దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెల్ దురాక్రమణ ఆగనంత వరకు తాము వెనక్కి తగ్గేది లేదని ఆయన తేల్చిచెప్పారు. ఎర్ర సముద్రంలో ఇజ్రాయెల్ సంబంధిత నౌకలపై, ఇజ్రాయెల్ నగరాలపై తమ దాడులు కొనసాగుతాయని స్పష్టంచేశారు.



# చైనాలో సామూహిక దాడి

### 8 మంది మృతి

### 17 మందికి గాయాలు



**బీజింగ్:** చైనాలోని వుగ్జి ప్రాంతంలో ఓ 21ఏళ్ల యువకుడు రెచ్చిపోయాడు. కత్తితో సామూహిక దాడికి పాల్పడ్డాడు. విచక్షణ కోల్పోయి అడ్డొచ్చిన వారిని పొడిచారు. ఈ క్రమంలో ఎనిమిది మందిని హత్య చేశాడు. మరో 17 మందిని గాయపర్చాడు. జిగ్సు ప్రావిన్స్‌లోని వుగ్జి వొకేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్ట్స్, టెక్నాలజీ వద్ద ఈ ఘటన జరిగింది. ఈ వారం ఆరంభంలోనే ఓ కారు బీభత్సం సృష్టించి 35 మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన మరువక ముందే తాజా దాడి జరగడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు.కత్తితో దాడి చేసినదుండగుడిని ఈ ఇన్‌స్టిట్యూట్ పూర్వ విద్యార్థిగా పోలీసులు గుర్తించారు. అతనిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు ఈ ఏడాది గ్రాడ్యుయేషన్ పూర్తి చేయాల్సి ఉండగా పరీక్షల్లో ఫెయిల్ అయ్యాడని ఇన్‌స్టిట్యూట్ యంత్రాంగం వెల్లడించింది. తనలోని ఆగ్రహావేశాన్ని ప్రదర్శించేందుకు ఇన్‌స్టిట్యూట్‌కు వచ్చిన కుర్రాడు ఎనిమిది మందిని హతమార్చాడని పోలీసులు తెలిపారు.

# 'ఇవి పాలసీ' అమలు

(మొదటి పేజీ తరువాయి)

వందశాతం రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు ఉంటుందని, దీనిద్వారా వినియోగదారులకు ఏడాదికి లక్ష రూపాయల వరకు ఆదా అవుతుందని అన్నారు. ఢిల్లీ మాదిరిగా హైదరాబాద్ నగరం కాలుష్యం కాకూడదనే ఉద్దేశంతో ఈవి పాలసీని ప్రవేశ పెడుతున్నామని అన్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న మూడు వేల బస్సులు స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులు తేవాలని సిఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారని, త్వరలోనే సిటీలో మొత్తం ఈవి ఆర్‌టిసి బస్సులు నడుస్తాయని ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. అందులోభాగంగా రాష్ట్రంలో రవాణా శాఖ పరంగా మార్పులు, చేర్పులు తీసుకువచ్చి ప్రజల్లో చైతన్య కలిగించే కార్యక్రమాలు చేపడుతున్నామని మంత్రి వివరించారు. గతంలో 2020 2030 ఎలక్ట్రిక్ వెహికిల్ (ఈవి) పాలసీ తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఇక రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాలకు పరిమితి అనేది లేదని తెలిపారు. కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్‌ను మార్చాలని ప్రణాళికలు సైతం తీసుకువచ్చామన్నారు. హైదరాబాద్‌లో కాలుష్య తీవ్రత 83 ఉంటే పఠాన్‌చెరువులో 72 ఉందన్నారు. ఈ క్రమంలో కాలుష్యాన్ని తగ్గించాలంటే ఈవిపై పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని మంత్రి చెప్పారు. ఇప్పటి వరకు పరిమితి సంఖ్య లోనే ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగిస్తున్నారన్నారు. ఈవీ వాహనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలకు మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

# ముందడుగు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం ప్రకటించింది.

**నిధుల విడుదలపై మంత్రి కొండా సురేఖ హర్షం**

మామునూరు ఎయిర్ పోర్టు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 205 కోట్లను కేటాయిస్తూ జిఒ విడుదల చేయడం పట్ల అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖా కొండా సురేఖ హర్షం వ్యక్తం చేశారు. మామునూరు ఎయిర్ పోర్టు ఏర్పాటు తన రాజకీయ ప్రస్థానంలో మైలురాయిగా నిలిచిపోతుందని అన్నారు. వరంగల్ బిడ్డనైన తాను మంత్రిగా వున్న సమయంలో వరంగల్ ప్రజల చిరకాల వాంఛ అయిన మామునూరు ఎయిర్ పోర్టుకు మోక్షం లభించడం ఎంతో భావోద్వేగాన్ని కలిగిస్తున్నదని మంత్రి సురేఖ పేర్కొన్నారు. మామూనూరు ఎయిర్ పోర్టు ఏర్పాటుకు పట్టువదలకుండా శ్రమించి అనుకున్నది సాధించిన సీఎం రేవంత్ రెడ్డి గారికి ఈ సందర్భంగా మంత్రి సురేఖ కృతజ్ఞతలు తెలిపారు. దీంతో పాటు వర్షాకాలంలో కాకతీయ మెగా టెక్స్‌టైల్‌పార్కుకు పొంచి వున్న ముంపును నివారించేందుకు గాను అవసరమైన పనులు చేపట్టే నిమిత్తం రూ.160.92 కోట్లను విడుదల చేస్తూ ప్రభుత్వం మరో జీవో విడుదల చేయడం పట్ల మంత్రి సురేఖ సీఎం రేవంత్ రెడ్డిగారికి ధన్యావాదాలు తెలిపారు.

# క్షిపణి పరీక్ష సక్సెస్

(మొదటి పేజీ తరువాయి)

డిఆర్‌డిఒ శాస్త్రవేత్తలను రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు. అంతే కాకుండా పరీక్షకు సంబంధించిన వీడియోను కూడా పోస్ట్ చేశారు. శబ్ద వేగానికి ఐదు రెట్ల కంటే అధిక వేగంతో ఈ హైపర్ సోనిక్ క్షిపణి ప్రయాణించగలదు. అంటే సుమారు గంటకు ఇది 6,200 కిలోమీటర్లకు పైగా వేగం. దీనికి ఘన ఇంధన ఇంజిన్ అమర్చి ఉండటం వల్ల దాదాపు 30 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకుంటుంది. అక్కడి నుంచి రాకెట్ ఇంజిన్ విడిపోతుంది. దీనికి అమర్చిన గ్లైడ్ వెహికల్ లక్ష్యం దిశాగా దూసుకుపోతుంది. అదే ఖండాంతర క్షిపణులు అయితే, భూమి నుంచి చాలా ఎత్తుకు వెళ్లి బాలిస్టిక్ గమనంలో లక్ష్యంపై పడతాయి. వీటిని రాడార్లు ట్రాక్ చేయడం తేలిక. కానీ, హైపర్ సోనిక్ క్షిపణి పూర్తి భిన్నం. ఇది రాడార్ పరిధిలోకి వచ్చేసరికే శత్రువు స్పందించడానికి అతి స్వల్ప సమయం ఉంటుంది. దీంతో లక్ష్యాన్ని తేలిగ్గా ఛేదించేస్తుంది.

# నిరసన 'జ్వాలల్లో' మణిపూర్

(మొదటి పేజీ తరువాయి)



బిజెపి ఎమ్మెల్యే వై.రాధేశ్యామ్, థౌబాల్ జిల్లాలోని వాంగ్‌జింగ్ టెంథాస్ బిజెపి ఎమ్మెల్యే పావోనమ్ బ్రోజెన్, ఇంఫాల్ తూర్పు జిల్లాలో ఖుంద్రక్‌పామ్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టిహెచ్. లోకేశ్వర్ నివాసాలకు నిప్పుపెట్టాయని అధికారులు తెలియజేశారు. అయితే కోపోద్రిక్తులైన అల్లరిమూకలు శాసనసభ్యుల నివాసాల ప్రాంగణాలను ముట్టడించినప్పుడు వారి కుటుంబ సభ్యులు ఆ నివాసాలలో లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. అయితే అల్లరిమూకలు నివాసాలలోని ప్రాపర్టీని ధ్వంసం చేసి, ఇళ్లకు నిప్పంటించారని పోలీసులు చెప్పారు. ఈ సంఘటనలలో ఇళ్లు పాక్షికంగా కాలిపోయాయన్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపకదళ సిబ్బంది హుటాహుటిని సంఘటనా స్థలికి చేరుకుని మంటలు పూర్తిగా ఇళ్లను దగ్ధం చేయకముందే మంటలను చల్లార్చారు. అయితే శనివారం రాత్రి ఇంఫాల్ తూర్పులోని లువాంగ్ షాంగ్బమ్ వద్దనున్న ముఖ్యమంత్రి బీరెన్‌సింగ్ పూర్వీకుల నివాసం వైపు నిరసనకారులు దూసుకువెళుతుండగా భద్రతాబలగాలు వారిని నివాసానికి సమీపంలో 100200మీటర్ల దూరంలోనే నిలువరించారు. ముఖ్యమంత్రి బీరెన్ సింగ్‌అస్సాం రైఫిల్స్, సరిహద్దు భద్రతా బలగాలు (బిఎస్ఎఫ్), రాష్ట్ర బలగాలు పలు రౌండ్లు భాష్పవాయుగోళాలను, వారిపైకి ప్రయోగించారు. రబ్బరు బుల్లెట్లను నిరసనకారులపైకి కాల్చారు. ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ ఇంటిని ముట్టడించే ప్రయత్నాన్ని భద్రతా బలగాలు అడ్డుకున్నాయని అధికారులు చెప్పారు. మంత్రిపుఖ్రీ ఏరియాలో రాత్రి 11గంటల వరకూ ముఖ్యమంత్రి పూర్వీకుల నివాసానికి 34 కి.మీల వద్ద గుమికూడిన నిరసనకారులు తమ నిరసనలను కొనసాగించారు. అయితే చాలామంది నిరసనకారులు ఇతర అసెంబ్లీ నియోజకవర్గాలనుంచి వాహనాలపై ఇక్కడకు చేరుకుని ఆందోళన కొనసాగించారని అధికారులు 'పిటిఐ'కి తెలిపారు. నిరసనకారులు ముఖ్యమంత్రి ప్రాతినిథ్యం వహిస్తున్న హీన్‌గ్యాంగ్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన వారు మాత్రం కాదని చెప్పారు. ఆదివారం ఉదయం నాటికి ఇంఫాల్ లోయలోని 5జిల్లాలలో నిరవధిక కర్ఫ్యూ కొనసాగి పరిస్థితి ప్రశాంతంగానే ఉన్నప్పటికీ, ప్రజల్లో టెన్షన్ మాత్రం చల్లారలేదు. ఇంటర్నెట్ సర్వీసులను సస్పెండ్ చేశారు. జిరిబం జిల్లాలో ముగ్గురు మహిళలు వారి పిల్లలు సహా ఆరుగురిని మిలిటెంట్లు అపహరించిన తర్వాత ఆరుగురు వ్యక్తుల మృతదేహాలు కనుగొన్న తర్వాత హింసాత్మక నిరసనలు ప్రజ్వరిల్లాయి. హింసాత్మక సంఘటనలు చోటుచేసుకున్న మరుసటి రోజు తర్వాత ఇంఫాల్‌లో ఎటుచూసినా రోడ్లవైపు శిథిలాలే కనిపించాయి. శనివారం రాత్రి ఎమ్మెల్యేల నివాసాలపై నిరసనకారులు దాడులు జరిపిన నేపథ్యంలో వారి ఇళ్ల వద్ద, సెక్రటేరియట్, రాష్ట్ర బిజెపి ప్రధాన కార్యాలయానికి వెళ్లే ప్రధాన రోడ్లవైపు భద్రతా బలగాలు భారీ యెత్తున పెట్రోలింగ్‌ను ఉధృతం చేశాయి. భారీ సంఖ్యలో భద్రతా బలగాలు కూడా అక్కడ మోహరించాయి.

**'అఫ్‌స్పా'ను ఉపసంహరించాలని కేంద్రానికి మణిపూర్ ప్రభుత్వం అభ్యర్థన**

మణిపూర్ ప్రభుత్వం రాష్ట్రంలోని ఆరుపోలీస్ స్టేషన్ల పరిధి కిందకు వచ్చే 'అఫ్‌స్పా'ను ఉపసంహరించుకుని సమీక్షించాలని కేంద్రప్రభుత్వాన్ని కోరింది.రాష్ట్రంలో హింసచోటుచేసుకున్న జిరిబం జిల్లా సహా ఆరు పోలీస్ స్టేషన్లలో కేంద్ర ప్రభుత్వం ఆర్మ్‌డ్ ఫోర్సెస్ (స్పెషల్ పవర్స్)యాక్ట్ 1958ను పునరుద్ధరించిన విషయం విదితమే. శనివారం కేంద్ర సహాయ కార్యదర్శి (హోం) నుంచి వచ్చి న ఒక లేఖలో 'మణిపూర్ రాష్ట్ర మంత్రివర్గం నవంబరు 15న నిర్వహించిన సమావేశంలో ఇదే (అఫ్‌స్పాను తిరిగి విధించడం) గురించి చర్చించిందని ప్రస్తావించింది.రాష్ట్రంలోని 6 పోలీస్ స్టేషన్ల పరిధిలోకి వచ్చే ప్రాంతాల ప్రకటనను సమీక్షించి ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని సూచించింది. అఫ్‌స్పా 1958సెక్షన్ 3కింద ఆటంకంచెందిన ప్రాంతాలుగా ప్రజా ఆసక్తికి సంబంధించి 14–11–2024 నాటి నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలని, దయతో సమీక్షించాల్సిందిగా అభ్యర్థించబడిందని పేర్కొంది. కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ నవంబరు 14న అఫ్‌స్పాను సెక్మాయి పోలీస్‌స్టేషన్, ఇంఫాల్ పశ్చిమ జిల్లాలోని లాంసాంగ్ పోలీస్‌స్టేషన్, బిష్ణుపూర్‌లోని మొయిరాంగ్, కాంగ్‌పోక్పిలోని లీమఖోంగ్, జిరిబం జిల్లాలోని జిరిబంలో అఫ్‌స్పాను పునరుద్ధరించింది.

# ర్యాగింగ్‌పై కఠినం

(మొదటి పేజీ తరువాయి)

దామోదర రాజనర్సింహ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 'గుండెపోటు రోగిని మధ్యలో వదిలేసి వెళ్లిన 108 డ్రైవర్' సంఘటన విచారణకు మంత్రి ఆదేశించారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తు లో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా 108 సేవలను అందించేందుకు సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో వైద్య ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టిందన్నారు గిరిజన, గ్రామీణ ప్రాంతాలతో పాటు అర్బన్, పట్టణ ప్రాంతాలలో ఏదైనా అత్యవసర పరిస్థితులలో 108 నెంబర్‌కు సమాచారం వచ్చిన వెంటనే మిషన్ ఆఫ్ సేవింగ్ లైవ్స్‌లో భాగంగా అత్యల్ప సమయం లో ఘటనాస్థలానికి వేగంగా చేరుకుని, ప్రథమ చికిత్స అందించి,దగ్గరలోని ఆసుపత్రికి తరలిస్తారని వివరించారు. సేవింగ్ లైవ్స్‌లో వైద్య సేవలు అందేలా భౌగోళికంగా నెట్వర్క్‌ను రూపొందిస్తున్నామని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు.

**పారదర్శకంగా ఉద్యోగాల భర్తీ..**

విద్యార్హతలు, రాతపరీక్షలు ఇతర నిబంధన ప్రకారమే ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరుగుతుందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. ఇందులో ఎటువంటి రాజీలేదని, ఉద్యోగాలు ఇప్పిస్తామని దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని నిరుద్యోగులకు ఆయన సూచించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసే వారి సమాచారాన్ని పోలీసులకు ఇవ్వాలని,వారిపైన ఫిర్యాదు చేయాలని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు మోసగాళ్ల సమాచారాన్ని అందజేయాలని ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా 11 నెలల్లోనే 7 వేల పైచిలుకు పోస్టులను భర్తీ చేశామనిగుర్తు చేశారు. మరో 2322 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులు,732 ఫార్మసిస్ట్(గ్రేడ్ 2) పోస్టులు, 1284 ల్యాబ్ టెక్నీషియన్లు, 435 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు, 156 ఆయుష్ మెడికల్ ఆఫీసర్లు, 45అసిస్టెంట్ ప్రొఫెసర్(ఎంఎన్‌జె) పోస్టులు,24 ఫుడ్ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని వివరించారు. భవిష్యత్తులో మరిన్ని పోస్టులకు నోటిఫికేషన్లు జారీ కానున్నాయని మంత్రి తెలిపారు.

# కల్తీపై ఉక్కుపాదం

(మొదటి పేజీ తరువాయి)

నిందితులను అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్స్, బోయిన్ పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోనీ గోల్ అల్లం వెల్లుల్లి పేస్టు కంపెనీ పేరిట నకిలీ అల్లం వెల్లుల్లి వ్యాపారం నిర్వహిస్తున్న మేనేజర్ మొహమ్మద్ సమీర్ అన్సారీ, పంపిణీదారుడు మహమ్మద్ గుల్ఫ్రోజ్, అసిస్టెంట్ మేనేజర్ మహమ్మద్ ముక్తార్, రంజిత్ కుమార్, మోను కుమార్, బీర్వాల్ సాహు, ఇనాయత్, మహేష్ కుమార్ లను అరెస్టు చేశారు. సుమారు రూ.4 లక్షల 50 వేల రూపాయల విలువగల 1500 కిలోల వెల్లుల్లి పేస్ట్, 55 కిలోల సిట్రిక్ యాసిడ్, మిశ్రమ యంత్రం, గ్రైండర్ మెషిన్, తూకం వేసే యంత్రం, పాడైన పచ్చి వెల్లుల్లి 40 కిలోలవి 12 బస్తాలు, తేదీలు వేసే 2 స్టాంపులు, 2 ఇంక్ సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పరారీలో ఉన్న నిందితుడు మహ్మద్ షకీల్ అహ్మద్ సికింద్రాబాద్‌లోని ఓల్డ్ బోయిన్‌పల్లి రాజరాజేశ్వరి నగర్‌లో సోనీ జింజర్ గార్లిక్ పేస్ట్ ఖార్కానా నిర్వహిస్తున్నాడని, మహమ్మద్ సమీర్ అన్సారీ మేనేజర్గా, మొహమ్మద్ గుల్ఫాజ్ డిస్ట్రిబ్యూటర్ గా, ముక్తార్ కుక్ కమ్ అసిస్టెంట్ మేనేజర్ గా రంజిత్ కుమార్, సోను కుమార్, బిర్వాల్ సాహు, ఇనాయత్, మహేష్ కుమార్ వర్కర్లుగా పనిచేస్తున్నారని పోలీసులు తెలిపారు. కంపెనీ నిర్వాహకుడు కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను తయారు చేస్తున్నాడని, అది కూడా అపరిశుభ్రమైన స్థితిలో, సిట్రిక్ యాసిడ్ కలిపి వాటిని కుళ్లిన స్థితిలో ఉన్న ప్లాస్టిక్ టబ్బులో రోజుల తరబడి భద్రపరచడం, ఆపై ప్లాస్టిక్ కంటైనర్లలో ప్యాక్ చేయడం, ఆ ఉత్పత్తులపై నకిలీ స్టాంపులు, లేబుల్ లతో బహిరంగ మార్కెట్లో అక్రమంగా అమ్ముతున్నాడని తెలిపారు.

# బిఆర్ఎస్‌కు యావ



(మొదటి పేజీ తరువాయి)

పేరుతో దేశంలోనే ఎక్కువ ఆదాయం సమకూర్చుకున్న ప్రాంతీయ పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని,ఇతర రాష్ట్రాల్లో పార్టీ లేకున్నా మూటలు తీసుకుని పోయి ఇచ్చిన చరిత్ర బీఆర్ఎస్ ది అని అన్నారు.కులాలను, మతాలను, వర్గాలను రెచ్చగొట్టడమే బీఆర్ఎస్ పని అని, బీజేపీ దుర్మార్గ పాలన కు వ్యతిరేకంగా దేశాన్ని ఐక్యం చేసేందుకు పోరాడుతున్న కాంగ్రెస్ ను బీఆర్ఎస్ కావాలనే టార్గెట్ చేసిందన్నారు. ప్రభుత్వ పథకాల మీద దుష్ప్రచారం చేస్తున్నారని, అధికారం, రాజకీయం తప్ప బీఆర్ఎస్ కు మరో యావ లేదని, బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టే విధంగా ప్రగతి సభను నిర్వహిస్తాం అన్నారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు, సంక్షేమ నిధులు కల్పించేందుకే కుల గణన సర్వే నిర్వహిస్తున్నామని, గత ప్రభుత్వం కేవలం లిమ్కా బుక్ రికార్డుల కోసం ఒక రోజులోనే సర్వేను ముగించిందని,కనీసం సర్వే వివరాలను బయట పెట్టలేదన్నారు. సర్వే ఆదారంగా ఉద్యోగాలు, ఉపాధి, రిజర్వేషన్లు పెంచలేదని, సామాజిక, రాజకీయ, ఆర్థిక, ఉద్యోగ ఉపాధి అవకాశాలను మెరుగు పరించేందుకు మేము సర్వే నిర్వహిస్తుంటే అడ్డుకోమని పిలుపునిస్తారా? అని ప్రశ్నించారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించేందుకు సర్వే చేపడితే బీఆర్ఎస్ ఓర్వ లేకపోతున్నదని, ఏడాదికాలంలో ప్రజా ప్రభుత్వం చేసిన మంచి పనులు వివరిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, నగర మేయర్ గుండు సుధారాణి, మున్సిపల్ కమీషనర్ అశ్విని తానాజి వాకడే,కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, ములుగు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్,టీపీసీసీ జనరల్ సెక్రటరీ కుచన రవళి, వివిధ శాఖల అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### స్థానిక సంస్థలలో రిజర్వేషన్ అమలుపై..

# నిర్ణీత సమయంలో ప్రభుత్వానికి నివేదిక

కమిషన్ చైర్మన్ భూసాని వెంకటేశ్వరరావు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** స్థానిక సంస్థలలో రిజర్వేషన్ అమలు చేసేందుకు వివిధ సంఘాల నుంచి వచ్చిన ప్రతిపాదనలను క్రోడీకరిస్తూ నివేదికను ప్రభుత్వానికి నిర్ణీత సమయంలో సమర్పిస్తామని తెలంగాణ వెనకబడిన తరగతుల డెడికేషన్ కమిషన్ చైర్మన్ భూసాని వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఖమ్మం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో స్థానిక సంస్థలలో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ల గుర్తింపును పేర్కొనే అంశంపై ఉమ్మడి జిల్లా పరిధిలో నిర్వహించిన బహిరంగ విచారణలో తెలంగాణ వెనకబడిన తరగతుల డెడికేషన్ కమిషన్ చైర్మన్ భూసాని వెంకటేశ్వరరావు, సెక్రటరీ బి.సైదులు, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డితో కలిసి పాల్గొన్నారు. తొలుత కలెక్టరేట్ ఆవరణలో రిజిస్ట్రేషన్ సెంటర్, నమోదు కేంద్రాన్ని కమిషన్ చైర్మన్ పరిశీలించారు. అనంతరం వివిధ సంఘాల వ్యక్తుల నుండి విజ్ఞప్తులను స్వీకరించారు. కమిషన్ చైర్మన్‌కు వడ్డెర సంఘం, సంచార జాతులు, విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ, ముస్లిం మైనార్టీ, మత్స్యకారులు, ఆలిండియా ఒబిసి కులాల, పూసల, చాకలి, దూదేకుల, యాదవ, గొల్ల, కురమ, సంచార ముస్లిం జాతి, కుమ్మరి, ఎంబిసి, వివిధ సంఘాల ప్రతినిధులు స్థానిక సంస్థలలో రిజర్వేషన్ దామాషా అమలు, తమ వర్గాలకు ఉన్న వివిధ సమస్యలపై అభిప్రాయాలు తెలుపుతూ విజ్ఞప్తులు అందజేశారు.




ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ భూసాని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్థానిక సంస్థలలో వెనుకబడిన తరగతుల ప్రజల రిజర్వేషన్ దామాషా ఖరారు చేసేందుకు ప్రభుత్వం డెడికేటెడ్ బిసి కమిషన్‌ను ఏర్పాటు చేసిందని తెలిపారు. రిజర్వేషన్ సంబంధిత అంశాలు మాత్రమే తెలియజేయాలని మిగిలిన అంశాలు బిసి కమిషన్ పర్యటనలో తెలపాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన సర్వేలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ కింద వృత్తుల జనాభా వివరాలు, విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ కింద నమోదు చేసి గుర్తించాలని కోరగా ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని కమిషన్ చైర్మన్ తెలిపారు. కార్పొరేటివ్ సొసైటీ యాక్ట్ కింద నిర్వహించే ఎన్నికలు రాష్ట్ర ఎన్నికల సంఘం పరిధిలోకి రావని ఆ అంశం తన పరిధిలో లేదన్నారు. స్థానిక సంస్థలలో వెనకబడిన తరగతుల రిజర్వేషన్ దామాషా అమలుపై వివిధ సంఘాల ప్రతినిధుల నుంచి సేకరించిన ప్రతిపాదనలు, అభిప్రాయాలను ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం నెలలో నివేదిక ఇవ్వనున్నట్లు చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమశాఖ ఉప సంచాలకులు వి. రమేష్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల బిసి సంక్షేమ అధికారులు జి.జ్యోతి, ఈ. ఇందిర, బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత, సహాయ బిసి సంక్షేమ అధికారులు, వసతి గృహ సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మెడికల్ షాప్‌లపై అధికారుల ఆకస్మిక దాడులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** డ్రగ్ కంట్రోల్ (డిసిఎ) అధికారులు నగరంలోని మెడికల్ షాపులపై ఆదివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల్లోని మెడికల్ షాపులపై ఈ తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా సికింద్రాబాద్ సీతాఫల్‌మండిలోని గాయత్రి మెడికల్ స్టోర్లలో మందులు సీజ్ చేశారు. రూ.1.25 లక్షల విలువగల 45 రకాల మందులు సీజ్ చేశారు. గడువు ముగిసిన మందుల నిల్వలు ఉండడం, అబార్షన్ మెడిసిన్ అనధికారికంగా విక్రయిస్తుండడాన్ని అధికారులు గుర్తించారు. గాయత్రి మెడికల్ షాపు నిర్వహకుడిపై కేసు నమోదు చేశారు. రామంతాపూర్‌లోని ఓ మెడికల్ షాపులోనూ నిర్వహించిన తనిఖీలో విస్తుపోయే నిజాలు వెలుగు చూశాయి. కంటి ఇన్ఫెక్షన్ నివారణ కోసం అమ్ముతున్న నకిలీ మెడిసిన్‌ను సీజ్ చేశారు.

### 19న కాంగ్రెస్ ప్రజాపాలన

# విజయోత్సవ సభ

మంత్రి కొండా సురేఖ

ఏడాది పరిపాలన సందర్భంగా ప్రజలకు సిఎం రేవంత్‌రెడ్డి సందేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఈనెల 19న హన్మకొండ ఆర్ట్స్ కాలేజీ మైదానంలో కాంగ్రెస్ 'ప్రజాపాలన విజయోత్సవ సభ' నిర్వహిస్తున్నట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. హైదరాబాద్‌లో కొండాసురేఖ మీడియాతో మాట్లాడుతూ.. సిఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రజాప్రభుత్వానికి డిసెంబర్ 7తో ఏడాది కాలం ముగుస్తుందని, దశాబ్ది నియంతృత్వ పాలన నుంచి ప్రజాస్వామ్య పాలనలోకి తెలంగాణ రాష్ట్రం వచ్చిందని తెలిపారు. ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. ప్రజా శ్రేయస్సు, వికాసమే లక్ష్యం దిశగా సిఎం రేవంత్ రెడ్డి కార్యాచరణ అమలు చేస్తున్నారన్నారు. ప్రజాపాలన విజయోత్సవ సభ వేదికగా ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పునరంకితమవుతుందన్నారు. ఈ విజయోత్సవ సభ వేదికగా సిఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు తన సందేశాన్ని అందించనున్నారని తెలిపారు. ప్రజాపాలన విజయోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు, ప్రజలకు కొండా సురేఖ పిలుపునిచ్చారు. ప్రజలు నియంతృత్వపాలనకు చరమగీతం పలికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని ఎన్నుకుని డిసెంబర్ 7 నాటికి ఏడాది పూర్తి కానున్న శుభ సందర్భంలో నవంబర్ 19న హన్మకొండ ఆర్ట్స్ కాలేజీలో తలపెట్టిన ప్రజాపాలన విజయోత్సవ సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు, ప్రజలకు మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజా సంక్షేమానికి పునరంకితమవుతున్నదని మంత్రి సురేఖ అన్నారు. ఇందిరమ్మ రాజ్య స్థాపనే లక్ష్యంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని వేల కోట్ల రూపాయల రుణాలను అందిస్తూ, వారి స్వయం సాధికారత దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తున్నదని అన్నారు. ఇందిరమ్మ పేరు వినపడని, కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలు పొందని గ్రామమే వుండదని మంత్రి తేల్చి చెప్పారు. ఇందిరమ్మ సంక్షేమ పాలనను కాంగ్రెస్ ప్రభుత్వం మళ్ళీ తెచ్చిందని మంత్రి సురేఖ తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి జోడెద్దులుగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన పరుగులు పెడుతున్నదని అన్నారు.

ప్రజల శ్రేయస్సు, వికాసమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు రాహుల్ గాంధీ, సోనియా గాంధీల నిర్దేశకత్వంలో ఇచ్చిన డిక్లరేషన్లను అమలు చేస్తూ కాంగ్రెస్ పార్టీ సమర్థ కార్యాచరణతో ముందుకు సాగుతున్నదని మంత్రి సురేఖ తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి ప్రజలకు సందేశానిస్తారన్నారు.

## వరి దిగుబడిలో తెలంగాణ రికార్డ్

66.77 లక్షల ఎకరాలలో 153 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పుడు గానీ తెలంగాణ ఏర్పడ్డాక గానీ ఈ రికార్డ్ అమోఘం

మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** వరి దిగుబడిలో తెలంగాణ రాష్ట్రం రికార్డును సృష్టించిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రకటించారు. మొత్తం 66.77 లక్షల ఎకరాల్లో వరి సాగుచేస్తే 153 లక్షల ధాన్యం దిగుబడి కావడం తెలంగాణ రైతులు సాధించిన ఘన విజయమని ఆయన అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో ఇక్కడ ధాన్యం కొనుగోళ్లు, ధాన్యం దిగుబడిపై మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. ధాన్యం దిగుబడి ఘనత ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు చెందిన మూడు బ్యారేజ్‌లు పనిచేయకపోయినా వరి దిగుబడిలో సాధించిన ఈ రికార్డ్ రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతుందన్నారు. రైతాంగానికి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోందనడానికి రికార్డ్ స్థాయిలో పండిన పంట నిదర్శనమన్నారు. రాష్ట్ర చరిత్రలోనే కాకుండా యావత్ భారతదేశంలొనే ఇంతటి ధాన్యం దిగుబడి అరుదైన రికార్డ్ అని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ తెలంగాణ ప్రాంతంలో ఇంతటి పంట పండిన సందర్భం లేదన్నారు. ప్రభుత్వంతో మమేకమైన రైతులు అంకితభావంతో చేసిన సాగుతోటే ఈ విజయం సాధ్యమైందని, అందుకు తెలంగాణ రైతులకు అభినందనలు తెలియజేశారు.

## ప్రభుత్వాలు మారినా తీరని విద్యార్థుల గోస

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి మండిపడ్డారు. అధికారంలోకి వచ్చి పదకొండు నెలలు గడుస్తున్నా విద్యారంగంపై ఎన్నికల్లో ఇచ్చిన హామీల ఊసే లేదన్నారు. విద్యాశాఖ తనవద్దే ఉంచుకుని కనీసం ఇంతవరకు సమీక్షించలేని పరిస్థితిలో సిఎం ఉన్నారని దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలకు చేస్తున్న విధానాలకు పొంతన లేదని, ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయకపోతే విద్యార్థి లోకం ప్రభుత్వం తిరుగుబాటు చేస్తారని ఆయన ఒక ప్రకటనలో హెచ్చరించారు. గడిచిన పది సంవత్సరాల కాలంలో గత పాలకులు విద్యారంగాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించారన్నారు. వారి వైఖరి కారణంగా విద్యార్థి, యువత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవచ్చు అనే భావనతో కాంగ్రెస్ గెలుపు కోసం పనిచేశారన్నారు. కానీ నేడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత పాలకులవలె వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. బాసర ట్రిపుల్ ఐటి సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నా విద్యార్థులను పట్టించుకునే పరిస్థితుల్లో అధికారులు లేరన్నారు. వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యారంగంపై సమీక్షించి సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ ఫీజు బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులను సమీకరించి సమస్యల పరిష్కారానికై ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## సిఎం, మంత్రులకు ఘన స్వాగతం



**ప్రజాపక్షం/నిజాంసాగర్ :** మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా నాందేడ్‌కు వచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు ఘన స్వాగతం పలికారు. మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థిని గెలిపించుకునే దిశగా తెలంగాణ మంత్రులు ముమ్మర ప్రచారం నిర్వహిస్తున్నారు. వారితో పాటు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ, జహిరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ షెట్కార్, ఇతర కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

## మంచి కార్యక్రమాలను ఎంఎల్‌ఎలు, ఎంపిలు అడ్డుకోవడం దారుణం

మంత్రి శ్రీధర్‌బాబు



**ప్రజాపక్షం / హైదరాబాద్:** మూసీ ప్రక్షాళన లాంటి మంచి కార్యక్రమాలకు ఎంపిలు, ఎంఎల్‌ఎలు అడ్డుపడటం దారుణమని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. బిజెపి నేతల మూసీ నిద్రపై మంత్రి శ్రీధర్ బాబు స్పందించారు. ఆదివారం ఆయన సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. కిషన్ రెడ్డికి ఇప్పటికైనా మూసీ బాధితుల సమస్యలు ఏంటో తెలిసి ఉండాలని అన్నారు. కలుషిత నీరు, గాలి మధ్య దుర్భర జీవితం గడుపుతున్నారని తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న ఇంత మంచి కార్యక్రమానికి ఎంపిలు, ఎంఎల్‌ఎలే అడ్డు పడటం దారుణం అని అన్నారు. గోడలు కడితే సరిపోతుందని బిజెపి నేతలు అంటున్నారు. డిపిఆర్ వచ్చాక ఏంచేయాలనే దానిపై సలహాలు ఇవ్వాలని సూచించారు. మూసీ ఒడ్డున మూడు నెలలు ఉండాలని సిఎం రేవంత్ రెడ్డి సవాల్ చేస్తే.. ఒక్క రోజు గడిపి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. మూసీ నిర్వాసితుల కష్టాలు తెలవాలంటే అక్కడికి వెళ్లి ఉండాలి కానీ, నిద్ర పూర్తయిన వెంటనే ప్రభుత్వంపై విమర్శలు చేయడం కరెక్ట్ కాదని అన్నారు. మూసీ ప్రజలకు మంచి నీరు, మంచి ఇల్లు, ఉపాధి కల్పించాలని ప్రభుత్వం చూస్తోందని అన్నారు.

## ప్రశాంతంగా గ్రూప్‌–3 పరీక్షలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర వ్యాప్తంగా గ్రూప్ 3 పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు నిర్వహించిన రెండు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం పేపర్ 1, మధ్యాహ్నం పేపర్ 2 పరీక్షలు జరిగాయి. పరీక్ష సమయానికి ఒక గంట ముందు నుంచే అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి ఇచ్చారు. ఆలస్యంగా వచ్చిన పలువురు అభ్యర్థులను అధికారులు పరీక్ష కేంద్రాలకు అనుమతించలేదు. దీంతో కొన్ని పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులు అక్కడి సిబ్బందితో వాదనకు దిగారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సెక్షన్ 144ను అమలు పరిచారు. గ్రూప్3 ద్వారా 1,365 పోస్టుల నియామకాల కోసం 5,36,000 అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 1,401 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా గ్రూప్3 పరీక్షల్లో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న జాతీయ అవార్డ్స్‌కు చెందిన '2024లో ప్రకటించిన 70వ జాతీయ చలనచిత్ర అవార్డులలో, 2022 సంవత్సరానికి గాను ఉత్తమ డాక్యుమెంటరీ అవార్డు పొందింది ఎవరు?, అనే ప్రశ్నతో పాటు అలాగే ఆస్కార్ అవార్డు 2024కు నామినేట్ చేసిన డాక్యుమెంటరీ చలనచిత్రం 'టు కిల్ ఎ టైగర్' దర్శకుడు ఎవరు? అనే రెండు ప్రశ్నలు వచ్చాయి.

### న్యాయవాదుల రక్షణ చట్టం అమలుతో..

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యం

ఐఎఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్

**ప్రజాపక్షం /మహబూబ్‌గనర్ ప్రతినిధి :** ఆదివారం నాడు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ఉమ్మడి మహబూబ్‌గనర్ జిల్లా ఇండియన్ అసోసియేషన్ లాయర్స్ యూనియన్ మహాసభలు జిల్లా అధ్యక్షులు బి.పరమేష్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలకు ముఖ్య అతిథిగా ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ విచ్చేసి వారి సందేశం ఇచ్చారు. ఈ మహాసభను ఉద్దేశించి వారు మాట్లాడుతూ రాష్ట్రంలో న్యాయవాదులపై దాడులు జరుగుతున్నా కూడా నేటికీ వారి రక్షణ చట్టం తీసుకురావడంలో పాలకవర్గాలు వెనుకంజ వేస్తున్నారని వారు ఎద్దేవా చేశారు. దేశ స్వాతంత్ర పోరాట కాలం నుంచి మొన్న జరిగిన తెలంగాణ పోరాటంలో కూడా న్యాయవాదుల పాత్ర అమోఘమైంది, కానీ వారిపై జరుగుతున్న దాడులకు రక్షణ లేకుండాపోయిందని వారు వాపోయారు. నేటికీ న్యాయవాదులు తమ వృత్తిని నిర్వహిస్తూనే సామాజిక అంశాల పట్ల వారి కృషి అమోఘమైందని వారు అన్నారు. భారత రాజ్యాంగాన్ని అమలు చేయడంలో పాలకులు వెనుకంజ వేస్తున్నారని వారు అన్నారు. సెక్షన్ 41 సిఆర్‌పిసిని తక్షణమే ఎత్తేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని వారన్నారు. జూనియర్ న్యాయవాదులకు 5000 రూపాయలు ప్రతినెల ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హెల్త్ డెత్, బెనిఫిట్ స్కీమ్స్‌ను 20 లక్షలు పెంచాలని వారు డిమాండ్ చేశారు. ప్రతి జిల్లాలో ఇండ్లు లేని న్యాయవాదులకు ఇండ్లు కేటాయించేటట్లు చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని వారన్నారు. రాష్ట్రంలో జిల్లా కోర్ట్స్‌కు నూతన భవనాలను తక్షణమే నిర్మించాలని వారు ప్రభుత్వం డిమాండ్ చేశారు. న్యాయవాదుల వృత్తి రక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు అన్నారు. ఐఎఎల్ సంఘం ప్రజాస్వామిక వాదులతో ఏర్పడిన సంఘంని స్థాపించిన వారిలో జస్టిస్ కృష్ణ అయ్యర్, జస్టిస్ పిఎస్ భగవతి, జస్టిస్ డిఎన్ దేశాయ్, జస్టిస్ చిన్నపరెడ్డి, సిపద్మానాభరెడ్డి ముఖ్యులు. వారి ఆశయ సాధనలో ఐఎఎల్ సంఘాన్ని బలోపేతం చేయాలని ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద ఎత్తులో పాల్గొన్న న్యాయవాదులను ఉద్దేశించి వారు అన్నారు. మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెక్కం జనార్దన్ మాట్లాడుతూ....జూనియర్ న్యాయవాదులు తమ వృత్తి పట్ల నిబద్ధతతో ఉండి వృత్తిలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని వారు అన్నారు. బిర్ విల్సన్, బి.రాము, దత్తాత్రేయ, రమేష్, ఆర్ ఆర్ మన్యం, శేఖరయ్య, జెసి కుర్మయ్య, నిరంజన్, సలీం, వెంకట్రావు, జగదీష్, రాజు, చేతను, ఎన్ వి మహేష్, నరసింహ, రామకృష్ణ గౌడ్, ఉబేద్, సజ్జత్ అమేద్, వేణుగోపాల్ గౌడ్, శివరాం న్యాయవాదులు పాల్గొన్నారు.




## 22 ఇందిరా మహిళాశక్తి భవనాలకు గ్రీన్ సిగ్నల్

మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో 22 జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాలకు పరిపాలన అనుమతులు మంజూరు అయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా.. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపాలన విజయోత్సవ ఉత్సవాలు జరుపుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఈనెల 19న వరంగల్‌లో సిఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే భారీ బహిరంగ సభలో ఇందిరా మహిళాశక్తి భవనాలకు సిఎం శంకుస్థాపన చేయనున్నారు. కాగా తాజాగా ఈ 22 ఇందిరా మహిళాశక్తి భవనాల జాబితాను మంత్రి సీతక్క ఆదివారం విడుదల చేశారు. అలాగే ఆయా భవనాలకు పరిపాలనా అనుమతులు మంజూరు అయినట్టు మంత్రి పేర్కొన్నారు. ఒక్కో భవన నిర్మాణానికి రూ.5 కోట్ల చొప్పున 22 భవనాల నిర్మాణానికి రూ.110 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు జిల్లా కేంద్రాల్లో ఇందిరా మహిళా శక్తి భవన్‌లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈ భవనాలు నిర్మించనున్నారు. ఆయా జిల్లాల్లో మహిళ స్వయం సహాయక సంఘాలు వీటి నుంచి కార్యకలాపాలు సాగించనున్నాయి. ఇందిరా మహిళాశక్తి భవన్‌లలో పలు శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. మహిళలకు ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్, ఉత్పత్తుల ప్రదర్శన మేళాలు, జీవనోపాధి, ఆర్థిక కార్యకలాపాల నిర్వహణ తదితర కార్యకలాపాలు నిర్వహించనున్నారు.

### లగచర్ల ఘటనపై ఢిల్లీకి చేరిన భూబాధితులు

## జాతీయ ఎస్‌సి, ఎస్‌టి కమిషన్‌కు ఫిర్యాదు



రాహుల్‌గాంధీ కొడంగల్ రావాలి

బాధితుల విజ్ఞప్తి

**ప్రజాపక్షం / కొడంగల్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో ఫార్మా కంపెని భూసేకరణ ప్రజాభిప్రాయ సేకరణ సమావేశంలో జరిగిన దాడి ఘటనపై పోలీసులు వ్యవహరించిన తీరు పలు కీలక అంశాలపై జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసేందుకు భూబాధితులు ఢిల్లీకి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొడంగల్ నియోజకవర్గంలో రేవంత్‌రెడ్డి పాలనలో అతికిరాతకమైన పాలన సాగుతుందని మండిపడ్డారు. రాష్ట్రంలో మహిళలకు ఎక్కడ కూడా రక్షణ లేదని, పోలీసులు రాత్రి వేళల్లో కరెంటు తీసి మరీ ఇండ్లలోకి చొరబడి ఎక్కడబడితే అక్కడ చేతులు వేసి తాగిన మైకంలో ఇష్టానుసారంగా ప్రవర్తించడం సిగ్గుచేటుగా ఉందన్నారు. అధికారులను అడ్డుపెట్టుకుని గిరిజన లంబాడిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపడం సరికాదన్నారు.

### జేబు దొంగలకు అడ్డాలుగా..

# ప్రయాణ ప్రాంగణాలు

వరుస దొంగతనాలతో ప్రయాణీకులు బెంబేలు

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** నిజామాబాద్ జిల్లాలో ప్రయాణ ప్రాంగణాలు జేబు దొంగలకు అడ్డాలుగా మారాయి. పోలీసుల నిఘా వైఫల్యం దొంగలకు వరంగా మారుతుందా ? అంటే అవుననే అంటున్నారు బాధితులు. రోజు రోజుకు దొంగలు రెచ్చిపోతున్నారు. వరుస చోరీలకు పాల్పడుతూ ప్రయాణీకులను నిలువు దోపిడీ చేస్తున్నారు. జిల్లా కేంద్రం నుంచి వివిధ ప్రాంతాలకు రోజు వేల సంఖ్యలో ప్రయాణం చేస్తుంటారు. ఇదే అదనుగా తీసుకుని ప్రయాణీకులను దోచుకుంటున్నారు. దొంగతనాలను నియంత్రించేందుకు పోలీసు శాఖతో పాటు ఆర్‌టిసి అధికారులు చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నా దొంగతనాలు మాత్రం ఆగడం లేదు. బస్టాండ్, రైల్వేస్టేషన్లలో దొంగలున్నారు జాగ్రత్త అంటూ మైక్‌లో ప్రచారం ముమ్మరం చేస్తున్నా, గోడలపై పోస్టర్లు అతికిస్తున్నా మార్పు మాత్రం రావటం లేదు. నిత్యం ఫిర్యాదులు అందుతున్నా పోలీసులు మాత్రం కేసు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు తప్ప, రికవరీ శాతం తక్కువగానే ఉన్నట్లు తెలుస్తోంది. గతనెల రోజులుగా ప్రయాణ ప్రాంగణాలలో దొంగల ఆగడాలు మితిమీరి పోతున్నాయని ఆదమరిచి ఉంటే సామాగ్రి, సెల్‌ఫోన్లను ఎత్తుకెళుతున్నారని, బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చోరీలకు గురైన బాధితులు ఫిర్యాదు చేసిన వెంటనే పోలీసులు స్పందించకుండా కాలయాపన చేస్తున్నారని, సిసి కెమెరాల్లో అన్ని రికార్డు అయినప్పటికీ పోలీసు యంత్రాంగం దొంగలను పట్టుకోవడం లేదని నెలల తరబడి దొంగల ఆచూకీ కనిపెట్టడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. పోలీస్‌స్టేషన్లలో సిబ్బంది కొరత కారణంగా, బస్టాండ్‌లోని పోలీస్ బూత్‌లో సిబ్బంది కొరత స్పష్టంగా కనిపిస్తుంది. ఒకరిద్దరు పోలీసులు డ్యూటీలో ఉన్నప్పటికీ రాత్రులు మాత్రం వారు దొంగలపై నిఘా పెట్టకుండా తమకేమి పట్టనట్లుగా నిద్రావస్తలో ఉంటున్నారని ఆరోపిస్తున్నారు. బస్టాండ్ రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన కొన్ని సిసి కెమెరాలు సైతం పనిచేయడం లేదు. రైల్వేస్టేషన్, బస్టాండ్ ప్రాంతాల నుండి ప్రతిరోజు వేల సంఖ్యలో ఇతర ప్రాంతాలకు ప్రయాణం చేస్తుంటారు. వీరిలో ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నారు. చిరు దొంగలతో పాటు, దొంగల ముఠాల సైతం ఈ ప్రాంతాల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్నారని, ఇందుకోసం ప్రత్యేక పోలీస్ బృందాలు ప్రయాణ ప్రాంగణాలలో నిత్యం గస్తీ నిర్వహించాల్సి ఉంటుంది. దీంతో స్థానికంగా బూత్ సిబ్బంది దొంగలపై నిఘా ఏర్పాటు చేసి చోరీలను నియంత్రించే అవకాశమున్నప్పటికీ ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రయాణీకులు ఏ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా వారు నిలువు దోపిడీకి గరి కావటం ఇక్కడ సర్వసాధారణం అయిపోయింది. చోరీలకు పాల్పడే వారు నిత్యం అదే ప్రాంతంలో సంచరిస్తున్న పోలీసులు వారిని గుర్తించకపోవటం నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారుతుంది.




రైల్వేస్టేషన్ బస్టాండ్లలో డ్యూటీలు నిర్వహించే పోలీసులకు చేతివాటం ప్రదర్శించే దొంగలకు మధ్య సంబంధాలున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారి కనుసన్నల్లోనే దొంగతనాలు జరుగుతున్నట్లు గతంలో అనేక విమర్శలు వ్యక్తమైనా, ఇప్పటివరకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఇటీవల కాలంలో ప్రయాణీకుల సెల్‌ఫోన్ దొంగతనాలు నిత్యకృత్యమయ్యాయి. బస్టాండ్‌లోని ప్లాట్‌పాం వద్ద బస్సు కోసం వేచి ఉండే ప్రయాణీకులు ఏమాత్రం ఆదమరిస్తే చాలు దొంగలు విలువైన వస్తువులను చోరీ చేయడం ప్రతి రోజు జరుగుతున్నాయి. ఇకనైనా పోలీసు అధికారులు స్పందించి ప్రయాణ ప్రాంగణాలలో జరుగుతున్న చోరీలను నియంత్రించాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

ఫోకస్

# ఆరోగ్యం

## శస్త్రచికిత్సల్లో కృత్రిమ మేధ

ఇటీవల కాలంలో కృత్రిమ మేధ (ఎఐ) అన్ని రంగాల్లోనూ విస్తృతమవుతున్నది. వైద్య రంగంలోనూ ఎఐ గొప్ప సేవలు అందించగలదని మిచిగాన్ విశ్వవిద్యాలయం, కాలిఫోర్నియా శాన్ ఫ్రాన్సిస్కో విశ్వవిద్యాలయం పరిశోధనా బృందం ప్రకటించింది. 'సైన్స్ డైలీ'లో ప్రచురితమైన ఈ బృందం నివేదికను అనుసరించి, పరిశోధకులు అభివృద్ధి చేసిన ఎఐ ఆధారిత విధానం కేన్సర్ శస్త్రచికిత్సలో కీలక భూమిక పోషిస్తున్నది. కేన్సర్ సోకిన మెదడు కణితి (ట్యూమర్) అవశేషాలను ఈ ఎఐ మోడల్ కేవలం 10 సెకన్లలో గుర్తించడం విశేషం. సాధారణంగా కేన్సర్ శస్త్ర చికిత్సల్లో ఫాస్టిగ్లియోమా అని పిలిచే సాంకేతికతను ఉపయోగించి, కణితి అవశేషాలను గుర్తిస్తారు. ఇది సంప్రదాయ విధానానికి భిన్నం. తాజా ప్రయోగంలో ఎఐ ఆధారిత నమూనా ఈ అవశేషాలను కొన్ని సెకన్లలో గుర్తించింది. ఈ క్రమంలో ఎక్కడా పొరపాటు జరగకపోవడం విశేషం. మెదడులో ఏర్పడిన కణితిలో గ్లియోమాస్ వ్యాపించినప్పుడు రోగులకు తక్షణ చికిత్స అవసరమవుతుంది. వారికి సమగ్ర పరీక్షలు జరిపి, అవసరాన్ని బట్టి శస్త్ర చికిత్స నిర్వహిస్తారు. కొన్ని సందర్భాల్లో కేన్సర్ కణితికి చెందిన కొన్ని అవశేషాలు ఉండిపోతాయి. వాటిని గుర్తించడం దాదాపు అసాధ్యం. ఫాస్టిగ్లియోమా సాంకేతికతతో కొంత వరకూ పార్టికల్స్‌ను గుర్తించగలిగినా, పూర్తి ప్రయోజనం దక్కుతుందనే నమ్మకం లేదు. అయితే, చిన్న పొరపాటు కూడా లేకుండా ఎఐ ఆధారిత విధానం కణితికి చెందిన సూక్ష్మమైన అవశేషాలను కూడా సెకెన్ల వ్యవధిలో గుర్తించగలిగింది. ఈ ప్రయోగం కేన్సర్ వైద్య చరిత్రలో భారీ ముందడుగు. ఒక నాడీ శస్త్రవైద్యుడు రోగి యొక్క మెదడు నుండి ప్రాణాంతక కణితిని తొలగించినప్పుడు, ఎక్కడో ఒక చోట కొన్ని అవశేషాలు ఉండిపోయే అవకాశాలే ఎక్కువ కాబట్టి, ఆ సమస్యను ఎఐ పరిజ్ఞానం పరిష్కరిస్తున్నది. ఒక్కోసారి అవశేష కణితి కూడా ఆరోగ్యకరమైన మెదడును పోలి ఉండవచ్చు.



ఇలాంటి సందర్భాల్లో శస్త్ర చికిత్సలు సవాలుగా మారుతుంది. ఎఐ రంగ ప్రవేశంతో ఈ సమస్యకు తెరపడనుంది. గత 20 సంవత్సరాలుగా, న్యూరోసర్జరీ తర్వాత అవశేష కణితి రేట్లు మెరుగుపడలేదు. అందుకే, ఎఐ ఆధారిత విధానంపై కేన్సర్ నిపుణులు ఆశాభావంతో ఉన్నారు. ఫాస్టిగ్లియోమా సాంకేతికతను అభివృద్ధి చేయడానికి పరిశోధకులు సుమారు 11,000 శస్త్రచికిత్సా నమూనాలను, 4 మిలియన్ల ప్రత్యేకమైన మైక్రోస్కోపిక్ ఫిల్టర్లను ఉపయోగించి, విజుల్ ఫౌండేషన్ మోడల్‌కు సమాచారాన్ని ఇచ్చారు. అభివృద్ధి చేసిన అత్యంత వేగవంతమైన, అధిక రిజల్యూషన్ ఆప్టికల్ ఇమేజింగ్‌తో స్టిమ్యులేటెడ్ రామన్ హిస్టాలజీ ద్వారా ట్యూమర్ నమూనా చిత్రాలను ఫీడ్ చేశారు. పూర్తి సమాచారంతో ఎఐ ఆధారిత ఫాస్టిగ్లియోమా బ్రెయిన్ ట్యూమర్ అవశేషాలను క్షణాల్లో గుర్తించింది. వైద్య శాస్త్రంలో ఎఐ ఉనికి నిరూపించే అద్భుతంగా ఈ ప్రయోగాన్ని పేర్కోవచ్చు.



# బాలల హక్కులు ఎండమావులే!

వేదిక

మన దేశంలోనేకాదు... ప్రపంచ వ్యాప్తంగా బాలల హక్కులు ఎండమావులే అవుతున్నాయి. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ఎన్ని చర్చలు జరిగినా, ఇంకెన్ని చట్టాలు వచ్చినా, షరా మామూలే. ఇప్పటికీ అనేకానేక పనుల్లో నిమగ్నమైన బాలలు కనిపిస్తునే ఉంటారు. ఇళ్లలో పని నుంచి ఇటుక బట్టీల్లో కూలీల వరకూ... ఎంతో మంది బాలకార్మికులు చెమటోడుస్తునే ఉన్నారు. తమకు హక్కులు ఉన్నాయనే విషయం వారికి తెలియదు. అమలు చేయాల్సిన పెద్దలు పట్టించుకోరు. వెరసి అవి సక్రమంగా అమలుకావు. నిజానికి బాలల హక్కులపై 1924లోనే జనీవా ప్రకటన వెలువడింది. ఐక్యరాజ్య సమితి సర్వ ప్రతినిధి సభ (జనరల్ అసెంబ్లీ) 1948 డిసెంబర్ 10 న మానవ హక్కుల ప్రకటన చేసింది. ప్రపంచ వ్యాప్తంగా ప్రజలందరికీ హక్కులు ఉండాలని స్పష్టం చేసింది. అయితే, ఇందులో బాలల హక్కులను ప్రత్యేకంగా పేర్కోకపోడంతో, ఆ పొరపాటును సరిదిద్దుకోవాల్సిన అవసరం ఏర్పడింది. 1959లో బాలల హక్కులను ప్రకటించింది. 1989 నవంబర్ బాలల హక్కుల ఒడంబడికపై భారత్ సహా 180 దేశాలు సంతకాలు చేశాయి. మన దేశంలోనూ బాలల కోసం ప్రత్యేక హక్కుల చట్టం 1974లో వచ్చింది. అంతకు ముందు, ఆ తర్వాత కూడా రాజ్యాంగంలోని పలు అధికరణలు వీరి హక్కులను స్పష్టం చేస్తున్నాయి. 1980లో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఏర్పడినప్పటి నుంచి ప్రత్యేక దృష్టి సారిస్తారన్న ఆశలు తలెత్తాయి. కానీ, అమలులో అనుకున్నంత అద్భుతాలేమీ జరగలేదు. ఐక్యరాజ్య సమితి బాలల హక్కుల సంస్థ (యుఎన్‌సిఆర్‌సి) ఆర్టికల్ ఒకటి ప్రకారం 18 సంవత్సరాల లోపు వయసుగల వారిని బాలలుగానే పరిగణించాలి. వీరికి కల్పించిన 40 హక్కులను స్థూలంగా జీవించే హక్కు, రక్షణ పొందేహక్కు, అభివృద్ధి చెందే హక్కు, భాగస్వామ్య హక్కుగా విభజించారు. భారత రాజ్యాంగంలోనూ పలు అధికరణలు బాలల హక్కులను పరిరక్షిస్తాయి. సమానత్వపు హక్కు (ఆర్టికల్ 14), మత, జాతి, కుల, లింగ వివక్షతకు గురికాకుండా ఉండే హక్కు (ఆర్టికల్ 15), మహిళలు పిల్లలకు ప్రత్యేక ఏర్పాట్లు (ఆర్టికల్ 15 /3), బాలలకు కూడా వర్తించే ప్రాథమిక హక్కులు (ఆర్టికల్ 19/1), 6 నుంచి 14 సంవత్సరాల వయసుగల ప్రతి ఒక్కరికీ నిర్బంధ ఉచిత ప్రాథమిక విద్య (ఆర్టికల్ 21 ఎ), నిర్బంధం, శిక్ష నుంచి రక్షణ పొందే హక్కు (ఆర్టికల్ 22), అక్రమ రవాణా, కట్టుబానికత్వం లేదా వెట్టి నుంచి రక్షణ పొందే హక్కు (ఆర్టికల్ 23), బాలకార్మిక వ్యవస్థ రద్దు (14 ఏళ్లలోపు వయసు ఉన్న వారితో ఎలాంటి ప్రమాదకరమైన పనులు చేయించకూడదు, ఆర్టికల్ 24) అనేవి బాలలకు రక్షణ కల్పిస్తాయి.



అదే విధంగా ఆదేశిక సూత్రాలు (డైరెక్టివ్ ప్రిన్సిపుల్స్ ఆఫ్ స్టేట్ పాలసీ)లోని ఆర్టికల్ 39 ప్రకారం బాలలతో ఆదాయం కోసం పనులు చేయించడం నిషిద్ధం. ఎస్‌సి, ఎస్‌టి వంటి వెనుకబడిన వర్గాల పిల్లల అభివృద్ధిని ఆర్టికల్ 46 వివరిస్తుంది. పౌష్టికాహారం, ఆరోగ్యం వంటి అంశాలను ఆర్టికల్ 47లో ప్రస్తావించారు. మన దేశంలోనే బాలల సంరక్షణకు ఎన్నో చట్టాలు ఉన్నాయి. ప్రాథమమి హక్కులతోపాటు, వివిధ చట్టాలను బాల్యాన్ని పరిరక్షించేందుకు రూపొందించారు.

### ఫ్యాక్టరీ చట్టం 1982

ఈ చట్టం ప్రకారం 14 సంవత్సరాలు నిండని బాలలను ప్రమాదం ఉన్న పనిలోకి తీసుకోరాదు.

### గనుల చట్టం 1952

గనులలో బాలశ్రామికులను నియమించడం నిషేధించారు. 16 సంవత్సరాలు పూర్తి చేసుకుని వైద్యుల నుండి సర్టిఫికెట్ పొంది ఉంటే యుక్త వయస్కులకు పని కల్పించవచ్చు. కాని వీరి సేవలను సాయంత్రం 6 గంటల నుండి ఉదయం 6 గంటలలోపు ఉపయోగించుకోకూడదు.

### ప్లాంటేషన్ కార్మిక చట్టం 1951

ఈ చట్టం ప్రకారం 12 సంవత్సరాలు నిండని బాలలను ప్లాంటేషన్ పనులకు తీసుకోకూడదు. అలాగే 15 18 సంవత్సరాలలోపు వయస్కులను వైద్యుల నుండి ఆరోగ్య ధృవపత్రాలు లేకుండా పనులలోకి తీసుకోకూడదు.

### మోటారు రవాణా కార్మిక చట్టం 1961

ఈ చట్టం ప్రకారం 15 సంవత్సరాలలోపు బాలలను మోటారు రవాణా రంగంలో పనికి తీసుకోరాదు. అలాగే 15 18 సంవత్సరాలలోపు బాలలను వైద్య ధృవీకరణతోనే పనిలోకి తీసుకోవాలి. ఇది 12 నెలలకు మాత్రమే పని చేస్తుంది. దాటితే తిరిగి వైద్య పరీక్షలు చేయించుకొని సర్టిఫికెట్ పొందాలి. అదే విధంగా వీరికి అర్ధగంట విశ్రాంతి సమయం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు మాత్రవే వీరి సేవలను ఉపయోగించుకోవాలి.

### ఇవేకాకుండా ఆర్టికల్ 23కు అనుగుణంగా వచ్చిన చట్టాలు

**స్త్రీలు, బాలబాలికల అవినీతి వ్యాపార చట్టం (1955) వెట్టిచాకిరి నిషేధ చట్టం (1976), కనీస వేతనాల చట్టం (1976), బాలకార్మికుల చట్టం (1986) బాల్యవివాహ నిరోధక చట్టం (1929), వ్యభిచార నిరోధచట్టం (1956)** ఇన్ని చట్టాలు ఉన్నప్పటికీ, బాల కార్మిక వ్యవస్థ ఇప్పటికీ ఏ విధంగా కొనసాగుతున్నదో అందరికీ తెలుసు. కానీ, తెలియనట్టు నటించడం, మన కెందుకులే అనే రీతిలో వ్యవహరించడం అలవాటైంది. పాలకులు పట్టించుకుంటే... చట్టాలను అధికారులు సక్రమంగా అమలు చేసి ఉంటే.... ప్రజల్లో బాలలపై కొద్దోగొప్పో కనికరం ఉంటే.. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయినా పరిస్థితి ఇంత అధ్వాన్నంగా ఎందుకుంటుంది? లోపం బాలల్లో కాదు.. వ్యవస్థలోనే ఉంది. వ్యవస్థ మారినప్పుడే బాలలకు ఆనందం.. ఉజ్వల భవితవ్యం. **సేకరణ**

# పోటీ కోసం జీకే

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం) ప్రతి సోమవారం

- మహా మాంద్యం ఏ సంవత్సరంలో జరుగుతుంది?
  1929
- గాజు తయారీలో ఉపయోగించే రసాయన మూలకం ఏది?
  సిలికాన్
- ఎడ్వర్డ్ మంచ్ యొక్క ప్రసిద్ధ పెయింటింగ్ ది స్క్రీమ్‌లో ఏ పరికరం చిత్రీకరించబడింది?
  సెల్లోక్లారినెట్
- సౌర వ్యవస్థలోని ఏ గ్రహాన్ని 'ప్లానెట్ ఆఫ్ లవ్' అని పిలుస్తారు?
  శుక్రుడు
- కార్బన్ డయాక్సైడ్ ($CO_2$) యొక్క ప్రధాన భాగం ఏ రసాయన మూలకం?
  నైట్రోజన్ సరైన
- యునెస్కో (యునైటెడ్ నేషన్స్ ఎడ్యుకేషనల్, సైంటిఫిక్ అండ్ కల్చర్ ఆర్గనైజేషన్) ఏ సంవత్సరంలో స్థాపించబడింది?
  1950
- ఉక్కు ఉత్పత్తుల ఉత్పత్తిలో ఏ రసాయన మూలకం ఉత్పత్తి?
  ఇనుము
- ఒలింపిక్ సంస్థ ఏ సంవత్సరంలో స్థాపించబడింది?
  1896
- మానవ ఎముకలు, దంతాలలో ఏ రసాయన మూలకం ప్రధాన భాగం?
  కాల్షియం
- రక్తాన్ని ఫిల్టర్ చేయడానికి, మూత్రాన్ని ఉత్పత్తి చేయడానికి మానవ శరీరంలో ఏ అవయవం బాధ్యత వహిస్తుంది?
  కిడ్నీలు
- ఆధునిక కాలంలో మొట్టమొదటి అధికారిక ఒలింపిక్స్ ఏ సంవత్సరంలో జరిగాయి?
  1900
- సౌర వ్యవస్థలో అతిపెద్ద వ్యాసం కలిగిన గ్రహం ఏది?
  బృహస్పతి
- బెలూన్లు, ఎయిర్‌షిప్‌లను పూరించడానికి ఏ రసాయన మూలకం ఉత్పత్తి చేయబడింది?
  హీలియం
- పునరుజ్జీవనం (పునరుజ్జీవనం) ఏ సంవత్సరంలో పండుగ?
  1500
- బ్యాటరీల తయారీలో ఏ రసాయన మూలకం ఉత్పత్తి?
  లిథియం
- ఏ రకమైన రేడియేషన్ ఎక్స్‌రే పరీక్షలను అనుమతిస్తుంది?
  ఎక్స్‌రే
- టెలివిజను, కంప్యూటర్ మానిటర్లలో ఇంద్రధనస్సులను రూపొందించడానికి ఏ రసాయన మూలకం ఉత్పత్తి?
  నియాన్
- సౌర వ్యవస్థలోని ఏ గ్రహాన్ని 'బ్లూ ప్లానెట్' అని పిలుస్తారు?
  భూమి
- మొదటి మనిషి చంద్రునిపై ఏ సంవత్సరంలో అడుగుపెట్టాడు?
  1969
- రికార్డు స్థాయిలో ఏడు సినిమాల్లో జేమ్స్ బ్యాండ్ పాత్రను పోషించిన నటుడు ఎవరు?
  మూర్
- ఏ సంవత్సరంలో, ఉగ్రవాదులు న్యూయార్క్ వరల్డ్ ట్రేడ్ సెంటర్ పైకి రెండు విమానాలను ఢీకొట్టారు?
  2001
- వయోజన మానవ శరీరంలో, ఎర్ర రక్త కణ మొత్తం సంఖ్య ఎంత?
  30 ట్రిలియన్

# ప్రజాసమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులే

**సమాజ స్థితిగతులను మార్చేది మార్క్సిజమే**

**సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు**




**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** ప్రజా సమస్యలపై నిత్యం పోరా డేది కమ్యూనిస్టులేనని, సమసమాజ నిర్మాణానికి మార్క్సిజమే దిక్సూచని, సిపిఐ ది నూరేళ్ళ చరిత్ర కలిగిన పార్టీ అని రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్క ళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా సమితి ఆధ్వ ర్యంలో నిరంతర రాజకీయ పాఠశాలను సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అధ్యక్షతన జరిగిన రాజకీయ పాఠశాల సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఉద్యమాలు నిర్మించి ప్రజల మధ్య ఉండి ప్రజలను చైతన్యం చేస్తూ ప్రశ్నించే గొంతుకగా ఉన్న సిపిఐ శత సంవత్సరాలు కలిగిందని, శతాబ్ద కాలంగా ఎన్నో పార్టీలు వారి స్వార్ధ ప్రయోజనాల కోసం ప్రారంభించి కనుమరుగయ్యాయన్నారు. 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిన సిపిఐ భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో సిపిఐ కార్యకర్తలు, నాయకులపై అనేక కుట్రకేసులు బనాయించినా కూడా, జైల్లో పెట్టి చిత్రహింసలు పెట్టినా కూడా స్వాతంత్రం సిద్ధించే వరకు ప్రజలను చైతన్యం చేస్తూ విశ్రమించని పోరాటం చేసిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదన్నారు. అందరూ సమానంగా బతకాలని, సమ సమాజ స్థాపన కోసం మార్క్సిజం చూపినా సైద్ధాంతిక సిద్ధాంతంతో నిరంతరం ప్రజలను చైతన్యం చేస్తూ ప్రజా ఉద్యమాలలో కీలక పాత్ర పోషిస్తూ అనేక సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు గావించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ లక్షలాది కోట్ల రూపాయలను వారికి రాయితీల పేరు మీద కట్ట బెడుతున్నాయని మండిపడ్డారు. కమ్యూనిస్టులు ఏమి తెలుసుకోవాలి అనే అంశంపై రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మార్క శంకర్ నారాయణ బోధిస్తూ కమ్యూనిస్టులు దేశంలో నెలకొని ఉన్న ప్రజా సమస్యలు పరిష్కారం కోసం ఉద్యమాలు చేస్తూనే మరోవైపు మతోన్మాద శక్తులకు వ్యతి రేకంగా పోరాటాలు చేయాలని అన్నారు. ఈ రాజకీయ పాఠశాల కార్యక్ర మానికి సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అధ్యక్షత వహించగా రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, ఎన్ ఎ స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు కర్రె లక్ష్మణ్, మునిగాల బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

# సేవల ఫలితంగానే సిపిఐకి ప్రజాదరణ

**పార్టీ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు**



**ప్రజాపక్షం/కారేపల్లి:** ప్రజాక్షేత్రంలో ఉంటూ అన్ని వర్గాల ప్రజలకు అందిస్తున్న సేవల ఫలితంగానే సిపిఐకి రోజురోజుకు జనాదరణ పెరుగుతోందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు అన్నారు. ఆదివారం కారేపల్లి మండలంలోని భాగ్యనగర్ తండాలో సిపిఐ 2025వ సంవత్సరం సభ్యత్వ చేర్పింపు పునరుద్ధరణ కార్యక్రమానికి ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రజలకు పార్టీ సభ్యత్వాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ దేశంలో 100 సంవత్సరాల ఘన చరిత్ర కలిగిన ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని, డిసెంబర్ 26నాటికి పార్టీ వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంలో గ్రామ గ్రామాన వందేళ్ల ఉత్సవాలు ఘనంగా నిర్వహించి, పార్టీ చరిత్రను , త్యాగాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రతి గ్రామం, బస్తీలో ఉత్సవాలు ఘనంగా జరిగేలా ప్రణాళిక రూపొదించుకోవాలని సూచించారు. తాడిత పీడిత ప్రజల పక్షాన భూమి భుక్తి కోసం అనేక పోరాటాలు నిర్వహించిన పేదలకు వేల ఎకరాల భూమిని పంచిన చరిత్ర సిపిఐకి ఉందని, పేద ప్రజల కోసం ప్రజా పోరాటాల్లో ప్రాణాలర్పించిన అమరవీరుల ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కంకణభర్దులు కావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో మండల కార్యదర్శి రామస్వామి, ఇస్లావత్ బావ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# అజరామరం సిపిఐ పోరాట చరిత్ర



**ప్రజాపక్షం/పెనుబల్లి :** భారత కమ్యూనిస్టు పార్టీ పోరాట చరిత్ర అజరా మరమని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసా ద్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని లింగగూడెం, గట్టుగూడెం గ్రామాల్లో సిపిఐ శత జయంతి సందర్భంగా పార్టీ సభ్య త్వ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా పోటు ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో పురాతన పార్టీ సిపిఐ అని డిసెం బర్ 25 నాటికి 100వ సంవత్సరంలో అడుగుపెట్టనుంద ని తెలిపారు. ఇంత చరిత్ర కలిగిన పార్టీ దేశంలో మరొకటి లేదని, లౌకిక ప్రజాతంత్ర ఉద్యమాలకు సిపిఐ బీజం వేసిందని, దేశం లో సెక్యులర్ వామపక్ష ఐక్యత కోసం దేశ వ్యాపిత పార్టీలను ఏకం చేసి, దేశ ప్రజానీకా నికి ఎనలేని మేలు చేకూర్చిందని పేర్కొన్నారు. పార్టీ శతజయంతి ఉత్సవా లను 2025 సంవత్సరం మొత్తం దేశవ్యాప్తంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమ ంలో సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సింగు నరసింహా రావు, సిపిఐ మండల కార్యదర్శి కొమ్మినేని సుధాకర్, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకు లు ఇటికాల రామకృష్ణ, పెనుబల్లి సొసైటీ డైరెక్టర్ పద్దం జోగ య్య, పద్దం పుల్లయ్య, వట్టం శ్రీను, శివ తదితరులు పాల్గొన్నారు.

# హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలి

**ఎన్.బాలమల్లేష్**




**ప్రజాపక్షం /మేడ్చల్ ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నిటిని చిత్త శుద్ధితో అమలు చేయాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేష్ కోరారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు రొయ్యల కృష్ణమూర్తి అధ్యక్షతన నీలం రాజశేఖరరెడ్డి అధ్యక్షతన జరిగిన మేడ్చల్ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హామీలైన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు అందించాలన్నారు. మూసి పరివాహక ప్రాంతాల్లో పేదల ఇళ్లను కూల్చి వేసే నిర్ణయం అప్రజాస్వామికమన్నారు. ప్రమాదకర స్థితిలో ఉన్న ఇళ్లల్లో నివసించే వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు జి.దామోదర్ రెడ్డి, ఉమా మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్ దశరథ్, తోటపల్లి శంకర్, శంకర్‌రావు, ఏసు రత్నం, హరినాథరావు, కె.ధర్మేంద్ర పాల్గొన్నారు.

# బీడీ కార్మికుల రక్షణ కోసం ఎఐటియుసి పోరాటం

**సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్**




**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** బీడీ కార్మికుల సంక్షేమం కోసం సంస్థ రక్షణ కోసం ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్ నిరంతరం కృషి చేస్తుందని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్ అన్నారు. ఆదివారం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనం ఎదుట ఎఐటియుసి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు ఓమయ్య అధ్యక్షతన రాష్ట్ర బిడి వర్క ర్స్ ఫెడరేసన్ జిల్లా ప్రథమమహాసభ కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లా డారు. కేంద్ర ప్రభుత్వం బిడి పరిశ్రమ నిర్వీర్యం చేయటానికి కార్పొరేట్ కంపెనీలు అయిన సిగరెట్, గుట్కాలను ప్రోత్సహిస్తూ బీడీ పరిశ్రమపై దాదాపు 40శాతంపై జిఎస్‌టి వేస్తూ సంస్థ నిర్వీర్యానికి ప్రయత్నిస్తుందన్నారు. కార్మికులకుఉపాధి తగ్గిన వేతనాలు రాక పెన్షన్ రాక అవస్థలు పడుతున్నారన్నారు.రాబోయే కాలంలో బీడీ పరిశ్రమ రక్షణ కార్మికుల సంక్షేమం కోసం ఐక్యంగా యూనియన్ ఇచ్చే పిలుపులో కార్మికులు భాగస్వాములై కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులుబాలరాజ్, గోవర్ధన్, రాములు, నర్సి ంగ రావు, ముక్రం, భానుచందర్, చక్రపాణి, హన్మాండ్లు, రాధాకుమార్, మహేష్, అలీ ఇమ్రాన్, కార్మికులు పాల్గొన్నారు.

# గ్రామగ్రామాన సభ్యులుగా చేరండి..

# ప్రజా ఉద్యమాలకు ఊతమివ్వండి

**సిపిఐ సభ్యత్వ చేర్పింపు**






**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)లో సభ్యులుగా చేరి ప్రజాఉద్యమాలకు ఊతమివ్వాలని సిపిఐ నాయకులు పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంత వేడుకల సందర్భంగాగ్రామగ్రామానసభ్యత్వ చేర్పింపు కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి గ్రామంలోను సిపిఐ శాఖ సమావేశాలు నిర్వహిస్తూ పార్టీలో సభ్యులుగా చేర్చుకుంటున్నారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిష న్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, ఎస్‌కె జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా సమితి సభ్య లు సభ్యత్వ చేర్పింపులో పాల్గొంటున్నారు.

# 19, 20న ఎఐటియుసి శిక్షణ తరగతులు

**రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల జమలయ్య**




**ప్రజాపక్షం/సుజాతనగర్** 19,20 వ తేదీలలో గౌతమ్‌పూర్‌లో బందెల నరసయ్య కమ్యూనిటీ హాల్‌లో జరిగే ఎఐటియుసి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల జమ లయ్య పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని రజబ్ అలీ భవన్‌లో ఎఐటియుసి ముఖ్య నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు.వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సంవత్సరానికి 12వేలు ఇవ్వాలని, ప్రతి మండలానికి ఈఎస్‌ఐ ఆసుపత్రి అసంఘటిత కార్మికులకు 25వేలను వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎఐటియుసి జిల్లా కార్యదర్శి పోగుల కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి జక్కుల రాము లు, వ్యవ సాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు భూక్య దసురు, ఎఐటియుసి మండల అధ్యక్షులు వీర్ల మల్లేష్, ఎఐటియుసి వర్కింగ్ ప్రెసిడెంట్ వీర్ల దుర్గాప్రసాద్, ఎఐటియుసి సుజాతనగర్ మండల అధ్యక్షులు వీర్ల దుర్గాప్రసాద్, నాయకులు గడ్డం రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్లు అమలు చేయాలి

**బిసి హక్కుల సాధన సమితి**

**ప్రజాపక్షం/ఖమ్మం :** జనాభా ప్రాతిపదికన కుల గణన, జన గణన తర్వాత రిజర్వేషన్లను అమలు చేయాలని బిసి హక్కుల సాధన సమితి కోరింది. ఆదివారం బిసి స్థానిక సంస్థల డెడికేట్ కమిషన్ ఛైర్మన్ భూసాని వెంకటేశ్వరరావుకు బిసి హక్కుల సాధన సమితి ప్రతినిధి బృందం వినతి పత్రం సమర్పించింది. పెరిగిన జనాభా పద్ధతిలో బిసిలకు రిజర్వేషన్లు ప్రకటించాలని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇది అమలయ్యేవిధంగా చూడాలని వినతి పత్రంలో కోరారు బిసి హక్కుల సాధన సమితి సీనియర్ నాయకులు యర్రాబాబు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మేకల శ్రీనివా సరావు, తాటి వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు సిహెచ్ సీతామహాలక్ష్మి, గాదె లక్ష్మి నారాయణ ఉన్నారు.



## మహిళా శ్రామికశక్తి అతి తక్కువగా సంపాదిస్తోంది

### కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరాం రమేష్ బిజెపి ప్రభుత్వంపై ధ్వజం

**న్యూఢిల్లీ :** ఆరు సంవత్సరాల నాటికంటే ఈ రోజు మహిళా శ్రామికశక్తి అతితక్కువగా సంపాదిస్తోందని ఆదివారం నాడు కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఇది అమృత్‌కాల్ లోని 'విషాధకర వాస్తవం అని పేర్కొంది. కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి కమ్యూనికేషన్ల ఇన్‌ఛార్జి జైరాం రమేష్ ఇక్కడ విడుదల చేసిన ఒక ప్రకటనలో బిజెపి ప్రభుత్వాన్ని నిందించారు. మహిళల శ్రామికశక్తి భాగస్వామ్య రేట్లపై డాక్టరేట్ డేటా కోసం బిజెపి ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. ఎన్నడూ జరగని రీతిలో ఆర్థిక డేటాను నాన్ బయలాజికల్ ప్రధానమంత్రి తన దశాబ్దకాలంలో డాక్టరేట్ చేశారని జైరామ్ రమేష్ తన ప్రకటనలో ఆరోపించారు.మహిళా కార్మికుల భాగస్వామ్య నిష్పత్తి (ఎల్‌ఎఫ్‌పిఆర్) 2017/18లో 27శాతం నుంచి 2023/34లో అసాధారణ కథనంగా ప్రశంసించబడటమే తాజా ఉదాహరణ అని జైరాం రమేష్ తెలియజేశారు.

# ఓట్ల కోసం బిజెపి విభజన నినాదాలు

### కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఆరోపణ





**న్యూఢిల్లీ :** సమాజంలోని కొన్ని వర్గాల మద్దతు కూడగట్టేందుకు కొంత మంది బిజెపి నేతలు విభజన నినాదాలు చేస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఈ చర్యలను తాము ఎంత మాత్రమూ అనుమతించబోమన్నారు. మహారాష్ట్ర నాగ్‌పూర్‌లోని ఉమ్రెడ్‌లో ఆదివారం నిర్వహించిన ర్యాలీలో ఖర్గే పాల్గొని ప్రసంగించారు. సమాజాన్ని విడగొట్టేందుకు బిజెపి నేతలు ఇప్పటికే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. 'బతేంగా తో కతేంగా' వంటి నినాదాలు చేస్తూ ఓటు రాజకీయం చేస్తున్నారని దుయ్యబట్టారు. అయితే అలాంటి నినాదాల్లో మహాయుతి నేతల్లో ఏకాభిప్రాయం లేదని ఖర్గే ఎద్దేవా చేశారు. ఛత్రపతి శివాజీ మహారాజ్, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రత్యేకించి ఒక వర్గానికి చెందిన వారని పేర్కొనడం సబబు కాదని సూచించారు. దేశ ఐక్యత కోసం కాంగ్రెస్, తమ పార్టీ నేతలు ప్రాణ త్యాగం చేశారని గుర్తుచేశారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ నేతలు దేశానికి ఏం చేశారని నిలదీశారు. మహారాష్ట్రలో ప్రస్తుత ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు అసెంబ్లీ ఎన్నికలు కీలకమన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థల భయం వల్లే కొంత మంది తమ పార్టీ నుంచి వెళ్లి బిజెపి కూటమిలో చేరుతున్నారన్నా రు. గుజరాత్‌లో ఒక వ్యక్తి 24 ఏళ్లు పాలించారని, అయినా ఆ రాష్ట్రంలో ఇంకా పేదరికం ఉందని ప్రధానినుద్దేశించి వ్యాఖ్యానించారు. మహారాష్ట్రలో ఏదైనా అభివృద్ధి జరిగిందంటే అది కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనేనన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని మనం పరిరక్షించాం కాబట్టే మోడీ ప్రధాని అయ్యాడు, లేకుంటే టీ అమ్ముకునేవాడు. రాజ్యాంగం లేకపోతే నాలాంటి వాడు ఎక్కడో ఒక చోట కష్టపడుతున్నాడు. అమెరికా లాంటి దేశం ఇప్పటికీ మహిళకు ఓటు వేయదు. భారతదేశంలో అందరికీ సమాన హక్కులు ఉన్నా యి, అందరూ సురక్షితంగా ఉన్నారు. ప్ర ధాని మోదీ కొంత మంది ధనవంతుల కోసం పనిచేస్తున్నారని, వారికి చెందిన రూ. 16 లక్షల కోట్ల రు ణాలను మాఫీ చేశారని, రైతులకు, పేద ప్రజలకు మాత్రం సాయం చేయలేదని ఖర్గే పేర్కొన్నారు. నో ట్ల రద్దు (మోదీ ప్రభుత్వ హయాంలో జరిగింది) పేదలు అంతమొందించిందని, బిజెపి 'అబద్ధం' లో పడవద్దని ఖర్గే విజ్ఞప్తి చే శారు. అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని ఓడించి ఎంవిఎకు పూర్తి మెజారిటీ ఇవ్వాలని, తద్వారా దొంగలు కూడా భయపడతారని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం ఎంవీఏ అధికారంలో ఉండాల్సి న అవసరం ఉందని ఖర్గే అన్నారు. మహిళలు, రై తుల సంక్షేమం కోసం ఎంవిఎ పనిచేస్తుందని తెలిపారు.

## బీరెన్ సింగ్ ప్రభుత్వానికి ఎన్‌పిపి మద్దతు ఉపసంహరణ





**ఇంఫాల్:** మణిపూర్‌లో బిజెపికి మిత్రపక్షమైన నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పిపి) షాక్ ఇచ్చింది. సిఎం బీరెన్ సింగ్ నేతృత్వంలోని ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించింది. రాష్ట్రంలో జాతి హింసను నియంత్రించడంలో, సాధారణ పరిస్థితిని పునరుద్ధరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించింది. కాన్రాడ్ సంగ్మా నేతృత్వంలోని ఎన్‌పిపి ఆదివారం ఈ మేరకు బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డాకు లేఖ రాసింది. 'బీరెన్ సింగ్ నేతృత్వంలోని మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం సంక్షోభాన్ని పరిష్కరించడంలో, సాధారణ స్థితిని పునరుద్ధరించడంలో పూర్తిగా విఫలమైందని మేం గట్టిగా భావిస్తున్నాం. ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, రాష్ట్రంలో బీరెన్ సింగ్ నేతృత్వంలోని ప్రభుత్వానికి తక్షణమే అమలులోకి వచ్చేలా మద్దతును ఉపసంహరించుకోవాలని నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పిపి) నిర్ణయించింది' అని అందులో పేర్కొంది. కాగా, మణిపూర్‌లో ఏడాదిపైగా మైతీ, కుకీ జాతుల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. వం దల సంఖ్యలో మరణించగా వేల సంఖ్యలో నిరాశ్రయులయ్యారు. తాజాగా మైతీ వర్గానికి చెందిన మహిళలు, పిల్లలతో సహా ఆరుగురిని కిడ్నాప్ చేసిన కుకీ మిలిటెంట్లు దారుణంగా హత్య చేశారు. ఈ నేపథ్యంలో మైతీ వర్గం ప్రజలు భారీ నిరసన చేపట్టారు. సిఎం బీరెన్ సింగ్ నివాసంతోపాటు మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్లపై ఆందోళనకారులు దాడులు చేశారు. మరోవైపు మణిపూర్‌లో తాజా హింస నేపథ్యంలో సంక్షోభం తీవ్రమవుతున్నది. దీంతో కేంద్ర హోంమంత్రి అమిత్ షా మహారాష్ట్రలో ఎన్నికల ప్రచారాన్ని రద్దు చేసుకున్నారు. ఆదివారం ఢిల్లీలో అధికారులతో సమావేశమయ్యారు. మ ణిపూర్‌లో శాంతి భద్రతలను సమీక్షించారు. సోమవారం కూడా హోం మం త్రి త్వ శాఖలోని సీనియర్ అధికారులతో అమిత్‌షా సమావేశమవుతారు.

## బిజెపి మణిపూర్ తగులబడాలని చూస్తోంది : కాంగ్రెస్

**న్యూఢిల్లీ :** మణిపూర్‌లో మరోసారి హింస చెలరేగింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందిస్తూ అధికార పార్టీ ఉద్దేశపూర్వకంగా సరిహద్దు రాష్ట్రం మండిపోవాలని కోరుకుంటోందని, దాని ద్వారా ద్వేషపూరిత విభజన రాజకీయాలకు ఉపయోగించుకోవాలని చూస్తోందని ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తమను తాము రక్షించుకోవడానికి మణిపూర్‌ను బలిపశువును చేస్తున్నారని, కష్టాలను తీర్చడానికి తమ రాష్ట్రంలో అడుగు పెట్టని ప్రధానిని రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ క్షమించరని ఖర్గే దుయ్యబట్టారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల హయాంలో మణిపూర్ ఐక్యంగా ఉండదని, సురక్షితంగా కూడా ఉండదని కాంగ్రెస్ అధ్యక్షుడు ఎక్స్‌లో పోస్ట్‌లో పేర్కొన్నారు. విభజన, ఉక్కిరిబిక్కిరి అవుతున్న హింసకు గురవుతున్న మణిపూర్ 'మే 2023 నుండి ఊహాతీతమైన బాధను అనుభవిస్తుందని, ఇది ప్రజల భవిష్యత్తును నాశనం చేసిందన్నారు. మణిపూర్‌ను కాల్చివేయాలని బిజెపి ఉద్దేశపూర్వకంగా భావిస్తున్నట్లు కనిపిస్తోందని, అది ద్వేషపూరిత విభజన రాజకీయాలకు ఉపయోగించుకోవడానికి చూస్తుందని, తాము భావిస్తున్నామన్నారు. నవంబర్ 7 నుండి కనీసం 17 మంది ప్రాణాలు కోల్పోయారని, కొత్త జిల్లాలను కలహాలతో దెబ్బతిన్న ప్రాంతాల జాబితాలో చేర్చుతున్నారని, ఈశాన్య రాష్ట్రాల సరిహద్దుల్లో మంటలు వ్యాపిస్తాయని ఖర్గే అన్నారు. మణిపూర్‌ను అందమైన సరిహద్దు రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో విఫలమయ్యారని, భవిష్యత్తులో మణిపూర్‌ని సందర్శించినా, రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ క్షమించబోరని ప్రధానుద్దేశించి ఖర్గే వ్యాఖ్యానించారు. మణిపూర్‌లో ఇటీవలి హింసాత్మక ఘర్షణలు, రక్తపాతం కొనసాగడం 'తీవ్రంగా కలవరపరిచేది'గా ఉందని ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ప్రధాని మోదీ రాష్ట్రంలో పర్యటించి ఈ ప్రాంతంలో శాంతిని నెలకొల్పేందుకు కృషి చేయాలని కోరారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. సంవత్సరానికి పైగా విభజన, తీవ్ర హింసాత్మక ఘటనల తరువాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సయోధ్య కోసం అన్ని ప్రయత్నాలు చేసి, పరిష్కారాన్ని కనుగొంటాయని ప్రతి భారతీయుడి ఆశగా చూస్తున్నారని రాహుల్ చెప్పారు. ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ మాట్లాడుతూ మణిపూర్‌లో కొనసాగుతున్న హింసాత్మక ఉప్పెన రాష్ట్రంలో పరిస్థితులు ఏ స్థాయిలో అదుపు తప్పిపోయాయో తెలియజేస్తోందని అన్నారు. హత్యలు మరోసారి రోజువారీ ఘటనగా మారాయని, వీధుల్లో రౌడీమూకల రాజ్యం నడుస్తోందని ఆరోపించారు. మణిపూర్‌లో అధికార పార్టీ ఎమ్మెల్యేలు కూడా సురక్షితంగా లేనప్పుడు, శాంతి కోసం సాధారణ పౌరుడు ఎలా నిరీక్షించగలడని ప్రశ్నించారు. హోంమంత్రి ప్రచారంలో బిజీగా ఉన్నారని, మణిపూర్ మళ్లీ మండుతున్న సమయంలో ప్రధాని మరో విదేశీ పర్యటనకు బయలుదేరారని చెప్పారు. మణిపూర్‌లో శాంతిని త్వరగా పునరుద్ధరించాలని కేంద్రానికి మా తక్షణ విజ్ఞప్తి అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు.

# నైజీరియాతో భారత్ వ్యూహాత్మక భాగస్వామ్యం

### ఓ కొత్త అధ్యాయానికి నాంది: ప్రధాని మోదీ

**అబుజా :** నైజీరియాతో వ్యూహాత్మక భాగస్వామ్యానికి భారత్ అధిక ప్రాధాన్యత ఇస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. రక్షణ, ఇంధనం, వాణిజ్యం సహా పలు రంగాల్లో నైజీరియాతో సంబంధాలను పెంపొందించేందుకు భారత్ కృషి చేస్తుందని ఆయన అన్నారు. నైజీరియా అధ్యక్షుడు బొలా అహ్మద్ టినుబుతో చర్చల అనంతరం ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఉగ్రవాదం, వేర్పాటువాదం, పైరసీ, మాదకద్రవ్యాల అక్రమ రవాణా ప్రధాన సవాళ్లుగా ఉన్నాయి. వాటిని ఎదుర్కోవడానికి భారత్, నైజీరియా కలిసి పనిచేస్తూనే ఉంటాయి. నైజీరియాతో వ్యూహాత్మక భాగస్వామ్యానికి భారత్ ప్రాధాన్యం ఇస్తుంది. ఈ చర్చల తర్వాత ఇరుదేశాల సంబంధాల్లో కొత్త అధ్యాయం ప్రారంభమవుతుందని విశ్వసిస్తున్నాను. దాదాపు 60,000 మంది ప్రవాస భారతీయులు భారత్‌నైజీరియా సంబంధాలకు కీలక స్తంభంగా నిలుస్తున్నారు. వారి సంక్షేమానికి భరోసా ఇచ్చినందుకు టినుబుకు ధన్యవాదాలు. గత నెల(సెప్టెంబరు)లో బీభత్సం సృష్టించిన వరదల వల్ల నష్టపోయిన నైజీరియా ప్రజల కోసం భారత్ 20 టన్నుల సహాయ సామగ్రిని పంపుతుంది. ఆఫ్రికన్ యూనియన్ జీ20లో శాశ్వత సభ్యత్వం పొందడం ఒక కీలక పరిణామం' అని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు.

### ప్రధాని మోదీకి నైజీరియా దేశం రెండవ అత్యున్నత జాతీయ అవార్డు ప్రదానం

నైజీరియా దేశం తన రెండవ అత్యున్నత జాతీయ అవార్డు 'గ్రాండ్ కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది నైగర్' అవార్డును ఆదివార ం భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ప్రదానం చేసింది. దీంతో ఈ విశిష్టతను అందుకున్న రెండవ విదేశీ ప్రముఖుడిగా నరేంద్రమోదీకి అరుదైన ఖ్యాతి దక్కింది. 'నైజీరియా ప్రభుత్వం నన్ను ఈ అవార్డుతో సత్కరించడం గౌరవంగా భావిస్తున్నాను. నేను దీనిని చాలా వినమ్రంగా స్వీకరిస్తున్నాను. 140కోట్ల భారతీయ ప్రజలకు, భారతదేశంనైజీరియా మైత్రికి ఈ అవార్డును నేను అంకితం చేస్తున్నాను' అని నైజీరియా అధ్యక్షుడు బోలా అహ్మద్ టినుబు నుంచి అవార్డును స్వీకరించిన అనంతరం భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అత్యంత సంతోష సమ్మిళిత ఉద్వేగంతో వ్యాఖ్యానించారు. తనకు ఈ అవార్డును అందజేసిన నైజీరియా ప్రభుత్వానికి, నైజీరియా ప్రజలకు కూడా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు మోదీ ఈ సందర్భంగా చెప్పారు. మోదీకి ఒక దేశం తరపున అంతర్జాతీయ అవార్డును ప్రదానం చేసిన ఈ తరహా అవార్డుల్లో ఇది 17వది. భారతదేశం, నైజీరియా మధ్య సంబంధాలు పరస్పర సహకారం దిశగా, గుడ్‌విల్..గౌరవంతో కొనసాగుతాయని ప్రధాని నరేంద్రమోదీ చెప్పారు. ఇరు దేశాల ప్రజల క్షేమం కోసం రెండు శక్తివంతమైన ప్రజా



స్వామ్యాలు, రెండు డైనమిక్ ఆర్థికవ్యవస్థలు కలిసికట్టుగా పనిచేస్తామని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఒక విదేశీ ప్రముఖుల హోదాలో 1969లో క్వీన్ ఎలిజబెత్ మాత్రమే ఈ జిసిఒఎన్ అవార్డు దక్కింది. ఇరుదేశాల మధ్య జరిగిన చర్చల్లో నూతన సాధ్యాలను గుర్తించామని భారత ప్రధాని చెప్పారు. ఆర్థికవ్యవస్థ, ఎనర్జీ, వ్యవసాయం, భద్రత, ఫిన్‌టెక్, చిన్న, మధ్యతరహా సంస్థలు, సాంస్కృతిక రంగాలకు సంబంధించినవి వీటిలో ఉన్నాయని మోదీ వివరించారు. ఆఫ్రికాలో నైజీరియా దేశం ఒక అతిపెద్ద సానుకూల పాత్రను నిర్వర్తిస్తోందని, ఆఫ్రికా తో అత్యంత సన్నిహిత సహకారం ఇచ్చిపుచ్చుకోవడమే భా రతదేశానికి అత్యంత ప్రాధాన్యతా అంశం అని తెలిపారు.

## ఆప్‌లో చేరిన బిజెపి మాజీ ఎమ్మెల్యే అనిల్ ఝా





**న్యూఢిల్లీ :** వచ్చే ఏడాది ప్రారంభంలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరుగునున్న నేపథ్యంలో కీలక రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. బిజెపి మాజీ ఎమ్మెల్యే అనిల్ ఝా ఆదివారం నాడు అధికారికంగా ఆమ్ ఆద్మీ పార్టీ లో చేరారు. ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సమక్షంలో ఆయన పార్టీ కండువా కప్పుకున్నారు. నార్త్ వెస్ట్ ఢిల్లీ ఢిల్లీలోని కిరారి అసెంబ్లీ నియోజకవర్గంలో రెండు సార్లు బిజెపి నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన అనిల్ ఝా ఆ పార్టీని వీడి ఆప్‌లో చేరడం ప్రాధాన్యత సంతరించుకుంది. కిరారీ అసెంబ్లీ నియోజకవర్గంలో కింద స్థాయి కార్యకర్తల్లోనూ గట్టిపట్టు ఉన్న అనిల్ ఝా కొద్దికాలంలో పార్టీ నాయకత్వం, విధానాలపై అసంతృప్తితో ఉన్నారు. తాజాగా ఆయన పార్టీ మారడం ద్వారా బిజెపికి సంప్రదాయబద్ధంగా గట్టి పట్టున్న కిరారీలో ఆప్‌కు లబ్ధి చూకూరే అవకాశాలున్నాయని అంటున్నారు. అనిల్ ఝాని పార్టీలోకి అరవింద్ కేజ్రీవాల్ ఆహ్వానిస్తూ, పూర్వాంచల్ కమ్యూనిటీ గట్టి పలుకుబడి కలిగిన నేత అనిల్ ఝా అని, ఢిల్లీలోని అనధికార కాలనీల్లో గణనీయంగా పూర్వాంచల్ కమ్యూనిటీ వాసులు ఉంటున్నారని, ఏళ్లతరబడి వారిని బిజెపి, కాంగ్రెస్ నిర్లక్ష్యం చేశాయని అన్నారు. తాను ముఖ్యమంత్రి అయ్యాక ఆ కాలనీలలో అభివృద్ధి పనులు, ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరుస్తానని చెప్పారు.

# ఢిల్లీ మంత్రి కైలాస్ గెహ్లాట్ రాజీనామా

### 'ఆమ్ అద్మీ పార్టీ'కి కూడా...



**న్యూఢిల్లీ :** వచ్చే ఏడాది ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న కీలక తరుణంలో అధికార 'ఆమ్ అద్మీ పార్టీ' (ఆప్)కి ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ సీనియర్ నేత, ఢిల్లీ రవాణా శాఖ మంత్రి కైలాష్ గెహ్లాట్ పార్టీకి అదివారంనాడు రాజీనామా చేశారు. తన మంత్రి పదవికి కూడా రాజీనామా సమర్పించారు. ఆయన రాజీనామాను ముఖ్యమంత్రి అతిషి ఆమోదించారు. ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు గెహ్లాట్ రాజీనామా లేఖ రాశారు. అమలుకు నోచుకోలేని ఆప్ వాగ్దానాలు, ఇటీవల తలెత్తిన వివాదాలు వంటివి తన రాజీనామాకు కారణాలుగా అందులో ఆయన పేర్కొన్నారు. ఢిల్లీ ప్రజలకు ఇచ్చిన కీలక హామీలను పార్టీ నిలబెట్టుకోలేదని ఆయన విమర్శించారు. ఎన్నికల వాగ్దానాల్లో ఒకటైన యమునా నది ప్రక్షాళనను హామీని కూడా ఆయన ప్రస్తావించారు. యమునా నదిని స్వచ్ఛమైన జలాలుగా మారుస్తామని వాగ్దానం చేసి ఆ పని చేయలేకపోయిందని, బహుశా గతంలో ఎన్నడూ చూడనంత కాలుష్యంలో యమునా నది కూరుకుపోయందని విమర్శించారు. కేజ్రీవాల్ అధికార బంగ్లా 'శీష్ మహల్' చుట్టూ వివాదం ముసురుకోవడాన్ని కూడా గెహ్లాట్ విమర్శించారు. శీష్ మహల్ వంటి అక్షేపణీయ, ఆందోళన కలిగించే చాలా వివాదాలు చుట్టుముట్టాయని, దీంతో ఆప్ ఆద్మీ పార్టీని ఇప్పటికీ నమ్మవచ్చా అనే అనుమానాలు ప్రతి ఒక్కరిలోనూ నెలకొన్నాయని ఆయన వ్యాఖ్యానించారు. ఢిల్లీ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం మధ్య నిరంతర ఘర్షణలను కూడా గెహ్లాట్ తప్పుపట్టారు. దీనివల్ల రాజధాని ప్రగతి కుంటుపడిందన్నారు. ప్రజల హక్కుల కోసం పోరాటానికి బదులు, సొంత రాజకీయ ఎజెండా కోసం ఆప్ పోరాటం సాగిస్తోందనేది కాదనలేని వాస్తవమని, ఇది చాలా బాధాకరమని అన్నారు. ఇందువల్ల ఢిల్లీ ప్రజలకు కనీస సేవలు కూడా అందించలేకున్నారని విమర్శించారు. కేంద్రంతో పోరాటానికే రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక సమయాన్ని కేటాయించుకుంటూపోతే దేశరాజధాని నిజమైన ప్రగతి అసాధ్యమని పేర్కొన్నారు. ఢిల్లీ ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతోనే తాను రాజకీయ జీవితాన్ని ప్రారంభించానని, అందుకోసం తాను పనిచేస్తానని చెప్పారు. ఇందుకోసం ఆప్‌ను వీడటం తప్ప మనకు మరో మార్గం లేదని, ఆప్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని ఆ లేఖలో గెహ్లాట్ తెలిపారు.



## శరద్ పవార్ బ్యాగులు తనిఖీ

**ముంబయి :** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రవర్తనా నియమావళిని అధికారులు అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత శరద్ పవార్ బ్యాగులను, ఆయన ప్రయాణించిన హెలికాప్టర్‌ను ఎన్నికల సిబ్బంది తనిఖీ చేశారు. ఆదివారం ఉదయం పూణె జిల్లాలోని బారామతి హెలిప్యాడ్ వద్ద ఈ సంఘటన జరిగింది. షోలాపూర్‌లో ఎన్నికల ర్యాలీకి హాజరయ్యేందుకు హెలికాప్టర్‌లో శరద్ పవార్ ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆ హెలికాప్టర్‌తోపాటు ఆయన బ్యాగులను ఎన్నికల అధికారులు చెక్ చేశారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. కాగా, తొలుత ప్రతిపక్ష నేతల బ్యాగులను ఎన్నికల అధికారులు చెక్ చేయడంపై ఎంవిఎ కూటమి నేతలు విమర్శించారు. తన బ్యాగులను తనిఖీ చేయడంపై ఉద్ధవ్ ఠాక్రే మండిపడ్డారు. ప్రధాని మోదీ, అమిత్ షా, సిఎం షిండే, డిప్యూటీ సీఎంలు ఫడ్నవీస్, అజిత్ పవార్ బ్యాగులను చెక్ చేయరా? అని ప్రశ్నించారు. మరోవైపు సీఎం షిండే, ఫడ్నవీస్, అజిత్ పవార్‌తో పాటు కేంద్ర మంత్రి అమిత్ షా బ్యాగులను కూడా ఈసీ అధికారులు ఆ తర్వాత తనిఖీ చేశారు. శనివారం రాహుల్ గాంధీ బ్యాగులు, అంతకు ముందు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే బ్యాగులను కూడా అధికారులు చెక్ చేశారు. నవంబర్ 20న మహారాష్ట్రలో పోలింగ్ జరుగనున్నది. 23న జార్ఖండ్‌తో సహా కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తారు.

## సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అమలులో
# సంస్థల పూర్తి వైఫల్యం



**న్యూఢిల్లీ :** దేశరాజధాని ఢిల్లీలో సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్, 2016 అమలులో సంస్థలన్నీ పూర్తిగా వైఫల్యం చెందాయని సుప్రీంకోర్టు అసంతృప్తిని వ్యక్తంచేసింది. దీనిపై దేశ రాజధాని ఢిల్లీలో అన్ని భాగస్వామ్యక్షాలతో ఈ అంశంపై చర్చించేందుకు త్వరలోనే ఒక సమావేశం ఏర్పాటు చేయాలని ఢిల్లీ ప్రభుత్వ ప్రధానకార్యదర్శిని ఆదేశించింది. దేశ రాజధాని ఢిల్లీలో ఈ స్ఫూర్తిని 2016రూల్స్ అమలు చేసేందుకు ల అత్యంత ప్రాముఖ్యమైనదిగా భావించి అమలు చేయాలని వారి లేఖలో పేర్కొన్న విషయాన్ని సర్వోన్నత న్యాయస్థానం గ్రహించింది. ఒకవేళ అందరు ఇతర అధికారులు అందరూ కలిసికట్టుగా రానట్లయితే ఒక నిర్దేశిత కాలవ్యవధితోని 2016రూల్స్ అమలుకు సమయాన్ని మాకు తెలియజేయండి. అప్పుడు కోర్టు ఎలాంటి కఠినమైన ఆదేశాలు జారీ చేస్తుందో చూడండి అని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు అభయ్ ఎస్ ఓకా, ఆగస్టిసన్ జార్జి మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం నవంబరు 11న జారీ చేసిన తన ఆదేశాలలో తెలిపింది. ఇందుకోసం భాగస్వామ్య పక్షాలు అందరితో ఒక సమావేశం ఏర్పాటు చేయాలని తా ము ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశిస్తున్నామని ధర్మాసనం పేర్కొంది. ఈ అంశంపై నిర్వహించబోయే సమావేశంలో దీనిపై అందరినుంచి ఒక సామూహిక స్పందన డిసెంబరు 13వ తేదీ నాటికి రావాలని సర్వోన్నత న్యాయస్థానం తెలిపింది.

## నటి కస్తూరికి రిమాండ్.. పుళల్ జైలుకు తరలింపు



**చెన్నై :** క్రిష్టియన్ మైఖెల్‌ను తమిళనాడులో స్థిరప డ్డ తెలుగువారిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేసులో సినీ నటి కస్తూరిని పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ కేసు విచారించి న ఎగ్మోర్ మెట్రోపాలిటన్ న్యాయస్థానం 12 రోజుల పాటు ఆమెకు రిమాండ్ విధించింది. దీంతో పోలీసులు ఆమెను పుళల్ కేంద్ర కారాగారానికి తరలించారు. ఇదిలా ఉండగా, తీర్పు అనంతరం బ యటకు వచ్చిన కస్తూరి అక్కడే ఉన్న విలేకర్లను చూసి.. ''అధికార దుర్వినియోగానికి ముగింపు పలకండి. న్యాయా న్ని గెలిపించండి'' అని వ్యాఖ్యలు చేశారు. కస్తూరి శంకర్ నవంబరు 3న చెన్నై లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ తమిళనాడులోని తెలుగు వారిపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీనిపై తీవ్ర దుమారం రేగడంతోపాటు తమిళనాడులోని అనేక ప్రాంతాల్లో ఆమెపై కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో తనకు ముందస్తు బెయిలు ఇవ్వాలంటూ కస్తూరి మదురై కోర్టును ఆశ్రయించగా.. న్యాయస్థానం పిటిషన్‌ను తిరస్కరించింది. ఈ క్రమంలోనే హైదరాబాద్ శివారులో ఓ సినీ నిర్మాత ఇంట్లో ఆమె ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నిన్న మధ్యాహ్నం ఆమెను కస్టడీలోకి తీసుకున్నారు.

# ఢిల్లీలో రోజురోజుకు క్షీణిస్తున్న వాయు నాణ్యత



న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో వాయునాణ్యత రోజురోజుకూ క్షీణిస్తోంది. వరుసగా ఐదో రోజు ఆదివారం వాయు నాణ్యత సూచీ 428గా నమోదై ఢిల్లీని తీవ్ర కేటగిరిలో చేర్చింది. సిస్టమ్ ఆఫ్ ఎయిర్ క్వాలిటీ అండ వెదర్ ఫోర్‌కాస్టింగ్ అండ్ రీసెర్చి (ఎస్‌ఎఎఫ్‌ఎఆర్ ) ప్రకారం నగరం మొత్తం ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ ఉదయం 8 గంటలకు ప్రమాదకర స్థాయిలో 409 వద్ద నమోదైంది. ఇది ఢిల్లీ ప్రజలకు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను తెచ్చిపెడుతుంది. మరోవైపు సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (సిపిసిబి) ప్రకారం ఆదివారం ఢిల్లీలోని 14 చోట్ల ఎక్యుఐ స్థాయిలు 400 దాటడం విశేషం. వాయు కాలుష్యంతో విమాన సర్వీసులపై ప్రభావం పడినట్టు అధికారులు పేర్కొన్నారు. ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ విమానాశ్రయంలో పొగమంచు దట్టంగా కమ్ముకోవడంతో 800 మీటర్ల మేర దృశ్యాలు కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో 107 విమాన సర్వీసులు ఆలస్యమయ్యాని, మూడు రద్దు అయ్యాయని ఫ్లైట్ రాడార్ సంస్థ వెల్లడించింది. ఈ పరిస్థితులపై ఢిల్లీ ఎయిర్‌పోర్ట్, విమానయాన సంస్థలు ప్రయాణికులను అప్రమత్తం చేశాయి. వాతావరణ శాఖ వివరాల ప్రకారం జాతీయ రాజధాని ప్రాంతాల్లోని అనేక మానిటరింగ్ స్టేషన్లలో వాయు నాణ్యత సూచీ 400 పైనే నమోదైంది. బవానాలో అత్యధికంగా 471, అశోక్ విహార్, జహంగీర్‌పురిలో 466, ముండ్కా, వజీర్‌పూర్‌లో 463 గా వాయు నాణ్యత సూచీ నమోదయ్యింది. దీంతో ఈ ప్రాంతాలు సీవియర్ ప్లస్ వాయు నాణ్యత కేటగిరి లోకి పడిపోయాయని అధికారులు పేర్కొన్నారు. ఢిల్లీలో కాలుష్య స్థాయిలు విపరీతంగా పెరుగుతుండడంతో ప్రజలు శ్వాసకోశ, కంటి సమస్యల బారిన పడే అవకాశం ఉందని , ఇతర అనారోగ్య సమస్యలూ రావొచ్చని నిపుణులు సూచిస్తున్నారు. దేశ రాజధానిలో వాయు కాలుష్యం తీవ్రత ఇలాగే పెరిగితే అత్యవసరం కాని నిర్మాణాలు, కూల్చివేతలపై నిషేధం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. మరోవైపు ఢిల్లీ లోని నోయిడా, గురుగ్రామ్, ఘజియాబాద్, ఫరీదాబాద్‌ల్లో వరుసగా వాయునాణ్యత సూచీ 308, 307, 372,260గా నమోదయ్యింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఇది వాయు నాణ్యతలో స్వల్ప మెరుగుదలను సూచిస్తోంది.

**ప్రజలకు హెచ్చరికలు**

కాలుష్యాన్ని నివారించేందుకు ప్రజలు అనవసరంగా ఇళ్ల నుంచి బయటకు రావద్దని ప్రభుత్వం హెచ్చరించింది. ఢిల్లీలో ఐదో తరగతి వరకు పిల్లలకు తరగతులు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. మరోవైపు 6 వ తరగతి వరకు పిల్లలకు పాఠశాలల్లో మాస్కులు ధరించడం తప్పనిసరి చేశారు. కాలుష్యాన్ని తగ్గించేందుకు ఢిల్లీ ప్రభుత్వం అనేక చోట్ల నీటిని చల్లుతోంది. ఈ నేపథ్యంలో రాజధానిలో జీఆర్‌ఎపి3 నిబంధనలు అమలు చేస్తున్నారు. ఈ నిబంధనల ప్రకారం ఢిల్లీ ఎన్‌సిఆర్‌లో అన్ని రకాల నిర్మాణాలు , మైనింగ్, కూల్చివేతలు నిషేధించారు. ఇతర రాష్ట్రాల వాహనాలపై నిషేధం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే బీఎస్3 పెట్రోల్, బీఎస్4డీజిల్ వాహనాలపై ఢిల్లీలో నిషేధం విధించారు. ఢిల్లీలో కాలుష్య కారక పారిశ్రామిక యూనిట్లు, థర్మల్ పవర్ ప్లాంట్లు కూడా రద్దయ్యాయి. తాండూర్‌లో బొగ్గు, కలప వాడకంపై నిషేధం వంటి పలురకా ల చర్యలను అమలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించిన వారు మోటారు వాహనాల చట్టం (1988 లోని సెక్షన్ 194(1) ప్రకారం జరిమానాలను ఎదుర్కొంటారు. ఇందులో రూ. 20.000 వరకు జరిమానా ఉంటుంది. అయినప్పటికి కాలుష్యం మాత్రం 400 స్థాయి నుంచి తగ్గడం లేదు.

## చెప్పులను నిషేధించండి'..!

### స్వతంత్ర అభ్యర్థి వినూత్న విజ్ఞప్తి

**ముంబయి :** మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల కోలాహలం నెలకొంది. పోలింగ్ తేదీ సమీపిస్తుండటంతో అభ్యర్థులంతా ప్రచారంలో తలమునకలయ్యారు. ఈ క్రమంలోనే పరాండా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న ఓ స్వతంత్ర అభ్యర్థి.. ఎన్నికల అధికారికి చేసిన విజ్ఞప్తి చర్చనీయాంశమైంది. తన ఎన్నికల గుర్తు 'చెప్పులు' అని.. పోలింగ్ కేంద్రాల వద్ద వాటిని ధరించడం ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొంటూ వాటిని నిషేధించాలని కోరడం గమనార్హం. ధారాశివ్ జిల్లాలోని పరాండా నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న గురుదాస్ శంభాజీ కాంబ్లేకు ఈసీ 'చెప్పులు' గుర్తును కేటాయించింది. ఎన్నికల కోడ్ ప్రకారం పోలింగ్ కేంద్రాల వద్ద అభ్యర్థులు తమ గుర్తులను ప్రదర్శించకూడదు. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ ఆయన ఎన్నికల అధికారికి లేఖ రాశారు. ''పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు, అధికారులు చెప్పులు ధరించి వస్తే.. అది నిబంధనల ఉల్లంఘనే అవుతుంది. ఈ నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో చెప్పులను నిషేధించాలి. అతిక్రమించినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఎన్నికల ప్రక్రియ పవిత్రతను నిలబెట్టేందుకు, ఉల్లంఘనలను నివారించేందుకే ఈ అభ్యర్థన చేస్తున్నా'' అని పేర్కొన్నారు.

# సాహితీ విహారి

# అక్షర ఆయుధధారి.. 'ఆవంత్స'



నేడు జయంతి

'ఖబడ్దార్ హే నిజాం పాదుషా. ఒక వీరుడు మరణిస్తే వేలకొలది ప్రభవింతురు' అంటూ నాటి దుష్టపాలనకు వ్యతిరేకంగా నినదించిన గొంతుక ఆవంత్స సోమసుందర్. తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య మరణవార్తపై స్పందించిన ఆయన 'ఖబడ్దార్' అనే కవితలో నైజామ్ పాలనపై నిప్పులు చెరిగారు. అక్షరాలే ఆయుధంగా పైశాచిక పాలకులపై తిరగబడ్డారు. ఆ కవిత రేపిన సంచలనం అంతాఇంతా కాదు. సోమసుందర్ పేరు వినగానే మొదట గుర్తుకొచ్చేది 'వజ్రాయుధం'. ఈ కవితా సంకలనం 1949లో వెలువడింది. తెలంగాణ నలుమూలలా ఉద్యమ స్ఫూర్తిని రగిలించింది. తెలంగాణ సాయుధ పోరాటానికి విద్యార్థిగానే ఆయన మద్దతునిచ్చారు. ఉద్యమించారు. 'రక్తాక్షి', 'మేఘ రంజని', 'అనల కిరీటం', 'వెన్నెల్లో కోనసీమ' వంటి ఎన్నో కావ్యాలు, దీర్ఘ కవితలు రాసిన సోమసుందర్ 1924, నవంబరు 18 కాళ్ళూరి సూర్యప్రకాశరావు, వెంకాయమ్మ దంపతులకు, తూర్పు గోదావరి జిల్లా అన్నవరం సమీపంలో ఉన్న శంఖవరం అనే గ్రామంలో జన్మించారు. పిన్నమ్మ ఆవంత్స వెంకాయమ్మకు దత్తుడిగా వెళ్లడంతో కాళ్లూరి సోమసుందర్ పేరు ఆవంత్స సోమసుందర్ అయింది. ఆ పేరుతోనే ఆయన సాహితీలోకంలో చిరంజీవిగా నిలిచిపోయారు. సోమసుందర్ కవిత్వానికి తాను దాసుడినని శ్రీశ్రీ చెప్పుకొన్నాడు. దీనిని బట్టే ఆయన ప్రతిభను అంచనా వేయవచ్చు. 'పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది' అనే నానుడికి సోమసుందర్ పూర్తి వ్యతిరేకం. చిన్నతనంలోనే పెంపుడు తల్లిదండ్రులను కోల్పోయిన ఆయన జులాయిగా తిరిగారు. అడ్డమైన వ్యవసనాలకు బానిసయ్యారు. అయితే, తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిందో లేక సమాజాన్ని చూసి గుండె స్పందించిందో తెలియదుగానీ, చిన్నతనం నుంచి ఆయనకు కవిత్వంపై మక్కువ ఎక్కువ. ఆయన ప్రాథమిక విద్యాభ్యాసం పిఠాపురంలో జరిగింది. 1943లో కాకినాడ పి.ఆర్.కళాశాలలో చేరి, ఉన్నత విద్యనభ్యసించారు. అయితే, అంతకు ముందే ఆయన తోటి విద్యార్థులతో కలిసి జాతీయోద్యమంలో పాల్గొన్నారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా దాశరథి వంటి కవులు సాగిస్తున్న పోరాటానికి ఉత్తేజితుడై సోమసుందర్ తెలంగాణ పోరాటానికి మద్దతుగా అనేక కవితలు రాసాడు. సోమసుందర్ యువతను ఉద్యమించమని పిలుపునిస్తూ 'వజ్రాయుధం' రాశారు. అప్పట్లో నిజాం వ్యతిరేక పోరాటానికి మద్దతుగా రాసిన కవితల సంకలం అదే పేరుతో విడుదలైంది. తర్వాతి కాలంలో అనేక విమర్శ గ్రంథాలు, అసంఖ్యామైన విశ్లేషణాత్మక వ్యాసాలను అందించారు. సోమసుందర్ చేసిన అనేక రచనలు ఆయనకుగల ప్రాచీన అర్వాచీన, ప్రాచ్యపాశ్చాత్య సాహిత్యాధ్యయన పటిమను నిరూపిస్తాయి. వివిధ అంశాలపై ఆయనకుగల విస్తృత జ్ఞాన పరిధిని వివరిస్తాయి. ఆయన పరిశీలనా శక్తి అద్భుతం. సాహితీశైలి అపూర్వం. నిజ జీవితంలో మాదిరిగానే, సోమసుందర్ సాహితీ ప్రస్థానం కూడా అనేకానేక మలుపులమయం. ఆయన ఏదైనా రాయగలరు. ఎలాగైనా రాయగలరు. సాంప్రదాయ విధానాల నుంచి అత్యాధునిక పోకడల వరకూ అన్నీ సోమసుందర్ సొంతమే. ఆయన కథలు రాశారు. కవితలు, వ్యాసాలు, నాటకాలు.. ఇలా ఒకటని ఏమిటి.. పలు రకాల సాహితీ ప్రక్రియలను అవపోసనపట్టారు. సోమసుందర్ రాసిన 'విషవలయం' నాటికను అనేక పరిషత్తుల్లో ప్రదర్శించారు. ఆ నటకం ఎన్నో బహుమతుల్ని గెలుచుకుంది. కథకుడుగా కూడా సోమసుందర్ తనదైన ముద్ర వేశారు. జీవతానుభవమే ఆయన కథావస్తువుగా మారేది. పాత్రలన్నీ రోజూ మనం నిత్యం చూసేవిగానే కనిపిస్తాయి. మనతో మమేకమవుతాయి. 'సమాగమం' నవల ఆయన విలక్షణ రచనా శైలిని మనకు పరిచయం చేస్తుంది. ఆయన కేవలం సాహితీవేత్త మాత్రమేకాదు.. పత్రికాధిపతి కూడా. ఆయన నడిపిన 'కళాకేళి' సాహిత్య పత్రిక ఎంతో మంది అభ్యుదయ కవులకు, ఔత్సాహిక రచయితలకు ప్రోత్సాహాన్నిచ్చింది. చైతన్య వేదికగా నిలిచింది. అప్పట్లో ఒక ఉద్యమంలా కొనసాగిన భావకవిత్వానికి సోమసుందర్ ప్రారంభంలో చాలా దూరంగానే ఉన్నారు. కానీ, తర్వాతి కాలంలో కృష్ణశాస్త్ర ప్రభావం ఆయనపై పడింది. కృష్ణశాస్త్రని తన గురువుగా చెప్పేవారు. కాగా, జర్మన్ నాటకకర్త బెర్తోల్ట్ బ్రెష్ట్ నాటకం 'అమ్మ'ను తెలుగులోకి అనువదించి, అనువాదకుడిగానూ తనను తాను నిరూపించుకున్నారు సోమసుందర్. ఇతర భాషల నుంచి ఎన్నో కవితలను ఆయన తెలుగులోకి అనువదించారు. తాను జీవించి ఉన్నప్పుడే 'ఆవంత్స సోమసుందర్ లిటరరీ ట్రస్ట్'ను ఏర్పాటు చేశారు. తన జన్మదినమైన నవంబర్ 18న వివిధ సాహితీ ప్రక్రియల్లో విశేషంగా కకృషి చేసిన రయితలకు పురస్కారలను అందించేవారు. ఈ రకంగా సాహితీసేవలో తరించారు. ఎన్‌టిఆర్ పురస్కారాన్ని, కళారత్న అవార్డును అందుకున్నారు. 2016, ఆగష్టు 12న తుదిశ్వాస విడిచేవరకూ ఆయన సాహితీ సేవలోనే తరించారు.

తెలుగు సాహితీలోకంలో ప్రగతిశీల రచయితల్లో మేటిగా నిలిచి, అవిరళమైన కృషితో ధాటిగా సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన సృజనకారుడిగా సోమసుందర్ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది.

**'రండి రండి ఉక్కుముక్కు కాకుల్లారా**
**రండ్రా గద్దల్లారా రండి రండి**
**సమరంలో క్షతగాత్రుడనై పడిపోయిన**
**నా శరీరాన్ని తినివేయండి'**

అంటూ నినదించిన ఆవంత్స సోమసుందర్ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఎంతో మందికి మార్గదర్శకుడయ్యారు. ఓలేటి శశాంక, డాక్టర్ సి. నారాయణ రెడ్డి, గుర్రం జాషువా, వేటూరు సుందరరామ మూర్తి వంటి పలువురు లబ్ధప్రతిష్ఠులు సోమసుందర్ నుంచే ప్రేరణ పొందారని అంటారు. 'వజ్రాయుధం' చదివిన తర్వాత, అలాంటి కవిత్వం రాయలని కోరిక కలిగిందని, అ స్ఫూర్తితోనే 'మహాప్రస్థానం' రాశానని శ్రీశ్రీ అన్నారన్న మాట ప్రచారంలో ఉంది.

**'ఏమమ్మా, ప్రళయమువలె పొంగి ఓ గౌతమి**
**ఇకనైనా దయను చూపి శాంతించవదేమి?**
**ప్రసవించిన పులివై నీ కన్న బిడ్డలను మమ్ముల**
**కోరలెత్తి మ్రింగుట ఇది ఏమి న్యాయమే తల్లీ'**

అని జలప్రళయాన్ని వర్ణించారు సోమసుందర్.

**'గ్లోబలైజేషన్ తో ఈ భూమి రజస్వలై**
**నవవరాన్వేషణలో మిటకరిస్తుంది......**
**హ్యూమన్ జెనిటిక్ ఇంజనీరింగ్ తో**
**అవతరించిన క్లోనింగ్ కోడె దూడ**
**'అంబా' అని అరవడం**

గ్రాంధికమని నిషేదిస్తుంది' అని ప్రాపంచీకరణను తూర్పారపట్టారు 'నేటిని ఏటికి విడిచి' అనే కవితలో... 'సమరం కాదిది మరణం' అనే కవితలో

'నేడు నా ముని వాకిట
పూచిన గులాబి పరిమళం నిండా
బాంబుల విషధూమం నింపింది పడమటి గాలి'

అంటారు. యుద్ధాలను, హింసను ద్వేషిస్తూ..

**– సత్యశ్రీ**







# ఆకాశమంత సాహితీరూపం..

లియో తోల్‌స్త్రాయ్.. లియో తాల్‌స్తోయ్.. ఒక్కో పుస్తకం లేదా వ్యాసంలో ఆయన పేరు ఒక్కో రకంగా ప్రస్తావించినా, మనకు లియో టాల్‌స్టాయ్ గానే సుపరచితుడు. మరో గొప్ప నాటకకర్త అంటోన్ పావ్లొవిచ్ చెకోవ్ (1860–1904)తో కలిసి ఉన్న టాల్‌స్టాయ్ (కుడి) ఫోటో అరుదైనదేకాదు.. అపూర్వమైనది కూడా. రష్యాలోని టాంగన్రాగ్ అనే గ్రామంలో 1860 జనవరి 29న ఒక బానిస కుమారునిగా చెకోవ్ జన్మించాడు. ఈయన తండ్రి ఒక చిల్లర దుకాణం నడిపేవాడు. తన దుకాణంలో పనిచేయమని, తానే నడుపుతున్న ఒక చర్చి గాయకబృందములో చేరమనీ కుమారున్ని ఆయన నిర్బంధించేవాడు. తల్లి చెకోవ్‌ను ఎంత ప్రేమగా చూసినా బాల్యానికి సంబంధించిన బాధాకర స్మృతులే ఆయనకు మిగిలాయి. అతని అనంతర రచనలలో చాలా వాటిలో ఆ అనుభవాల ప్రతిధ్వనులే వినిపిస్తాయి. అయితే, చిన్నతనంలో ఎన్ని బాధలు పడ్డా.. కన్నీళ్లు దిగమింగినా, చెకోవ్ రచనలో హాస్యం తొణికసలాడుతుంటుంది. తండ్రి దివాళా తీయడంతో చివరి 3 ఏళ్లూ ఒంటరిగా ఉంటూ చిన్నపిల్లలకు చదువుచెబుతూ చెకోవ్ తన కాళ్ల మీద తాను నిలబడవలసి వచ్చింది. తండ్రి తక్కిన కుటుంబ సభ్యులతో సహా జీవనోపాధిని వెతుక్కుంటూ మాస్కో నగరం చేరుకొన్నాడు. 1879 శీతాకాలంలో చెకోవ్ మాస్కోలోని తన కుటుంబ సభ్యులను చేరుకొని 1892 వరకూ వారితో కలిసి ఉన్నాడు. మాస్కో విశ్వవిద్యాలయంలోని వైద్య కళాశాలలో చేరి, 1884లో వైద్య పట్టబద్రుడయాడు. పలు హాస్య పత్రికలకు మారుపేర్లతో ఛలోక్తులు రాయడంతో చెకోవ్ రచనా ప్రస్థానం మొదలైంది. ఆతర్వాత ఎన్నో గొప్ప రచనలు అతనిని రష్యా సాహితీ రంగంలో ధ్రువతారగా నిలిపాయి. 1891–92 నాటి దారుణ కరువు కాటక పరిస్థితులలో వైద్యునిగానేకాక, వైద్యశాఖా నిర్వాహుడుగానూ చెకోవ్ దేశానికి ఎనలేని సేవచేశాడు. ఇక టాల్‌స్టాయ్ రచన గురించి కొత్తగా వివరించే ప్రయ త్నం చేయడం సాహసమే అవుతుంది. సూ ర్యుడిని దివిటీతో చూపించడం వంటిది. టాల్‌స్టాయ్ శాంతికాముకుడు. ఎలాగైనా జవించేస్తే సరిపోతుందని చాలా మంది అనుకుంటే, టాల్‌స్టాయ్ మాత్రం తనకు తానే కొన్ని నియమాలను ఖరారు చేసుకొని, ఆ పరిధిలోనే ఉండడానికి ఇష్టపడేవాడు. రాత్రి 10 నుంచి ఉదయం 5 గం టల వరకే నిద్రపోవాలని, మితంగా తినాలని అందరికీ చెప్పేవాడు. తీపి పదార్థాలకు దూరంగా ఉండమని సూచించేవాడు. మరుసటి రోజు ఎలా గడపాలనుకుంటున్నది, ముందు రోజే ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నది టాల్‌స్టాయ్ అభిప్రా యం. మనసులో ఉండే ఎన్నో రకాల కోరికలనే రాక్షసులను గెలవాలంటే, సమయపాలన, నిర్దిష్టమైన వ్యక్తిత్వం అత్యవసరమని నమ్మేవాడు. అదే సూత్రాన్ని ఆచరించాడు. 1862లో, 34 ఏళ్ల టాల్బాయ్ కోర్టు వైద్యుడి కుమార్తె అయిన 18 ఏళ్ల సోఫియా బెహర్స్‌ను వివాహం చేసుకున్నాడు. అదే ఏడాది అతని తన ప్రఖ్యాత నవల 'వార్ అండ్ పీస్'ను పూర్తిచేసే పనిలో నిమగ్నమయ్యాడు. రాసింది సరిచూసుకొని, కొన్ని చోట్ల సంస్కరించి, మరికొన్ని చోట్ల భారీ మార్పులుచేర్పులు చేసేవాడు. ఆ సమయంలో అవే కాగితాలపై నోట్స్ కూడా రాసుకునేవాడు. కొత్తగా ఎవరైనా చూస్తే, అవి చిత్తుకాగితాల్లా కనిపించేవి. ఒక్కోసారి తాను ఏం రాసుకున్నాడో తనకే తెలియనంత గజిబిజిగా నోట్స్ ఉండేవి. వాటిని సరిచేసి, అందమైన దస్తూరీతో రాసే బాధ్యతను సోఫియా స్వీకరించింది. సగటున ఒక్కో మ్యాన్‌స్క్రిప్ట్‌ను ఎనిమిదిసార్లు తిరగరాసేది. కొన్ని సందర్భాల్లో 30 లేదా 35 సార్లు ఫెయిర్‌కాపీ రాసేది. ఒక రకంగా టాల్‌స్టాయ్ పేరుప్రఖ్యాతుల్లో ఆమెను సమాన భాగస్వామిగా పేర్కొవాలి. టాల్‌స్టాయ్ వ్యవస్థీకృతమైన సిద్ధాంతాలను ప్రశ్నించాడు. అవినీతిని వ్యతిరేకించాడు. భగవంతుడి ఉనిపై అనుమానాలు లేవదీశాడు. ఆచారాలను తిరస్కరించాడు. ఫలితంగా జారిస్ట్ ప్రభుత్వం అతనిపై నిఘా ఉంచింది. రష్యాన్ సంప్రదాయ చర్చి అతనిని బహిష్కరించి కక్ష తీర్చుకుంది. అయినప్పటికీ ఆయన తన వైఖరిని మార్చుకోలేదు. శాంతియుతమైన జీవనాన్ని అవలంభించిన ఆయన ఎంతో మందికి మార్గదర్శకుడయ్యాడు. మహాత్మా గాంధీ సైతం తాను టాల్‌స్టాయ్ నుంచి స్ఫూర్తిపొంది, అహింసను ఆయుధంగా చేసుకున్నానని పలు సందర్భాల్లో చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. రచయితగా స్థిరపడిన తర్వాత టాల్‌స్టాయ్ ఎస్టేట్‌ను కొనుగోలు చేసి, అందులో ప్రశాంతమైన జీవితాన్ని గడిపాడు. 1828 సెప్టెంబర్ 9న జన్మించిన అతను 1910 నవంబర్ 20న, తన 82వ ఏట తుదిశ్వాస విడిచాడు. ఒక గొప్ప రచయిత, మానవతావాది, అహింసావాది వర్ధంతి మరో రెండు రోజుల్లో నిర్వహించుకోనున్న నేపథ్యంలో, ఆయన గుర్తించి తలచుకోవడం, జీవనపాఠాలు నేర్చుకోవడం మన కర్తవ్యం.

# శ్రామిక వర్గానికి పెద్దపీట..



వామపక్ష సాహిత్యం అంటేనే 'హింస' అనే దురభిప్రాయం చాలా మందిలో ఉంది. అందుకే, సమాజంలో నెలకొన్న రుగ్మతలపై కలాలు ఝుళిపించిన వారు కూడా, తమది వావపక్ష సాహిత్యమని అంగీకరించేందుకు జంకుతున్నారు. కానీ, అణచివేతను ఎదిరించేది ఏదైనా సామపక్ష సాహిత్యమే. దోపిడీని నిలదీసేదీ... సమానత్వాన్ని చాటించేదీ కూడా వామపక్ష సాహిత్యమే. శ్రామికుల పక్షాన నిలిచేది... కార్మికులకు మద్దతునిఏచ్చది కూడా ఈ సాహిత్యమే. సమసమాజాన్ని కోరే ప్రతి అక్షరం వామపక్ష సాహిత్యవనంలో ఓ పారిజాతమే. వామపక్ష సాహిత్యంలో ఒక భాగమైన శ్రామిక వర్గ సాహిత్యం విషయానికి వస్తే, ఇది ప్రధానంగా వర్గస్పృహగల రచనల సముదాయం. శ్రామికవాద కవితలు, నవలు, వ్యాసాలను హింసావాద సాహిత్యానికి జతగట్టి విమర్శించడం కొంత మంది ఛాందసవాద సాహితీవేత్తలకు అలవాటుగా మారింది. శ్రమిక వర్గల జీవన పరిస్థితులు, వారు ఎదుర్కొంటున్న కష్టాలను వివరించడం కూడా నేరంగా పరిగణించే భావదారిద్ర్యం నెలకొనడం విచారకరం. పెట్టుబడిదారీ వ్యవస్థలతో పోలిస్తే, సామ్యవాద పునాదులపై ఏర్పడిన వ్యవస్థల్లో నిజమైన శ్రామిక సాహిత్యాన్ని ఆస్వాదించవచ్చు. పెట్టుబడిదారీ రచనలు తిరోగమనానికి సూచికలు. చార్లెస్ డికెన్స్ (హార్డ్ టైమ్స్), జాన్ స్టెయిన్బెక్ (ది గ్రేప్స్ ఆఫ్ వ్రాత్) మరియు హెన్రీ గ్రీన్ వంటి రచయితలను శ్రామికవర్గాల పక్షాన నిలిచారు. వారి పడుతున్న కడగండ్లను కళ్లకుకట్టినట్టు తమతమ చూపారు. సమస్యను ప్రస్తావించడంతో ఆగకుండా, పరిష్కార మార్గాలను కూడా సూచించారు. బ్రిటన్‌కు చెందిన విలియం బ్లేక్ (1757–1827)ను తొలి శ్రామికవాద కవిగా చెప్తారు. 'సాంగ్స్ ఆఫ్ ఇన్నోసెన్స్', 'సాంగ్స్ ఆఫ్ ఎక్స్‌పీరియన్స్'లో అతను బాలకార్మిక వ్యవస్థను ఆవిష్కరించాడు. విచిత్రంగా బ్లేక్ శ్రామిక కుటుంబానికి చెందిన వాడుకాదు. అతని తండ్రి వ్యాపారి. అయితే, చిన్నతనం నుంచి తమ వద్ద పనిచేసేవారు, ప్రత్యేకించి బాలకార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను దగ్గరగా చూశాడుకాబట్టే, వారి జీవితాలపై అంత సూక్ష్మైన వివరణ ఇవ్వగలిగాడు. 'శ్రామిక పక్షపాతి'గా పేరు తెచ్చుకున్నాడు. ఒక రకంగా చెప్పాలంటే, ఆయనతోనే శ్రామిక వర్గంపై రచనలు ప్రారంభమయ్యాయి.

# దేశంలో భాషా వైవిధ్యం



మన దేశంలో ఉన్నంతగా భాషా వైవిధ్యం మరెక్కడా కనిపించదు. ప్రపంచంలో అధికారిక భాష ఏదీ లేని దేశం బహుశా భారత్ ఒక్కటేనేమో! 1963లో వచ్చిన జాతీయ భాషా చట్టంలో హిందీ, ఇంగ్లీషును సంయుక్తంగా దేశ భాషగా పేర్కొన్నారు. అధికారికంగా ఫలానా అంటూ ఏదీ లేక పోయినప్పటికీ, పరోక్షంగా హిందీ దేశ భాషగా చెలామణి అవుతున్నది. బలవంతంగా హిందీని తమపై రుద్దే ప్రయత్నాలను దక్షిణాది రాష్ట్రాలు, ముఖ్యంగా తమిళనాడు, కేరళ వ్యతిరేకిస్తున్నాయి. తొలుత 14 భాషల ను అధికారికంగా గుర్తించగా, ఆ సంఖ్య ఇప్పుడు 22కు చేరింది. కనీసం మరో 42 భాషలు కూడా అధికారిక గుర్తింపు కోసం డిమాండ్ చేస్తున్నాయి. ఏదిఏమైనా, అసలు భారతీయ భాషేకాని ఇంగ్లీషు ను దేశ భాషల్లో ఒకటిగా చేసుకోవడాన్ని మించిన దౌర్భాగ్యం మరొకటి లేదు. 1840 డాక్యుమెంట్ భా షలతో ద్వీప దేశం పాపువా న్యూ గినియా తర్వాత, భారతదేశం గ్రహం మీద అత్యంత భాషా వైవిధ్యం కలిగిన దేశం. ఎథ్నోలాగ్ ప్రకారం, మూడు ప్రధాన భాషా కుటుంబాలు భారతీయ భాషలలో మెజారిటీని కలిగి ఉన్నాయి. అవి సినోటిబెటన్ (~150 భా షలు, మాట్లాడేవారిలో 1 శాతం), ఇండో–యూరోపియన్ (~140 భాషలు, 77 శాతం), ద్రావిడియన్ (84 భాషలు. 20 శాతం సెంటు). ప్రఖ్యాత భాషా శాస్త్రవేత్త ముర్రే బి ఎమెనో భారతదేశాన్ని ఒకే భాషా జోన్గా అభివర్ణించారు: ఒకటి కంటే ఎక్కువ కుటుంబాలకు చెందిన భాషలను కలిగి ఉంటుంది, కానీ సాధారణ లక్షణాలను చూపుతుంది. ఇది ఇతర సాంస్కృతిక అంశాల (సాహిత్యం, ఆహారం, దుస్తు లు మొదలైనవి) మార్గాలకు సమాంతరంగా ఉం టుంది. తర్వాత ఇవి సంకర్షణ చెందుతాయి, కలిసిపోతాయి. కాలక్రమేణా అభివృద్ధి చెందుతాయి. ని జానికి ఈ రకమైన సంభావితీకరణ భారతదేశం వం టి అద్భుతమైన వైవిధ్యమైన దేశం ఇప్పటికీ ఏకీకృతమైన సాంస్కృతిక నీతిని ఎలా కలిగి ఉంటుందో అర్థం చేసుకోవడానికి అవకాశం కల్పిస్తుంది.

**గుర్తింపు పొందిన భాషలు..**

1. అస్సామీ, 2. బెంగాలీ, 3. బోడో, 4. డోంగ్రి, 5. గుజరాతీ, 6. హిందీ, 7. కన్నడ, 8. కాశ్మీరీ, 9. కోంకణి, 10. మైథిలి, 11. మలయాళం, 12. మణిపురి, 13. మరాఠీ, 14. నేపాలీ, 15. ఒడియా, 16. పంజాబీ, 17. సంస్కృతం, 18. సింధి, 19. తమిళం, 20. తెలుగు, 21. సంతాలీ, 22. ఉర్దూ.

## కొందరుంటారు...

మాటల పోపులనూ
మూగ చెవిలో వేస్తూ
అంధకారపు ఆటలక్రీడాలో

అక్షరాలను రాస్తూ
లేనిపోనీ అనుమానపు
అంటూ మొక్కలను పెంచుతూ
నమ్మకం లేని జీవిత
అంతరాలను ఊసిగోల్పే
అజ్ఞానాంధకారులు

బలం కోసం బలగం కోసం
తోడ్పాటు చేసే జనులకు
డబ్బులను ఎరగా వేసి
అధికార పీఠం కోసం
పేరు ప్రఖ్యాతల కోసం
బహుముఖ పాత్రలతో
పాకులాడే నాయకులు

అవినీతి వస్త్రాన్ని ధరించి
కుటీల బుద్దులను కలిగి
అధికార దాహం కోసం
నూతన ముసుగులు ధరించి
వాగ్దానాల కోరికల
కొవ్వుత్తులను వెలిగిస్తూ
అధికార కుర్చీల కోసం
వేంపర్లాడే మూనులు

తాత్కాలికమైన అశాశ్వతమైన
నగ్న దేహపు తెరలు కొన్ని
హంగులు ఆర్భాటాల కోసం
నిస్వార్థమైన మనసు లొగిల్లలో
హరివిల్లుల సోపానాలు వెదజల్లే
ఆనాలోచిత ఆర్భకులు
అక్కడక్కడా కొందరుంటారు!

**డాక్టర్ పగిడిపల్లి సురేందరు**
**8074846063**

## చెడు చెదలు..!

మొక్కకు పురుగు పడితే.. మందు
పిచికారీతో క్రిమిని సంహరిస్తాం
చెడు సహవాస చెదలు పడితే..
సద్బుద్ధి మందేసి ఆదిలోనే
తుంచేద్దాం !
తుమ్మ చెట్టుకు గొడ్డలితో కాటు వేస్తే..
జిగురు బంక ఉబికి కారుతుంది
మనసుకు కాసింత గాయమైతే..
కన్నీరు దారలుగా పారుతుంది !

నెత్తిన పేను పడితే.. దువ్వెనతో
ఏరి ఏరి పట్టి చంపుతాం
సమాజంలో నీచులు కనబడితే..
తెలివిగా కంపు కంపను పీకేద్దాం !
పాదానికి చెప్పు సైజు తగ్గితే..
పాదాలకు గాయాల రక్త మరకలు
సైజు పెరిగితే అడుగుల తడబాట్లు..
సంపాదన సరిపోయేంతే ఉండాలి
తక్కువైతే బతుకు వెతల బాధలు
ఎక్కువైతే కొవ్వెక్కి ముసిరే
రోగాలు !

బలిసినోడి ప్యాంటుకు ఫ్యాషన్
బొక్కలు.. బడుగు చొక్కా తూట్లు
కటిక దారిద్ర్యాలు నిలువ నీటిలో
విపరీత నాచు పెరుగుద్ది
సదాలోచనేలేని మనిషి మెదడుకు..
దురాలోచనల చెదలు పడుతుంది !

**మధుపాళీ**
**9949700037**

## ఈ వారం కవితలు

## నిండు జాబిలి నీడలో

చీకటి రాత్రి బూచాడి పేరు చెప్పి భయపెట్టిన అమ్మే
బాల్యంలోనే పరిచయం చేసింది జాబిల్లిని
ముద్దు ముచ్చట్లతో నోరు తెరిపిస్తూ
ముద్ద ముద్ద మురిపంగా తినిపిస్తూ
కడుపు నింపింది ఆకలి కంటే మిన్నగా

చందమామ కథలు ఎన్ని చెప్పిందో, ఎన్ని రకాలుగా
అందులో రథాలున్నాయో, కుందేలున్నదో
ఊహలకు మాత్రం రెక్కలు మొలిచాయి
బుద్ధి తెలియన్నాడు బుదుగరించిన వైనాలు
మిగిలున్నాయి జీవితాంతం జ్ఞాపకాలుగా

చుట్టూ తారలతో కొలువుదీరాడంటారు
రేరాజుమధ్య దూరం మనకు తెలియనంతైనా
వాటి మధ్య చూపులు చుట్టాలైనాయో లేదో కానీ
కథలల్లడంలో మనం దిట్టలం
నచ్చిన వాళ్లను చాంద్ కా తుకుడా అంటాం

కాలి వేళ్ల నుంచి తలెంటుకలదాకా
వర్ణనలు తెలివి మీరినవెన్నో
మోహం కమ్మినప్పుడు వెన్నెల వెండితెరపై
ప్రేమ చిత్రాలు పూలు పూసి, కథలు కాస్తాయి



యాంత్రిక జీవితంలో కొట్టుమిట్టాడుతున్న వాళ్ళం

వాస్తవాన్ని చెట్టు మీద అందని ఉట్టిని చేసి
పుస్తకాలకు పరిమితం చేస్తున్న అందమైన రాతల్ని
మరింత సెంటు పూసి రాస్తున్నాం
నిండు జాబిలి నీడలు, వెలుగులను
పూర్తిగా ఆస్వాదించేది ప్రకృతే

అడవి కాచిన వెన్నెల అంటారు
కానీఅడవి బిడ్డలు, చెట్లు చేమలు, నదులు, చెరువులు
పక్షులు, జంతువులు, జలచరాలు
కడుపారా తింటాయి నిండు జాబిలి ప్రసాదాన్ని

**కొమురవెల్లి అంజయ్యసిద్దిపేట**
**9848005676**

## ప్రజా చైతన్యం 'ఇఫ్టా'

ఇఫ్టా సంబరాలో అందరికీ వందనాలో బొంబాయిలో ఉదయించి...
దేశమంతా విస్తరించి...
జనంలోన చైతన్య దీపికై వెలిగింది

నాటి నుండి నేటి వరకు....
ఎనిమిది దశాబ్దాలు...
అలుపెరగక సాగుతున్న...
ప్రజా గొంతుకీ ఇఫ్టా...

కళ కళ కోసం కాదంటూ...
ప్రజల కోసమే అంటూ..
నినదించినదనాడే....
నిగ్గదీసినదీ సంఘం....

స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు...
సాంఘిక న్యాయం కై...
పోరాడుతూ ప్రజలల్లో.
చైతన్యం నింపింది...

స్వాతంత్ర్య సమరంలో...
కీలకంగా మారింది....
ప్రజా పక్షానికి ఊపిరై నిలిచింది
ఉద్యమాలు నడిపింది..

జర్మనీ ఫాసిస్టులనెదిరించి పోరింది
ప్రజా పోరాటాలకు తోడుగా నిలిచింది...
దర్శక,నిర్మాతలను అందించి ఆడింది
ప్రజా సాహిత్యానికి ప్రాణమై సాగుతోంది

ప్రజామెప్పు పొందింది
పోస్టల్ స్టాంపై వెలిసింది
సమాజ సేవలోన చిరునామాగా
నోచుకుంది
జాతి జనం గుండెల్లో
చిరస్థాయిగా ఉంటుంది
ప్రజా పోరు దారిలోన
సంతకమై తోడుంది

కలం గళం ఏకమై
ప్రజా పక్షముండమంది
నియంతల పాలనపై
నిరంతరం పోరమంది
జరుగుతున్న ఘోరాలను
విడమరచి చెప్పమంది
ప్రభుత్వాల పనితీరును
పాటతో ప్రశ్నించమంది

**గడ్డమీది చంద్రమోహన్ గౌడ్**
**9866510399**

## గాయపడిన చుక్కల దుప్పిని రక్షించిన అటవీశాఖ సిబ్బంది



ప్రజాపక్షం/ పెంచికల్‌పేట్: గాయపడిన చుక్కల దుప్పిని అటవీ శాఖ సిబ్బంది కాపాడి సమీప అటవీ ప్రాంతంలో వది లేశారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట మండలంలోని చేడ్వాయి నర్సరీ ప్రాంతంలో గాయపడి రోడ్డుమీద ఉన్న చుక్కల దుప్పిని చూసిన స్థానిక ఎస్ఐ కొమురయ్య అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఎస్ఐ సమాచారం మేరకు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అనిల్ కుమార్, సిబ్బంది గాయపడిన చుక్కల దుప్పికి వైద్యం అందించి అటవి సమీప ప్రాంతంలో వదిలేశారు. ఈ కార్యక్రమంలో పెంచికల్‌పేట్ డిఆర్ఒ జమీల్ అహ్మద్, చేడ్వాయి డిఆర్ఒ అబ్దుల్ ముసావీర్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మనోహర్, వాచర్లు రాజు, రామయ్య, పెంటయ్య, సంతోష్ దస్తగిరి పాల్గొన్నారు.

# మిడ్‌మానేరు భూనిర్వాసితులకు తీపి కబురు

### 4696 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తూ ఉత్వర్వులు
### మంత్రి పొన్నం ప్రభాకర్ కృషితో నెరవేరిన కల





ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాం నుంచి నుంచి పునరావాసం కింద ఇండ్లను మంజూరు చేయాలని కోరుతూ ఎదురుచూస్తున్న నిర్వాసితులకు కాంగ్రెస్ సర్కారు తీపి కబురు అందించింది. మిడ్ మానేరు నిర్వాసితులకు 4696 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వం లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి మిడ్‌మానేరు నిర్వాసితులకు ఇండ్లను మంజూరు చేయాలని కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల ఎమ్మెల్యేలు కోరారు. ఈ నేపధ్యంలో ముంపు గ్రామాల పక్షాన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రివర్గానికి ఎమ్మెల్యేలు, నేతలు కృతజ్ఞతలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రంలోని రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం మాన్వాడ గ్రామంలో మానేరు నదిపై 2 లక్షల హెక్టార్లకు సాగునీటిని అందించడం కోసం మిడ్‌మానేరు ప్రాజెక్టుకు 2005లో కాంగ్రెస్ ప్రభుత్వం శంకుస్థాపన చేసింది. నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం సహాయంతో ప్రాజెక్టు పూర్తయినప్పటికీ నిర్మాణంలో భాగంగా నివాసాలు కోల్పోయిన 10,683 కుటుంబాలకు గతంలో 5,987 ఇండ్లు మంజూరయ్యాయి. మిగతా నిర్వాసితుల పక్షాన రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి, మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ గత దశాబ్దకాలంగా రాజీలేని పోరాటం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ , చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కరీంనగర్ పార్లమెంటు కాంగ్రెస్ ఇన్‌చార్జ్ వెలిచాల రాజేందర్‌రావు ఇతర కాంగ్రెస్ ముఖ్య నేతలు ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ వేములవాడ పర్యటనలో భాగంగా రాజన్న దేవాలయం సాక్షిగా బెడ్‌రూం ఇల్లు మంజూరు చేస్తామని, ఐదు లక్షల రూపాయలు ప్రతి నిర్వాసితుల కుటుంబాలకు అందజేస్తామని చెప్పి మోసం చేసిన విషయాన్ని రేవంత్‌రెడ్డికి వారు గుర్తు చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలనలో నిర్వాసితులకు న్యాయం చేయాలని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరడంతో సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రస్తుతం మిడ్‌మానేరు నిర్వాసితులకు 4696 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. నిర్వాసితులకు న్యాయం చేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జిఒ విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి పొన్నం ప్రభాకర్, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లా ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మిడ్‌మానేరు నిర్వాసితుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.

# అప్పలు తీర్చుకునేందుకు అడ్డదారులు

### ఆయుధాలతో దొరికిన పాత నేరస్తులు
### పలు కేసులు ఉన్నాయని వెల్లడించిన సిపి





ప్రజాపక్షం/ ఖమ్మం : రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి నష్టపోయిన ఇద్దరు ఒక ముఠాగా ఏర్పడి బెదిరింపులతో సెటిల్‌మెంట్లు చేశారు. ఈ సందర్భంగా పలు కేసులు పలు పోలీస్ స్టేషన్లలో నమోదయ్యాయి. అయినా తమ అప్పులు తీ రాలంటే ఆ యుధాలతో బెదిరించి పెద్ద మొత్తం లో వసూళ్లు చేస్తే తప్ప బయటపడలేమన్న భావనతో ఓ పాత నేరస్తున్ని పట్టుకుని ఇతర ప్రాంతాల నుంచి ఆయుధాలను తెప్పించి ఓ గ్రానైట్ యజమానిని బెదిరించేందుకు వెళ్తూ పోలీసులకు పట్టుబడిన ఘటన ఖమ్మం నగరంలో చోటు చేసుకుంది. ఆదివారం ఖమ్మం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపి సునీల్ దత్ తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం నగరంకు చెందిన మహ్మద్ అఫ్సర్ ఎలక్ట్రానిక్ గూడ్స్ విక్రయాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవాడు. ఇతనికి బయ్యారం మండలం కొత్తపేట గ్రామానికి చెందిన గుండమళ్ల వెంకటేశ్వర్లు (జివి) పరిచయయ్యారు. వీరు తొలుత రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి నష్టపోయిన తర్వాత ల్యాండ్ సెటిల్‌మెంట్లు చేస్తూ బెదిరింపులకు పాల్పడుతుండడంతో మహబూబాబాద్, గార్ల, మరిపేడ, కేసముద్రం పోలీస్ స్టేషన్లలో దోపిడీ కేసులు నమోదయ్యాయి. పోలీసులకు దొరక్కకుండా తప్పించుకుంటున్న అఫ్సర్, జివిలు ఆయుధాలు చూపించి దోపిడీ చేద్దామని ఎండి రియాజ్ అనే వ్యక్తిని సంప్రదించారు. రియాజ్ బీహార్ నుండి మూడు పిస్టల్స్‌లు, నాలుగు మ్యాగ్జిన్‌లు, 17 బుల్లెట్లను తెప్పించి ఆదివారం ముదిగొండ ఏరియాలోని గ్రానైట్ వ్యాపారస్తుల వద్దకు వెళ్లి నక్సలైట్ల పేరుతో బెదిరించి డబ్బులు వసూలు చేసుకోవాలని బయలుదేరారని సిపి సునీల్ దత్ తెలిపారు. పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా వీరిద్దరు పట్టుబడ్డారు. వీరి నుంచి మూడు పిస్టల్స్, నాలుగు మ్యాగ్జిన్లు, 17 బుల్లెట్లు, ఒక హీరో గ్రామర్ మోటర్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సిపి తెలిపారు. వీరిపై పలు సెక్షన్ల క్రింద కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు. ఆయుధాలను సరఫరా చేసిన ఎండి రియాజ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మీడియా సమావేశంలో ఖమ్మం నగర ఏసిపి రమణమూర్తి, త్రీటౌన్ సిఐ రమేష్ పాల్గొన్నారు.

# 20న సిఎం రేవంత్‌రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటన

### వేములవాడ రాజన్న ఆలయ విస్తరణ పనులు, ఎస్‌పి కార్యాలయం ప్రారంభించనున్న ముఖ్యమంత్రి : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ప్రజాపక్షం /రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభానికి ఈనెల 20న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించనున్నట్లు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ కేకే మహేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్ తో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా విప్ శ్రీనివాస్ మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి 20న ఉదయం వేములవాడ ఆలయ అభివృద్ధి విస్తరణ పనులు ప్రారంభించి, అనంతరం గుడి ఆవరణలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో మాట్లాడుతారన్నారు. 2023–24 బడ్జెట్‌లో రాజన్న ఆలయానికి రూ.50కోట్ల నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. గత సిఎం కెసిఆర్ ఏటా రూ.100 కోట్లు ఆలయాఇనికి కేటాయిస్తామని రంగురంగుల బ్రోచర్లతో కాలం గడిపారని, మేము ఎక్కడా చెప్పకున్నా రూ.50కోట్లు కేటాయించామన్నారు. సిఎం చేతుల మీదుగా ఆలయ విస్తరణకు శంఖుస్థాపన చేస్తామన్నారు. నేతన్నల 30సంవత్సరాల చిరకాల కోరిక అయిన యారన్ డిపో, గత ప్రభుత్వం నెంబర్ 2గా ఉన్న యువరాజు కూడా తేలేకపోయాడని విమర్శించారు. యారన్ డిపో ఏర్పాటు చేస్తే కొందరు బిఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారు వేములవాడ బహిరంగ సభ అనంతరం సిఎం జిల్లా కేంద్రంలోని ఎస్‌పి కార్యాలయం ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమాలకు జిల్లా ప్రజానీకం, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

**నేడు వేములవాడలో జిల్లా స్థాయి సమావేశం...** వేములవాడలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించడం జరుగుతుందని దీనికి ముఖ్య అతిథులుగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే లు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ హాజరవుతారని తెలిపారు. 2018లో ముంపు గ్రామాల ప్రజలకు ఆశల పల్లకీలో కెసిఆర్ ఆనాడు డబుల్ బెడ్ రూం కింద రూ.5లక్షలు ఇస్తానని మోసం చేశారని, ఆనాడు ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రులకు పాలాభిషేకం చేశారని, ఏ ఒక్కరికి కూడా పరిహారం ఇవ్వలేదని మండిపడ్డారు. ఆనాడు ముంపు గ్రామాల సమస్యలు పరిష్కారానికి పిసిసి హోదాలో రేవంత్ రెడ్డి, భట్టీ విక్రమార్క, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, మేడిపల్లి సత్యం, అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ తదితరులు ముంపు గ్రామాల్లో సమస్యలపై అనేక పోరాటాలు చేశారన్నారు. ఆనాడు ఇచ్చిన మాట ప్రకారం ముంపు గ్రామాల ప్రజలకు 4696 ఇళ్లకు రూ.230 కోట్లను మంజూరు చేశామన్నారు. సమావేశంలో సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఆకునూరి బాలరాజు, సూరదేవరాజు, మ్యానప్రసాద్, కుడిక్యాల రవి, టోనీ, నేరేళ్ల శ్రీకాంత్‌గౌడ్, గోలి వెంకటరమణ, వెంగళ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# గంగపుత్రులకు అండగా ఉంటా




### రాష్ట్ర ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్

ప్రజపక్షం/వరంగల్ టౌన్ : గంగపుత్రులకు అండగా ఉంటానని రాష్ట్ర ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. హన్మకొండ జిల్లా నయీంనగర్(బెస్త) గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌ను ఆదివారం సన్మానించారు. నయీంనగర్ బెస్త గంగపుత్ర సంఘం అధ్యక్షుడు పెద్దపల్లి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సమావేశానికి గంగపుత్ర సంఘం జిల్లా అధ్యక్షుడు పాక ఓంప్రకాష్, నగర అధ్యక్షుడు తత్తరి లక్ష్మ ణ్, రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ ఫిషరీస్ పద్మ మహిపాల్, ఉపాధ్యక్షుడు పెద్దపల్లి శ్రీనివాసరావు, కోశాధికారి గరిగె నరేంద్రపాల్, ప్రధాన కార్యదర్శి ముద్రగడ రాజేంద్రప్రసాద్, పాక శ్రీనివాస్ రిటైర్డ్ డీఈ ఆరండబీ హాజరయ్యారు. ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర మత్స్యకార సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ మెట్టు సాయికుమార్ మా ట్లాడుతూ.. తాను మీ బిడ్డగా ఇక్కడికి వచ్చానన్నారు. రాష్ట్ర వ్యాప్తంగాగంగపుత్రులకుఏ సమస్య వచ్చినా ముందుంటానని, మన పిల్లలువిద్యతోపాటు రాజకీయాల్లో ముందంజలో ఉండాలన్నారు. త్వరలో నయీంనగర్ గంగపుత్ర సంఘానికి కార్యాల నిర్మాణం కోసం స్థానిక ఎమ్మెల్యేలతో మాట్లాడి స్థలం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.సీఎం రేవంత్‌రెడ్డి ఆశీర్వాదంతో ఛైర్మన్‌గామీ ముందుకు వచ్చానన్నారు. బెస్త యువజన సంఘం అధ్యక్షుడు కూర ప్రణయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ముద్రగడ సుమంత్, కోశాధికారి జీవుల శ్రీధర్, ప్రధాన కార్యదర్శి గబ్బెట వెంకట రాహుల్, బెస్త గం గపుత్ర మహిళా సంఘం అధ్యక్షురాలు మంగిలిపెల్లి స్వప్న, ప్రధాన కార్యదర్శి పెద్దపల్లి స్వర్ణలత, ఉపాధ్యక్షుడు కంటే పద్మ,గరిగే మహాలక్ష్మి ,కన్నఉమేశ్వరి, చంద్రగిరి రాజశ్రీ, కోశాధికారి డోలి సరిత, ప్రధాన కార్యదర్శి పెద్దపల్లి స్వర్ణలత, సహకార కార్యదర్శి రాసగట్ల ప్రీతి పాల్గొన్నారు.

## పాత కక్షల గొడవ.. వ్యక్తి హత్య

ప్రజాపక్షం/మనోహరాబాద్: మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం లోని మేజర్ గ్రామపంచాయతీ కళ్ళకల్ గ్రామంలో పాత కక్షలతో మేస్త్రీల మధ్య శనివారం అర్ధరాత్రి గొడవ జరిగి ఒకరు హత్యకు గురయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గత ఆరు నెలలుగా హైదరాబాద్‌కు చెందిన శ్రీరామ్ పండరి కళ్ళకల్ గ్రామంలో ఇల్లు నిర్మాణం చేస్తున్నారు. అతని వద్ద ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రమోద్ పాశ్వాన్ తండ్రి జగదీష్ పాశ్వాన్, బిట్టు తన భార్యతో కలిసి అదే ఇంట్లో ఉంటూ మేస్త్రీ పని చేస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో బిట్టు మద్యం సేవించి పాత కక్షలు మనసులో పెట్టుకొని డబ్బులు సరిగా ఇవ్వడం లేదంటూ ప్రమోద్ ను బూతు మాటలు తిడుతూ గొడవకు దిగాడు. ఆ ఘర్షణలో బిట్టు కట్టెతో దాడి చేయగా ప్రమోద్ తలకు తీవ్ర రక్త గాయాలయి. అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సూపర్వైజర్ నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రంగా కృష్ణ, ఎస్ఐ సుభాష్ గౌడ్ లు తెలిపారు.

## 'గురుకులాల' కార్యచరణ ఏది?

ప్రజాపక్షం/హైదరాబాద్: గురుకులాల భోజనంలో నాణ్యత లేకుంటే జైలుకు పంపిస్తామని బాలల దినోత్సవం రోజున సిఎం ప్రగల్బాలు పలకడం తప్ప, ఎటువంటి కార్యచరణను చేపట్టలే దని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరుహరీశ్ రావు అన్నారు. చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాను చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

# 19న కాళోజీ కళాక్షేత్రం ప్రారంభం

### కలెక్టర్ ప్రావీణ్య, ఎంఎల్ఎ నాయిని రాజేందర్‌రెడ్డి



ప్రజాపక్షం/హనుమకొండటౌన్: కాళో జీ కళాక్షేత్రం మిగిలిన పనులు మొత్తం రేపటికల్లా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యం, ఎమ్మె ల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం బాలసముద్రంలోని కాళోజి కళాక్షేత్రాన్ని స్థానిక శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తో కలిసి సందర్శించి కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఈ నెల 19న కళాక్షేత్రం ప్రారంభోత్సవం చేస్తున్నారని తెలిపారు. కళాక్షేత్రంలో ఏమైనా చిన్న చిన్న పనులు ఫినిషింగ్, ఎలక్ట్రిసిటీ, ఫౌంటెన్ మొదలైన పనులు రేపటికల్లా పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉండాలని అన్నారు. కలెక్టర్ స్థానిక శాసనసభ్యులు తో కలిసి హాలులోని ఎలక్ట్రిసిటీ, సౌండ్ సిస్టం పరిశీలించారు. ప్రారంభోత్సవం రోజు ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అక్కడ అధికారులకు ప్రారంభోత్సవం సందర్భంగా చేయవలసిన పనులపై సూచనలు చేశారు. అనంతరం పక్కనే ఉన్న హయగ్రీవాచారి మైదానంలో హెలిపాడ్‌ను సందర్శించి అక్కడ ఉన్న అధికారులతో జాగ్రత్తలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జి డబ్ల్యు ఎం సి మేయర్ గుండు సుధారాణి, కూడా చైర్మన్ వెంకటరామిరెడ్డి, జి డబ్ల్యూ ఎం సి కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, కుడా పిఒ అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సుప్తావస్థ ఎక్సైజ్‌శాఖ ఉలకదూ..పలకదూ!

### గల్లీకో బెల్ట్‌షాప్
### శృతిమించుతున్న మద్యం దోపిడీ
### ఎంఆర్‌పి సంగతి ఎక్సైజ్ అధికారులకే ఎరుక





ప్రజాపక్షం/ ఖమ్మం : పిల్లి కళ్లు మూసుకుంటే ఎలుక ఎక్కిరించిందన్న సామెతలా ఎక్సైజ్ శాఖ మౌనం లేదా పరోక్ష సహకారంతో మద్యం వ్యాపారులు మద్యం ప్రియులను అందిన కాడికి దోచుకుంటున్నారు. అధికారికంగా విక్రయించే దాని కంటే బెల్ట్‌షాపుల్లో విక్రయాలు రెండు నుంచి మూడు రేట్లు ఉన్నాయంటే ఆశ్చర్యం కలుగక మానదు. బజార్ల వెంట కూరగాయలు విక్రయించినట్లు మద్యం షాపుల యజమానులు ఊరూరా తిరిగి బెల్ట్ షాపులకు మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. అనుమతి పొందిన మద్యం దుకాణాల్లో కంటే బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయించడానికి మద్యం వ్యాపారులు మొగ్గు చూపుతున్నారు. మద్యం దుకాణాల్లో అయితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎంఆర్‌పికే విక్రయాలు జరపాల్సి వస్తుంది. అదే బెల్ట్ షాపులైతే ఇష్టానుసారంగా మద్యం ప్రియులఅవసరాన్ని బట్టి విక్రయించవచ్చు.గతంలో బెల్ట్ షాపుల ద్వారా కేవలం చీప్ లిక్కర్‌ను మాత్రమే విక్రయించే వారు. ఇప్పుడు అతి ఖరీదైన బ్రాండ్లు సైతం బెల్ట్ షాపుల్లో విక్రయిస్తున్నారు. ఎంఆర్‌పి కంటే బెల్ట్ షాపులకు మద్యం వ్యాపారులు ఐదు నుంచి పది రూపాయలు అదనంగా విక్రయిస్తుండగా బెల్ట్ షాపుల నుంచి ఎంఆర్‌పికంటే రూ.30నుంచి రూ. 40లు అదనంగా వేసి విక్రయాలు సాగిస్తున్నారు. కొన్ని బెల్ట్ షాపులు బార్ అండ్ రెస్టారెంట్లను తలపిస్తున్నాయి. భారీ ఏర్పాట్లు చేసి పెద్ద ఎత్తున సిట్టింగ్‌ల మధ్య మద్యాన్ని విక్రయిస్తున్నా ఎక్సైజ్ అధికారులు ఆవైపు కన్నెత్తి చూడడం లేదు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగాఅసలు ఎక్సైజ్ శాఖ ఉందో లేదో తెలియని పరిస్థితి. మద్యం సిండికేట్ల చేతిలో ఎక్సైజ్ శాఖాధికారులు కీ లుబొమ్మలుగా మారారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఎక్సైజ్ శాఖ మౌనం మద్యం వ్యాపారులకు నోట్ల వర్షం కురిపిస్తుంది. మద్యం దుకాణాల పక్కనే బెల్ట్ షాపులను ఏర్పాటు చేసి ఖరీదైన మద్యాన్ని విక్రయిస్తున్నారు. కొం దరు మద్యం దుకాణ యజమానులు మద్యం దుకాణా ల్లో మద్యం ప్రియులు అడిగిన మద్యం లేదని చెపుతూ బెల్ట్ షాపుల అడ్రస్‌లు చెపుతున్నారని పలువురు మద్యం ప్రియులు ఆరోపిస్తున్నారు. బెల్ట్ షాపులో అదనంగా రూ.50లకు పైగా చెల్లించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు ఖమ్మం నగరం సహా పలు పట్టణాల్లోను పెద్ద మొత్తంలో బెల్ట్‌షాపులు వెలిశాయి. ఎక్సైజ్ శాఖ మద్యం అక్రమ వ్యాపారాన్ని నియంత్రించడంతో పాటు చట్టబద్దంగా మద్యం విక్రయాలు జరిగేవిధంగా చూడాల్సి ఉంది. కానీ మద్యం అమ్మించడం వరకే తమ పని తర్వాతది తమది కాదన్నట్లుగా వ్యవహరిస్తున్నా రు. బెల్ట్‌షాపుల యజమానులకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులు వస్తే ఎక్సైజ్ శాఖలోని కొందరు వారికి సమాచారం ఇచ్చి సరిచేసుకోండి అని చెప్పడంతో పాటు ఆ పరిధిలోని మద్యం దుకాణ యజమానిని సైతం అప్రమత్తం చేస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఎక్సైజ్ శాఖ తీరు చూస్తు ంటే వీలైనంత మేర మద్యం ప్రియులను దోపిడీ చేసి మద్యం వ్యాపారులకు దోచిపెట్టే బాధ్యతల్లో ఉన్నట్లు అనిపిస్తుందని ఓ మద్యం ప్రి యుడు ఆవేదన వ్యక్తం చేశాడంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అవగతమవుతుంది. ఇందుకు సంబంధించి ఉన్నతాధికారులు సైతం ఉమ్మడి ఖమ్మంజిల్లా ఎక్సైజ్ శాఖ గురించి అంతగా పట్టింపులేనట్లుగా తెలుస్తుంది.ఇక అన్నింటికి మించి మీడియాలో మద్యం దుకాణాలపై కానీ, బెల్ట్ షాపుల గురించి కానీ వార్తలు వస్తే ఎక్సైజ్ శాఖలో పనిచేసే వారికి పండుగేనట. మొత్తంగా ఉమ్మడి ఖమ్మంజిల్లా ఎక్సైజ్ శాఖను ప్రక్షాళన చేయకపోతే కాయకష్టం చేసి మద్యం అలవాటును మానుకోలేక సాయంత్రం ఆవైపుకు తొంగి చూసే వారిని దోపిడీ చేసి మద్యం వ్యాపారులకు మరింత మేలు చేకూర్చే అవకాశం ఉంది.

# అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై చర్యలేవి?

### విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థిపై దాష్టీకం ప్రదర్శించి గుండు గీయించిన అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మెడికల్ కళాశాల బాలుర వసతి గృహం ముందు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు మందా సురేష్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు లక్ష్మ ణ్, ఎఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మద్దోజు శ్రావణ్‌కుమార్‌లు మాట్లాడుతూ ములుగు జిల్లాకు చెందిన ఓ విద్యార్థి ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మొదటి సంవత్సరం ఎంబిబిఎస్ చదువుతున్నాడని, కళాశాల హాస్టల్‌లో విద్యార్థి 12న ఓ షాపులో హెయిర్ కటింగ్ చేయించుకుని వచ్చిన క్రమంలో సెకండ్ ఇయర్ విద్యార్థులు బాగా లేదని చెప్పడంతో మరల వెళ్లి ట్రిమ్మింగ్ చేయించుకుని వచ్చాడన్నారు. విద్యార్థి వచ్చేసరికి యాంటీ ర్యాంగింగ్ మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉన్నతాధికారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా విద్యార్థిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ గుండు గీయించాడని వారు తెలిపారు. ప్రభుత్వం ఒకవైపు ఈవ్‌టీ జింగ్, ర్యాగింగ్‌లను అరికట్టాలని ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తుండగా ఇటువంటి ఘటనలు చోటు చేసుకోవడం దారుణమన్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనను నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు శివానాయక్, కౌశిక్, ప్రతాప్‌రాజు, సునీల్, ఎస్ఎఫ్ఐ నాయకులు సాయి, వినోద్, పిడిఎస్‌యు నాయకులు అజయ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.





## కానిస్టేబుళ్ల ఔదార్యం

**ప్రజాపక్షం / మహబూబ్ నగర్ ప్రతినిధి :** మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో ఎన్టీర్ ప్రభుత్వ మమిళా డిగ్రీ కాలేజీలో గ్రూప్ – 3 పరీక్ష రాసెందుకు వచ్చిన ఓ విద్యార్థిని పరీక్ష సమయానికి కొన్ని క్షణాలు మాత్రమే ఉండటంతో పరుగుతు పెడుతూ కేంద్రం సమీపం లో చేరుకొని . శక్తి లేక నీరసంతో కేంద్రానికి పది అడుగుల దూరంలో కింద పడబోతుండగా ఆపన్న హస్తం లా ముఫ్తిలో ఉన్న స్పెషల్ బ్రాంచ్ ఎఎస్ఐ వెంకట్రాములు ఆమెను కిందపడకుండా మెరుపువేగంతో కాపాడారు. మరో వైపు పరీక్ష కేంద్ర గేట్లు మూసివేస్తుడం తో ఆమెను కేంద్రం లో పంపించి మహిళా పోలీస్ లతో మంచినీటిని అందించారు. ఇంకో అభ్యర్థిని కూడా పరీక్ష కేంద్రానికి బదులు ఇంకో పరీక్షా కేంద్రానికి వచ్చి టెన్షన్ పడుతుంటే అది గమనించిన ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ యాదయ్య హెచ్‌సి 1369 సకాలంలో పరీక్షా కేంద్రానికి చేర్చడం జరిగింది. ఒక్క క్షణం ఆలస్యం ఆ అభ్యర్తులు పరీక్ష రాసే అవకాశం కోల్పోయెవారూ. పరీక్షా కేంద్రం లోపలి వెళ్ళిన ఒక నిమిషం తేడాతో అధికారులు గేట్లు మూసివేయడం జరిగింది. 9.30 గంటల తర్వాత వచ్చిన అభ్యర్థులను అధికారులు కేంద్రాల్లోకి అనుమతించలేదు. పోలీస్ లు అంటేనే కాఠిన్యం అంటారు. కాని వారితో కాఠిన్యం మాటున కరుణ దాగి ఉంటుందని ఈ ఘటన కళ్లకు కట్టింది. వీరి ఇరువురి సేవలు ప్రశంసనీయమైనవి. అభ్యర్థుల భవిష్యత్తు కోసం ఇలాంటి సహాయ చర్యలు అత్యంత ముఖ్యమైనవి. స్పెషల్ బ్రాంచ్ ఎఎస్ఐ వెంకట్రాములు, ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ యావయ్య (హెచ్ సి 1396 ) గార్లను ప్రశంసించిన జిల్లా ఎస్పీ డి. జానకి ఐపీఎస్.



## పరీక్ష కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

ప్రజాపక్షం / మహబూబ్ నగర్ ప్రతినిధి ః టీజీపీఎస్సీ గ్రూప్ – 3 పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను అదేశించారు. ఆదివారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రం లోని జయప్రకాష్ నారాయణ్ కాలేజి ఆఫ్ ఇంజినీరింగ్, ఆల్ మదీనా కాలేజీ, పాలమూరు యూనివర్సిటీ ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన గ్రూప్ – 3 పరీక్ష కేంద్రాలను సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. అనంతరం అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్ష సమయంలో ఇఆంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి టువంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతించకూడదని అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే పరీక్ష కేంద్రంలోకి వెళ్లేలా చూడాలన్నారు. మొదటి రోజు ఉదయం జరిగిన గ్రూప్ – 3 పేపర్ – 1 జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్ పరీక్షకు జిల్లాలోని 52 పరీక్ష కేంద్రాల్లో 19465 అభ్యర్థులకు పరీక్షకు 10646 మంది హాజరయ్యారని, 8819 మంది అభ్యర్థిలు గైర్హాజర్ అయ్యారని కలెక్టర్ తెలిపారు.



## వైభవంగా బంగారు మైసమ్మ తల్లి 9వ వార్షికోత్సవం

ప్రజాపక్షం / జడ్చర్ల : జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేటలో డాక్ (ఐబి) బంగ్లా సమీపంలో 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న శ్రీ బంగారు మైసమ్మ దేవాలయంలో ఆదివారం శ్రీ బంగారు మైసమ్మ తల్లి దేవత విగ్రహ ప్రతిష్టాపన 9వ వార్షికోత్సవ వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. బంగారు మైసమ్మ తల్లి దేవత విగ్రహాన్ని ప్రతిష్టించి 9 సంవత్సరాలు పూర్తి కావడంతో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సందర్భంగా వేద పండితులు మొదటగా గణపతి పూజ పుణ్యాహవచనం నిర్వహించి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్షికోత్సవ ప్రత్యేక పూజలలో 9వ వార్డు కౌన్సిలర్ చైతన్య చౌహాన్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు గోనెల నరేందర్, గుండు చంద్రశేఖర్, గణాతే విజయ్ కుమార్, గుండు శ్రీశైలం, బుక్క శివ కుమార్, మిద్దె నాగరాజు, గోనెల నరేష్ రాఘవేణి దంపతులు, బుక్క రమేష్, జయ శ్రీవాత్సవ్, అనన్య, బక్తులు పవన్, తదితరులు పాల్గొన్నారు.



## బాలోత్సవాల గోడపత్రిక విడుదల

**ప్రజాపక్షం/కల్వకుర్తి ః** పట్టణంలోని కురుమిద్దరోడ్డులో ఉన్న రాయల్‌ఫంక్షన్‌హాల్‌లో ఈనెల 19న బాలోత్సవాలజాతర నిర్వహిస్తున్నట్లు బాలోత్సవాల కమిటి కన్వీనర్ చెన్నయ్య తెలిపారు. ఈసందర్భంగా వారోత్సవాల రాష్ట్ర కమిటి కార్యదర్శి సోమయ్య , నాయకులు వీరాంజనేయులు తదితరులతో కలిసి చెన్నయ్య ఆదివారం పట్టణంలోని యుటిఎఫ్ భవనంలో బాలోత్సవాల జాతర గోడపపత్రికలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకతశక్తి, మానవీయ విలువలను పెంపొందించడం కోసం బాలోత్సవాల జాతర నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి బాలలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు ఏపి మల్లయ్య, లక్ష్మణమూర్తి, ఖాదపాష, వెంకటేశ్వర్లు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, చిన్నయ్య, విజయ్‌కుమార్, ఎల్లయ్య, చంద్రశేఖర్, నర్సింహ్మా, ఎల్లయ్యగౌడ్, అంజయ్య, వెంకటయ్య, ప్రజాసంఘాల నాయకులు , కిశోర్ పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే పర్యటన

**ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ ః** కల్వకుర్తి మండలపరిధిలోని మార్చాల గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి హాజరవుతారని కాంగ్రెస్‌పార్టీ నాయకులు తెలిపారు. కల్వకుర్తి మున్సిపాలిటి పరిధిలోని వివిధవార్డులతోపాటు మండలపరిధిలోని మార్చాల గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు అధికారులు హాజరుకావాలని కోరారు.





## పరీక్ష కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్‌పి

**ప్రజాపక్షం / నారాయణపేట ప్రతినిధి :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని గ్రూప్ 3 పరీక్ష కేంద్రాలను ఆదివారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆకస్మికంగా సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. ముందుగా చిట్టెం నర్సిరెడ్డి స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ ఎంత మంది అభ్యర్థులు పరీక్ష రాస్తున్నారని , ఎంత మంది గైర్హాజరు అయ్యారని, ఆ కలాశాల ప్రిన్సిపల్ మెర్సీ వసంతను అడిగి తెలుసుకున్నారు. ఆ కేంద్రంలోని తరగతి గదులను పరిశీలించి అభ్యర్థులకు తాగునీటి వసతి కల్పించారా లేదా అడిగారు. అభ్యర్థుల ఫోన్లు, వాచ్‌లు ఎక్కడ పెడుతున్నారని ప్రశ్నించగా కేంద్రం బయట ప్రత్యేకంగా ఒక కౌంటర్ ఏర్పాటు చేశామని, అక్కడే అభ్యర్థుల వస్తు సామాగ్రిని భద్రపర్చినట్లు సీఎస్ తెలిపారు.

**ఎస్‌పి ఆధ్వర్యంలో ....**

జిల్లా కేంద్రంలోని పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ పరిశీలించారు. పరీక్షా సరళిని, పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నారాయణపేట జిల్లా కేంద్రంలో మొత్తం 19 పరీక్ష కేంద్రాలు స్కూలు, కళాశాలలో ఏర్పాటు చేయడం జరిగింది. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ఎస్పీ తెలిపారు. ఎస్పీతో పాటు డిఎస్సి ఎన్ . లింగయ్య, ఎస్ఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## రోలర్ స్కేటింగ్‌లో బంగారు పతకం సాధించిన ఎస్‌ఎస్ జై



**ప్రజాపక్షం/పెబ్బేరు :** మండల పరిధిలోని గుమ్మడం గ్రామానికి చెందిన గడ్డం సుధాకర్ కుమారుడు ఎస్‌ఎస్‌జె హైదరాబాద్‌లో జరిగిన యూత్ రోలర్ స్కేటింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చి ప్రశంసా పత్రం , బంగారు పతకం సాధించాడు. హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి, ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ పోటీలో రాష్ట్ర స్థాయి బహుమతి, బెస్ట్ పెర్ఫార్మెన్స్ సర్టిఫికెట్ సాధించడంతో గ్రామస్తులు , యువత అభినందించారు.



## కొనసాగుతున్న కుటుంబ సమగ్ర సర్వే

**ప్రజాపక్షం / వీపనగండ్ల :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కుటుంబ సర్వే మండలంలోని 14 గ్రామ పంచాయతీలలో ముమ్మరంగా కొనసాగుతుంది. అన్ని గ్రామ పంచాయతీలలో ప్రతి కుటుంబాల నుంచి వివరాలను సేకరిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు పేర్కొన్నారు. సర్వే వివరాలను తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎన్యుమరేటర్లకు సూచించారు.

## ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీ అరికట్టాలి



**ప్రజాపక్షం / నారాయణపేట ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాలో ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రుల ఫజులు ఆరికట్టాలని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల్లో పూర్తి స్థాయిలో వైద్య సిబ్బందిని నియమించి ప్రభుత్వాసుపత్రులను పూర్తి స్థాయిలో మెరుగుపర్చాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహిస్తూ ప్రగతిశీల యువజన సంఘం ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ ఆసుపత్రుల ఫీజులు అరికట్టాలని, ప్రభుత్వ ఆసుపత్రులను మెరుగుపర్చాలని ఉద్యమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను రిలీజ్ చేస్తూ వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కార్పొరేట్ వైద్యాన్ని పూర్తిగా ప్రభుత్వ స్వాదీనం చేసుకొని ప్రభుత్వ ఆసుపత్రులను మెరుగుపర్చాలని , ఆసుపత్రులను మెరుగుపర్చాలని, ఆసుపత్రుల్లో పూర్తి స్థాయి వైద్య సిబ్బంది నియమించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల యోజన సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు అంబటి అంజి , రాము, శ్రీను, బాలకృష్ణ, మల్లేష్ , మధు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్‌లు పరిశీలన

### ఎస్‌పి డా.జి.జానకి షర్మిల



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్:** మహారాష్ట్ర లో జరగబోవు సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎన్నికల నియమావళిలో బాగంగా ఏర్పాటు చేసిన సారంగాపూర్ మండల రామ్ సింగ్ తండా, సిర్పల్లి ల అంతరాష్ట్ర చెక్‌పోస్ట్‌లను ఆదివారం రోజు ఆకస్మికంగా సందర్శించి చెక్‌పోస్ట్‌లలో సిబ్బంది తనిఖీల విధులను ఎస్‌పి పరిశీలించారు. అందులో భాగంగనే అయా చెక్ పోస్ట్‌లలో ఇప్పటికీ వరకు సీజ్ చేసిన నగదు, లీక్కర్, ఇతర వస్తువుల వివరాలను చెక్‌పోస్ట్ అధికారులు ఎస్‌పికీ వివారించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఎన్నికలలో ప్రజలను ప్రభావితం చేయడానికి డబ్బు, మద్యం ఇతర సామాగ్రి చెరవేయటన్ని చెక్ పోస్టుల ద్వారా వివిశ శాఖల సమన్వయంతో సమర్ధవంతంగా నియంత్రించాలని తెలిపారు. మహారాష్ట్ర నుండి మన రాష్ట్రంలోకి తిరిగే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి తనిఖీలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. వాహనాల తనిఖీల సమయంలో వీడియోగ్రఫీ తీసుకోవాలని అన్నారు. చెక్‌పోస్ట్‌లలో విధులు నిర్వర్తించే సిబ్బందికి అవసరమైన సదుపాయాల గురించి పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఇట్టి కార్యక్రమంలో సారంగాపూర్ ఎస్ఐ శ్రీకాంత్ పోలీస్ సిబ్బంది, చెక్ పోస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వాగు దాటేదెలా..?

మూడుచింతలపల్లి- నాగిశెట్టిపల్లి గ్రామాల మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

బ్రిడ్జ్ నిర్మాణం చేపడుతామని గత ప్రభుత్వ హయాంలో హామీ

రైతులు ఇబ్బందులు పడుతున్నా దృష్టి సారించని అధికారులు



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మండల కేంద్రంలో వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వాగు దాటేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడుచింతలపల్లి నాగిశెట్టిపల్లి గ్రామాల మధ్యన ఉన్న వాగు వర్షాకాలంలో కురిసిన వర్షాలకు నీటితో నిండి వాగు పొర్లుతుంది. గ్రామానికి సంబంధించిన రైతుల పొలాలు వాగు అవతల ఉండటంతో వ్యవసాయ పనుల నిమిత్తమై రైతులు ప్రమాదకరంగా మారిన వాగును దాటాల్సి వస్తోంది. వర్షాకాలం వచ్చిందంటే చాలు ఇరు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. రైతులు పండించిన పంటలను ఇంటికి చేరవేయడానికి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. రవాణ సౌకర్యం లేకపోవడంతో రైతులు ఇతర గ్రామాల మీదుగా ప్రయాణం చేయాల్సి రావడంతో దూర భారం ఎదుర్కోవాల్సి వస్తుందని వాపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో మూడుచింతలపల్లి మండలాన్ని అప్పటి ముఖ్యమంత్రి దత్తత తీసుకుని పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో ఈ వాగు నిర్మాణం చేపట్టాలని రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అలాగే మూడుచింతలపల్లి నాగిశెట్టిపల్లి గ్రామాల మధ్య రోడ్డును వేసిన అధికారులు బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టలేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి ఈ వాగులో బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

**– గత ప్రభుత్వ తప్పిదంతో ఇబ్బందులు : వంగ వెంకటరమణరెడ్డి**



గత ప్రభుత్వ హయాంలో రైతులకిచ్చిన హామీ ప్రకారం బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టలేదు. లక్ష్మాపూర్ చెరువు ద్వారా వచ్చే నీటితో ఈ వాగు ఎల్లప్పుడు పారుతోంది. ఈ వాగు దాటడానికి ప్రయత్నించి రైతులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సుమారుగా 100 ఎకరాల వరకు ఈ వాగు అవతల వైపు రైతులు వ్యవసాయం చేస్తున్నారు. పండించిన ధాన్యాన్ని తీసుకరావడానికి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**–ప్రతిపాదనలకే పరిమితమైన బ్రిడ్జ్ : యాదిరెడ్డి**



బ్రిడ్జ్ నిర్మాణం చేపడుతామని అధికారంలోకి వచ్చిన నాయకులు, అధికారులు చెప్తున్నారే తప్ప ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. గత ప్రభుత్వ హయాంలో సుమారుగా రూ. 2.50 కోట్లు బ్రిడ్జ్ నిర్మాణానికి ప్రతిపాదనలు పెట్టగా అవి మంజూరు కాలేదు. దీంతో బ్రిడ్జ్ నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లు ఉంది. ఇటీవల ఆర్అండ్‌బి అధికారులు వచ్చి సర్వే చేసుకుని వెళ్లారు. ఇప్పటికి మూడు సార్లు సర్వే చేసి వదిలిపెట్టారు. ఇప్పటికైన ప్రస్తుత ప్రభుత్వం స్పందించి బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టాలని కోరుతున్నాం.



## రైస్ మిల్, కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

**ప్రజాపక్షం / పెబ్బేరు :** సిఎంఆర్ బియ్యం ఎఫ్‌సిఐకి సకాలంలో అందించేందుకు చర్యలుతీసుకోవాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు ఆదేశించారు. ఆదివారం అదనపు కలెక్టర్ రెవెన్యూ పెబ్బేరు మండలంలో పర్యటించి సప్తగిరి రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎఫ్‌సిఐకి ఇవ్వాల్సిన ధాన్యం త్వరగా ఇచ్చేందుకు మిల్లింగ్ సమయం పెంచాలని సూచించారు. అదేవిధంగా కొనుగోలు కేంద్రాల నుండి లారీల్లో వస్తున్న వరి త్వరగా దించుకునే విధంగా చర్యలు తీసుకోవలని సూచించారు. అంతకు ముందు రంగాపూర్ పి. ఏసిఎస్ వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని, సేకరించిన ధాన్యం ఎప్పటికప్పుడు తరలించడమే కాకుండా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ లో నమోదు చేయించాలని ఆదేశించారు.

## 19న కల్వరాలలో మెగా హెల్త్ క్యాంప్

**ప్రజాపక్షం / వీపనగండ్ల :** ఆమన్‌గల్ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని కల్వరాల గ్రామంలో ఈ నెల 19న మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించడం జరుగుతుందని నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నర్సింహ తెలిపారు. జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో నిర్వహించే మెగా హెల్త్ క్యాంపులో కార్పొరేట్ ఆసుపత్రిల్లో చెందిన అన్ని విభాగాల ప్రముఖ వైద్యులు పాల్గొంటారని, గ్రామంలోని ప్రజలు ఆరోగ్య సమస్యలపైన డాక్టర్లను సంప్రదించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.



## బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో కొత్తకోట విద్యార్థి ప్రతిభ

**ప్రజాపక్షం / కొత్తకోట :** కొత్తకోట పట్టణంలోని బాలికల ఉన్నతం పాఠశాల ఆవరణలో గాడ్స్ ఆన్ వారియర్స్ చోటు ఖాన్ కరాటే డు ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన బెల్టు గ్రేడింగ్ టెస్ట్ 40 మంది విద్యార్థి విద్యార్థులు పాల్గొని చక్కటి ప్రతిభ కనబర్చి బెల్ట్ సర్టిఫికెట్ సాధించారు. వీరిలో బేసిక్ మూమెంట్స్ కతస్ కిక్ లిఫ్టింగ్ మరెన్నో విభాగాలలో చక్కటి ప్రతిభ కనబర్చి బెల్ట్ సర్టిఫికెట్ సాధించారని క్లబ్ ఫౌండర్ అబ్దుల్ నబీ తెలిపారు. వీరిలో ఎల్లో బెల్ట్ 10 ఆరెంజ్ 8, బ్లూ 8, మెరూన్ 8, సీనియర్ బ్రౌన్ 6, విద్యార్థులు బెల్ట్ సర్టిఫికెట్ సాధించారు. ఈ విద్యార్థులను మన కరాటే అకాడమీ పేరెంట్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొని విద్యార్థులకు బెల్ట్ సర్టిఫికెట్ అందించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సీనియర్ కరాటే మాస్టర్స్ ఎస్. వెంకటేష్ , రఫీ ఖాద్రి, ఇఫ్తార్ , జాఫర్ , సాధిక్ , జి. హరీష్ యాదవ్ , ఇంతియాజ్ , మంజునాథ్ , పరమేష్ , ఎండి. రియాజ్ , శివరాజ్ , కురుమూర్తి యాదవ్ , అంజి, సుమ, అనిత రెడ్డి, మహమ్మద్ జహంగీర్ , విద్యార్థులను అభినందించడం జరిగింది.

## ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలి

**ప్రజాపక్షం / పాన్‌గల్ :** వరి కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సిపిఎం నాయకులు భీమయ్య, సూర్యవంశం రాము, కమలాకర్‌లు ఉన్నారు. మండల ఎకరాలలో వరి పంటను రైతాంగం సాగు చేశారని, గత నెల రోజుల నుండి ఈ ఖరీఫ్ సీజన్‌లో వేసిన వరి పంట చేతికి రావడంతో ప్రభుత్వ వరి కొనుగోలు కేంద్రాల వద్దకు రైతులు తీసుకువచ్చిన కూడా కొనుగోలు చేయడం లేదన్నారు. తేమా, తాలు తదితర కారణాలతో నెలలు గడుస్తున్నా వరి పంటను కొనుగోలు చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న రకం వరికి క్వింటాలుకు రూ. 500 బోనాస్ ఇస్తామని చెప్పారని, బోనస్‌తో సన్న రకం వరిని కొనుగోలు చేస్తున్నారో .. లేదో తెలియక , గందరగోళంలో రైతులు ఉన్నారన్నారు. చిన్న చిన్న కారణాలతో ధాన్యాన్ని కొనుగోలలు చేయకుండా ఆలస్యం చేస్తున్న కారణంగా ఆకాల వర్షాలు పడి ధాన్యం తడుస్తుందని అన్నారు. అన్ని రకాల వరికి రూ.500 బోనస్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వడ్ల కల్లాల దగ్గర మంచినీటి సౌకర్యం కలిగించాలని , టెంటు సౌకర్యం కల్పించాలని కోరారు. రేపటి నుంచి వరి ధాన్యాన్ని కొనుగోలు చేయకుంటే రైతులను ఐక్యం చేసి కల్లాల దగ్గరనే ఉద్యమం చేస్తామని తెలిపారు.



## సగర సంఘం నూతన కమిటీలు

ప్రజాపక్షం/కల్వకుర్తి ః కల్వకుర్తి సగరసంఘం నూతన కమిటీలను ఆదివారం జిల్లా కమిటి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బల్మూరు సుధాకర్, కోశాధికారి పడకంటి రాజు హాజరయ్యారు. టౌన్ అధ్యక్షులుగా రొట్టెరాజుసాగర్, ప్రధాన కార్యదర్శిగా కల్లెపల్లి జంగయ్యసాగర్, కోశాధికారిగా వావిలాల యాదగిరిసాగర్, అదేవిధంగా మండల అధ్యక్షులుగా వావిలాల సురేష్‌సాగర్, ప్రధాన కార్యదర్శిగా వావిలాల హరికృష్ణసాగర్, కోశాధికారి వావిలాలశ్రీనివాసులుసాగర్, అదేవిధంగాయువజన సంఘం అధ్యక్షులుగా బూర్గులభరత్, గౌరవ అధ్యక్షులుగా వేములతిరుపతయ్య, ప్రధాన కార్యదర్శిగా నరేష్, ఉపాధ్యక్షులుగా వావిలాలశ్రీకాంత్, కోశాధికారిగా మెరుగు అరుణ్‌కుమార్, సహాయ కార్యదర్శిగా నర్లకంటిశ్రీధర్, కమిటి సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సగరులు అన్నిరంగాల్లో రాణించాలని , సగర సంఘం బలోపేతంకోసం నిరంతరం కృషిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వావిలాల భీమయ్య, చేగూరి దుర్గయ్య, చిరంజీవి, వెంకటరమణ, దామోదర్, చేగూరి సత్యం, నరేష్, భాస్కర్,సుధాకర్, జంగయ్య, వెంకటేష్, తిరుపతయ్య, సగర సంఘం నాయకులు పాల్గొన్నారు.

## గ్రూప్ 3కి 2353 మంది హాజరు

**ప్రజాపక్షం / నారాయణపేట ప్రతినిధి :** రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహిస్తున్న గ్రూప్ 3 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. ఆదివారం ఉదయం జరిగిన మొదటి సెషన్ పరీక్షకు జిల్లాలో మొత్తం 4024 మంది అభ్యర్థులకు 2353 మంది హాజరు కాగా , 1671 మంది గైర్హాజరు అయ్యారని, అదేవిధంగా మధ్యాహ్నం సెషన్ పరీక్షకు 2354 మంది అభ్యర్థులు హాజరవ్వగా 1670 మంది గైర్హాజరు అయ్యారని ఆమె తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగే గ్రూప్ 3 పరీక్షకు సంబంధించి కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా కట్టుదిట్టమైన ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు నిబంధనలను తు.చ తప్పకుండా పాటిస్తూ , నిర్ణీత సమయానికి ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఉదయం 9.30 గంటలకు పరీక్షా కేంద్రాల గేట్లు మూసివేయడం జరుగుతుందని , అనంతరం లోనికి అనుమతించడం జరగదని కలెక్టర్ స్పష్టం చేశారు.



## అంజన్ రావు సేవలు మరువలేనివి

**ప్రజాపక్షం/మర్రిగూడ :** పొనుగోటి అంజన్ రావు సమాజానికి చేసిన సేవలు మరువలేనివని సీపీఐ జాతీయ సమితి సభ్యులు,మాజీ శాసనసభ్యులు పల్లా వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం మర్రిగూడకు చెందిన దివంగత పొనుగోటి అంజన్ రావు దశదినకర్మ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం,రాష్ట్ర సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు,మాజీ వైస్ ఎంపీపీ పొనుగోటి విజయ రామారావు,సీపీఐ మండల కార్యదర్శి ఈదుల బిక్షంరెడ్డి,సహాయ కార్యదర్శి బూడిద సురేష్,కార్యవర్గ సభ్యులు బుర్ర శేఖర్,చెల్లం పాండురంగారావు,ఆకుల రఘుమయ్య,ఎరుకల యాదయ్య,నిరంజన్,కోన్ రెడ్డి గిరి,కళ్లెం యాదిరెడ్డి పాల్గొన్నారు.

## 7798 మంది అభ్యర్థులు హాజరు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలో, మండలంలో 28 పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తున్న గ్రూప్3 పరీక్షలు సీసీ కెమెరాలు,పోలీసు బందోబస్తు నడుమ ప్రశాంతంగా జరుగుతున్నాయని సబ్ కలెక్టర్ నారాయణ్అమిత్ తెలిపారు. ఆదివారం పట్టణంలో జరుగుతున్న గ్రూప్ 3 పరీక్షా కేంద్రాలను ఆయన పరిశీలించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆయన అధికారులకు సూచించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. కాగా మిర్యాలగూడలో నిర్వహించిన 28 పరీక్షా కేంద్రాల్లో 7798 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా పేపర్1 పరీక్షకు 3044, పేపర్2కు 2930 మంది అభ్యర్థులు పరీక్షలు రాసినట్లు తెలిపారు. నేడు పేపర్3 పరీక్ష జరగనుందని తెలిపారు. టీజీపీఎస్‌సీ నిబంధనలను పాటిస్తూ అధికారులు అభ్యర్థులు తనిఖీ చేసి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్-3 పరీక్ష కేంద్రాల పరిశీలన



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** గ్రూప్3 రాత పరీక్షకు సంబంధించిన జిల్లా కేంద్రంలోని పరీక్ష కేంద్రాలను సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షా సరళిని, పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తును పరిశీలించారు. జిల్లా కేంద్రంలో గల ఎస్‌వి ఇంజనీరింగ్ కళాశాల, ఎస్వీ డిగ్రీ కళాశాలల 60 ఫీట్ రోడ్డు నందు జరిగే పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిబ్బంది బాధ్యతయుతంగా పనిచేసి పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని, పరీక్ష రాసే అభ్యర్థులకు , పరీక్ష సామాగ్రికి, సిబ్బందికి బరోసా భద్రత కల్పించాలని కోరారు. పరీక్షా పత్రాలు స్ట్రాంగ్ రూంకు చేరే వరకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఆయన వెంట డిఎస్‌పి రవి, సిబ్బంది ఉన్నారు.

## స్వాములకు అన్నదానం హర్షణీయం



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** అయ్యప్ప మాలదారులకు అన్నదానం చేయడం హర్షనీయమని సూర్యాపేట డిఎస్పీ రవి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని శ్రీధర్మశాస్త్ర అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో శబరి నగర్ లో అన్ని మాలధారణ స్వాములకు నిర్వహిస్తున్నా స్వాములకు ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ఆయన ప్రారంభించారు. నలబై రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించే అయ్యప్ప స్వాములకు శ్రీధర్మశాస్త్ర అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. పవిత్రమైన కార్తీకమాసంలో ఎటువంటి దానం చేసిన పుణ్యం లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్మశాస్త్ర సేవా సమితి సభ్యులు యర్రంశెట్టి ఉపేందర్, వెంపటి పురుషోత్తం, అంతటి విజయ్, తోట నర్సయ్య, రాచకొండ కృష్ణ, గొట్టిపర్తి శ్రీకాంత్, దేసోజు నాని తదితరులు పాల్గొన్నారు.

## తొండ గ్రామాన్ని తిరుమలగిరి మున్సిపాలిటీలో విలీనం చేయొద్దు

**ప్రజాపక్షం/తిరుమలగిరి:** మండలంలోని తొండ గ్రామాన్ని తిరుమలగిరి మున్సిపాలిటిలో వీలినం చేయొద్దని అఖిలపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. ఆదివారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సమావేశమై అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న గ్రామాన్ని మున్సిపాలిటిలో చేర్చి అభివృద్ధిని అడ్డుకోవద్దని, గ్రామంలో వేలమంది ప్రజలు ఉపాధి కూలీ మీదనే ఆదారపడి జీవిస్తున్నారని, మున్సిపాలిటీలో విలీనం చేసినట్లయితే ఉపాధిపోయి వస్తులుండే ప్రమాదం ఉందని, ఈ నిర్ణయాన్ని అధికారులు వెంటనే ఉపసంహరించుకోని, గ్రామ ప్రజల జీవనోపాధికి కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభ్యుదయ కమిటి అధ్యక్షులు నీరటిప్రవీణ్‌కుమార్, కృష్ణ, బిక్షపతి, సాయికుమార్, రమేష్, ఎల్లంల నాగరాజు, వేల్పుల వెంకన్న, గొలుసుల మల్లయ్య, నీరటి నవీన్, రవి, ఉమేష్, సైదులు, శ్రీకాంత్, వెంకటయ్య, సోమయ్య పాల్గొన్నారు.



# కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

### కేంద్రాలలో కల్పిస్తున్న సౌకర్యాలపై రైతులతో ముచ్చటించిన మంత్రి



**ప్రజాపక్షం/సూర్యాపేటరూరల్:** రైతులు దళారులను నమ్మకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యంను విక్రయించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లాలోని ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. వానాకాలం దిగుబడుల గురించి ఆరా తీయగా రైతులు సరాసరి ఎకరానికి 40 బస్తాల కంటే ఎక్కువగానే వచ్చిందని అన్నారు. బహిరంగ మార్కెట్లో తమకు మంచి ఆకర్షణీయమైన ధర వస్తుందని, మిల్లర్లు కూడా తేమశాతం పట్టించుకోకుండా కల్లాల మీదనే కొనుగోలు చేస్తున్నారని, ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర, బోనస్ కంటే కూడా అధిక ధర రావడంతో కొంతమంది రైతులు వాళ్లకు అమ్ముతున్నట్లు రైతులు తెలిపారు. దానికి మంత్రి స్పందిస్తూ ప్రభుత్వం సేకరించే ధాన్యం గొదాముల్లో నిల్వ ఉంచి అవసరాలకు తగ్గట్లుగా బియ్యం పట్టిస్తారని, అప్పటిదాక రంగు మారకుండా ఉండటానికి తేమ శాతం నిబంధన ఉన్నదని, మన ప్రజలకే నాణ్యమైన బియ్యాన్ని చౌకధరల దుకాణాల ద్వారా అందించడానికి నిబంధన పాటిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రైతులతో కొద్దిసేపు మాట్లాడారు. వరి కొయ్యలను తగులబెట్టవద్దని, వాటిని తగులబెడితే వచ్చే అనర్థాలపై రైతులకు వివరించారు. నిన్న ఒక్కరోజే 1,48,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 1,64,191 టన్నుల పత్తిని రైతుల వద్ద నుండి కొనుగోలు చేసినట్లు తెలిపారు. మన రాష్ట్రం సన్నాలను ఇప్పుడు పొరుగు రాష్ట్రాల వారు వచ్చి మంచి ధర ఇచ్చి కొనుగోలు చేయడం మన ప్రభుత్వం ప్రకటించిన బోనస్ కారణమని తెలిపారు. జిల్లాలకు నియమించిన ప్రత్యేక అధికారులు, జిల్లా కలెక్టర్లు నిత్యం ధాన్యం, పత్తి కొనుగోళ్లను పర్యవేక్షించాల్సిందిగా సంబంధిత అధికారులను కోరారు. సోయా సేకరణలో తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో ఉందని, మద్దతు ధర డబ్బులు సివిల్ సప్లై సంస్థ రైతులకు నేరుగా చెల్లిస్తుందని, బోనస్ చెల్లింపులు మాత్రం ఆర్థికశాఖ ద్వారా జమ చేయబడతాయని తెలిపారు. వ్యవసాయశాఖ అధికారుల నివేదిక ప్రకారం నవంబర్ 3వ వారం నాటికి 48శాతం మేర (సుమారు 33 లక్షల ఎకరాలు) వరికోతలు పూర్తి అయ్యాయని, నవంబర్ చివరి నాటికి ఇంకొక 21 శాతం పూర్తవుతాయని తెలిపారు. దానికి తగ్గట్లుగా మార్కెటింగ్, గిడ్డంగుల శాఖ అధికారులు, రవాణాశాఖ అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని ఆదేశించినట్లు తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.



## భారత రాజ్యాంగ రజతోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరణ

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** మహాత్మా జ్యోతిరావు పూలే అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ మరియు ప్రజా పర్యవేక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీ నుండి జనవరి 26 వరకు యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న భారత రాజ్యాంగ రజతోత్సవాల పోస్టర్‌ని ఆలేరు శాసనసభ్యులు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య వారి నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం యొక్క విశిష్టతను ప్రజలందరికీ చేరేవిధంగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్న సంస్థలకు అభినందనలు తెలిపారు. అదేవిధంగా 60 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాలలో నేను కూడా భాగస్వామ్యం అవుతానని తెలిపారు. ఈనెల 26వ తేదీన యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం అంబేద్కర్ విగ్రహం నుండి ప్రారంభమయ్యే 60 రోజుల కార్యక్రమాలలో ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పూలే అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ ప్రతినిధులు సురుపంగ శివలింగం, బానోత్ భాస్కర్ నాయక్, ఇటుకల దేవేందర్ మాదిగ, కేసరి యూత్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు రేగు బాలనర్సయ్య పాల్గొన్నారు.

## సిపిఐ బలోపేతానికి కృషి చేయాలి



**ప్రజాపక్షం/చింతపల్లి :** భారత కమ్యూనిస్టునార్టీ (సిపిఐ) బలోపేతానికి కృషి చేయాలని మునుగోడు మాజీ ఎంఎల్‌ఏ ఉజ్జిణి యాదగిరి రావు. మండల పరిధిలోని నసర్లపల్లి గ్రామంలో ఆదివారం జరిగిన సిపిఐ గ్రామ శాఖ సమావేశంలో యాదగిరిరావు పాల్గొని ప్రసంగించారు. సిపిఐ వంద సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కల్గి, డిసెంబర్ నెలలో శత జయంతి ఉత్సవాలను జరుపుకోనుందన్నారు. నాటి నుండి నేటి వరకు ఎన్నో ప్రజా ఉద్యమాలను నిర్వహించి ప్రజలకు వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇళ్లను కూలిస్తే సహించేది లేదన్నారు. ఆడబిడ్డల వివాహానికి తులం బంగారం ఇచ్చి, పెంచిన పింఛన్‌లను అందించాలన్నారు. యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్టులు పూర్తి చేసి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పోలె వెంకటయ్య, సహాయ కార్యదర్శి ఉజ్జిణి అంజల్‌రావు, మల్లం నరసింహ, కొనిదల వెంటయ్య, సన్నాయిల యాదయ్య, సోమయ్య, వెంకటయ్య, బుచ్చయ్య, చంద్రమ్మ, ఎల్లమ్మ, లక్ష్మమ్మ, మారయ్య, భిక్షమయ్య, యాదయ్య, బుచ్చయ్య, హజ్మత్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షకు 15459 మంది హాజరు

### పలు పరీక్ష కేంద్రాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి తనిఖీ

### దరఖాస్తు చేసుకున్నా పరీక్ష రాయడానికి ఆసక్తి చూపని అభ్యర్థులు



**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి:** జిల్లాలో మొదటి రోజు నిర్వహించిన గ్రూప్ 3 పరీక్షలు ప్రశాంతంగా ముగిసింది. ఉద్యోగాల కోసం ముందస్తుగా దక్కర్ చేసుకున్న అభ్యర్థులు ఇటీవల గురుకుల, పోలీస్,డిఎస్‌సితోపాటు ఇతర శాఖలలో ఉద్యోగులుగా చేరడం వల్ల గ్రూప్ 3 పరీక్షలకు అభ్యర్థులు అంతగా ఆసక్తి చూపలేదు. దీనితో పలు పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థి లేక పోవడంతో బోసిపోయాయి.ఉదయం గ్రూప్ 3 పరీక్షలు ప్రారంభమైన వెంటనే నల్లగొండ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పలు పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తనిఖీ చేశారు. ముందుగా సెయింట్ ఆల్ఫాన్సెస్ పాఠశాలలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాన్ని సందర్శించి అక్కడ పరీక్షకు హాజరైన, గైర్హాజరైన అభ్యర్థుల వివరాలను పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ డి .రాంబాబుతో అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం రెండవ పేపరు పరీక్ష ముగిసిన అనంతరం మొదటి రోజు వివరాలను జిల్లా కలెక్టర్ తెలియజేస్తూ నల్గొండ, మిర్యాలగూడ పట్టణంలోని మొత్తం 88 పరీక్ష కేంద్రాలలో 28353 మంది అభ్యర్థులను కేటాయించగా, ఉదయం పరీక్షకు 15459 మంది అభ్యర్థులు హాజరయ్యారని, 12894 మంది అభ్యర్థులు గైరు హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం పరీక్షకు 28,353 మందికి గాను 15392 మంది హాజరుకాగా, 12961 మంది గైర్హాజరయ్యారని ఆమె వెల్లడించారు మొత్తానికి మొదటి రోజు గ్రూప్3 పరీక్ష లు జిల్లాలో రెండు పట్టణాలలో సవ్యంగా జరిగాయని, ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోలేదని ఆమె తెలిపారు.



## పరీక్షా కేంద్రాల పరిశీలన



**ప్రజాపక్షం / గద్వాల :** ఆదివారం గ్రూప్ 3 పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావుతో కలసి జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ పరిశీలించారు. ఆయన జిల్లా కేంద్రాలో సుమారు 25 సెంటర్లలో 8570 మంది అభ్యర్థులు పరీక్ష రాస్తున్నారు. ముందుగా ఆయన ప్రాక్టిసింగ్ హైస్కూల్, ఎస్.వి.ఎం.కళాశాల కేంద్రాలను సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును అభ్యర్థుల హాజరు, పరీక్ష కేంద్ర సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పోలీసు బందోబస్తును పరిశీలించి పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగరాదని ఎప్పటి కప్పుడు నిఘా ఉంచాలని వారికి సూచించారు.

# సిపిఐ పేదల పక్షాన పోరాటం

### సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/మర్రిగూడ :** సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా పేద ప్రజల పక్షాన అలుపెరుగని పోరాటం చేసి 100 సంవత్సరాలలో అడుగుపెడుతున్న సందర్భంగా నల్లగొండలో డిసెంబర్ 30న జరగబోయే శతాబ్ది ఉత్సవాలకు అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. ఆదివారం మర్రిగూడలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ డిసెంబర్ 30న జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా మండలము నుండి రెండు వేల మందిని మహాసభకు తరలించాలని అట్లాగే 2025 పార్టీ సభ్యత్వము పునరుద్ధరించి కొత్త సభ్యులను పార్టీలోకి ఆహ్వానించాలని కోరారు. ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన హామీలు రుణ మాఫీ, రైతు భరోసా, రైతు బీమా, మహిళలకు 2500, తక్షణమే అమలు చేయాలన్నారు.పత్తి పండించిన రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని సిసిఐ పెట్టిన ఆంక్షలతో దళారులకు అమ్ముకోవాల్సి వస్తుందని ప్రజా ప్రభుత్వములో రైతులు మోసపోకుండా చూసుకునే బాధ్యత పాలకులదే అని అన్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి ఈదుల బిక్షం రెడ్డి, సహాయ కార్యదర్శి బూడిద సురేష్. బిసి సంఘం అధ్యక్షులు కైలాస్, సిపిఐ నాయకులు ఎరుకలి నిరంజన్, బుర్ర శేఖర్, కొండ్రెడ్డి గిరి, ఎరుకలి యాదయ్య, అంజయ్య, వేముల సత్తయ్య ఉన్నారు.

# అభివృద్ధి పనులలో నాణ్యత లేకపోతే సహించం

### ఎంఎల్‌ఎ రాజగోపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/చండూరు:** చండూరు మున్సిపాలిటీలోని ప్రధాన రహదారి నల్లగొండ రోడ్డులోని భారత్ పెట్రోల్ బంక్ నుంచి డాన్‌బోస్కో జూనియర్ కళాశాల వరకు 1.9 కిలో మీటర్ల వరకు జరుగుతున్న డబుల్ రోడ్డు సిసి నిర్మాణ పనులను ఆదివారం మునుగోడు ఎంఎల్‌ఎ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్థానిక కాంగ్రేస్ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఆదివారం చండూరు మండలంలోని చామలపల్లి ,చొప్పరివారిగూడెం గ్రామాలతో పాటు చండూరు మున్సిపాలిటీలో పర్యటించిన రాజగోపాల్‌రెడ్డి అభివృద్ధి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు కొన్నికొన్ని అభివృద్ధి పనులను ప్రారంభించారు. చామలపల్లి గ్రామంలో శ్రీశ్రీశ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం కళాతోరణ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. చొప్పరివారిగూడెంలో 20లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం చండూరు మున్సిపాలిటీ కేంద్రంలో స్త్రీ శక్తి లోన్ ద్వారా నిర్మించుకున్న ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్‌ను మహిళ సంఘాల సభ్యులతో కలిసి రాజగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం రోడ్డు నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రేస్ పార్టీ చండూరు మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం, కాంగ్రేస్ పార్టీ చండూరు మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ తోకల చంద్రకళవెంకన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ దోటి సుజాతవెంకటేశ్ యాదవ్ , డాక్టర్ కోడి శ్రీనివాసులు ,మున్సిపల్ కమిషనర్ మున్వర్ ఆలీ , డీఈ , ఏఈ నాగదుర్గ ప్రసాద్ పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ కార్మికులకు రూ. 26వేలు ఇవ్వాలి

### ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి




**ప్రజాపక్షం/చందంపేట:** చందంపేట మండలం గ్రామపంచాయతీ కార్మికులకు నెలకు రూ. 26వేలు వేతనం ఇవ్వాలని అన్నారు. గ్రామపంచాయతీ కార్మికుల ఉమ్మడి చందంపేట మండల ప్రథమ మహాసభ రమావత్ బోజ్జనాయక్ అధ్యక్షతన జరిగింది. మహాసభలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి పాల్గొని మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కార్మికులకు కనీస వేతనం నెలకు రూ. 26వేలు ఇవ్వాలని, గ్రామపంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి వారిని రెగ్యులర్ చేయాలని, పిఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని, కార్మికులకు అవసరమైన పరికరాలు అందించి, సంవత్సరానికి రెండు జతల యూనిఫాంలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కనీస వేతనం అందిస్తామని హామీ ఇచ్చారని వాటిని వెంటనే అమలు చేయాలని కోరారు. కార్మిక చట్టాలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను 4 కోడ్లుగా కుందించి కార్మికుల పొట్ట కోట్టే విధంగా తయారు చేశారని అన్నారు. కార్పొరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా చట్టాలు తయారు చేసి రెడ్ కార్పొట్ పరుస్తున్నారని ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటికరణ ఆపాలని, పెరుగుతున్న ధరలను అరికట్టాలని, ఆసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ చట్టాలు ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం సిపిఐ మండల కార్యదర్శి ఉప్పునూతల వెంకటయ్య మాట్లాడుతూ జిపి కార్మికుల కు కనీస వేతనాలు అమలు చేయాలని జిపి కార్మికులకు నెలకు జీతాలు ఇవ్వాలని కార్మికుల పనిభారం తగ్గించి కార్మికులపై వేధింపు లను ఆపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సిల్ సభ్యులు వెంకట్రాములు, వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ నాయకులు వెంగళయ్య, మల్లయ్య, కార్మికులు దేవరాజ్, ఇద్దయ్య, జయరాములు, నరేష్, అంజమ్మ, లక్ష్మణ్, శ్రీను, బాలు, ముత్యాలు, జంగయ్య పాల్గొన్నారు.

## కుక్క దాడిలో గొర్రెలు మృతి



**ప్రజాపక్షం / మానవపాడు :** జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం జిల్లాపురం గ్రామానికి చెందిన గొల్ల రాముడు తండ్రి రోషన్న వీరికి 1500 గొర్రెల మంద జీవాలు కలవు ఈ మందను ఓ రైతు పొలములో ఆపడం జరిగింది. వీటికి చిన్న సన్న పిల్లలు 300 వందలు కలవు ఈ పిల్లలను చుట్టు కంచె వేసి పిల్లలను భద్రపరచడం జరిగింది. విటి మేత కొసం కాపారి మరో పొలం దగ్గరకు వెళ్లడంతో ఎటు నుండి వచ్చిందో తెలియదు కాని రెండు కుక్కలు మాత్రం బయట నుండి లోపల ఉన్న గొర్రె పిల్లలను చంపి తినటానికి ప్రయత్నాలు చేశాయి అవకాశం లేకపోవడంతో ఒక కుక్క కంచె లోపలికి ఏలా వెళ్లిందో కానీ మొదటగా చిక్కిన గొర్రె పిల్ల సంగతిని వదిలి పెట్టింది. మిగతా వాటిని గొంతు కొరికి రక్తం త్రాగి మాంసాన్ని తినకుండ వదిలి పెట్టడం జరిగింది. పొలం గెట్టు వెంబడి ఓ రైతు పత్తి కట్టె కాల్చుకుంటు వస్తున్న రైతుకు గొర్రె పిల్లల అరుపు ఎక్కువగా వినపడటంతో కంచె దగ్గరకు వచ్చిన రైతు కంచె లోపల ఉన్న కుక్క ,గొర్రె పిల్లల గొంతు కోరుతున్న దృశ్యాన్ని చూసిన రైతు వెంటనే కాపరికి తెలపడంతో హడావుడిగా వచ్చిన గొర్రెల కాపరి, రైతు తమ చేతిలో ఉన్న కర్రతో కుక్కను కొట్టి చంపడం జరిగింది. ఒకే గొర్రె పిల్ల చనిపోయింది అనుకుంటే ఏకంగా 30 పిల్లలు చనిపోవడం జరిగింది. ఒక్కొక్క పిల్ల 5 వేల చొప్పున లెక్కిస్తే 1 లక్ష 50 వేల రూపాయలు నష్టపోవడం జరిగింది. కావున ప్రభుత్వ పరంగా మమ్ములను ఆదుకోవాలని జిల్లా కలెక్టర్‌ని కోరుతున్నాము.

## 7365 మంది గైర్హాజరు : కలెక్టర్



**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహిస్తున్న గ్రూప్3 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ తెలిపారు. ఆదివారం ఉదయం జరిగిన మొదటి సెషన్ పరీక్షకు జిల్లాలో మొత్తం 16,543 మంది అభ్యర్థులకు గానూ 9178 మంది హాజరు కాగా 7365 మంది గైర్హాజరు అయ్యారని వివరించారు. ఉదయం సెషన్‌లో 55.48 శాతం హాజరు నమోదయిందని అన్నారు. అదే విధంగా మధ్యాహ్నం సెషన్ పరీక్షకు 9173 మంది అభ్యర్థులు హాజరవ్వగా 7370 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. సెకండ్ సెషన్‌లో 55.45 శాతం హాజరు నమోదయ్యిందని వివరించారు. సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగే గ్రూప్3 పరీక్షకు సంబంధించి కూడా ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు తావులేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. అభ్యర్థుల నిబంధనలను తూచ తప్పకుండా పాటిస్తూ నిర్ణిత సమయానికి ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఉదయం 9.30 గంటలకు పరీక్షా కేంద్రాల గేట్లు మూసివేయడం జరుగుతుందని, అనంతరం లోనికి అనుమతించడం జరగదని కలెక్టర్ స్పష్టం చేశారు.

## నేడు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు రాష్ట్ర బిసి కమిషన్ రాక

**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్ :** రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ అధ్యక్షులు నిరంజన్ అధ్యక్షతన వెనుకబడిన తరగతుల కమిషన్ సభ్యులు ఈ నెల 18 న నల్లగొండ జిల్లాకు వస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. వెనుకబడిన తరగతుల సామాజిక మరియు విద్యాపరమైన స్థితిగతులను ,అలాగే ఆర్థిక ప్రయోజనాలను , వారి వృత్తులు,వృత్తులలో ఉన్న ఇబ్బందులను అధ్యయనం చేసేందుకు, అలాగే వారి ఇబ్బందులను తొలగించి వారి పరిస్థితి మెరుగుపరిచేందుకు ప్రభుత్వానికి సిఫారసు చేసే విషయమై బి సి కమిషన్ జిల్లాకు వస్తున్నట్లు ఆమె తెలిపారు. 18 న ఉదయం 10 గంటలనుండి సాయంత్రం 4 గంటల వరకు నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నల్లగొండ ,యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలకు చెందిన బిసి వర్గాల ప్రజలతో వ్యక్తిగతంగా, నమోదిత , నమోదు కానీ అసోసియేషన్‌ల నుండి దరఖాస్తులను, వాదనలకు మద్దతుగా వారి వద్ద ఉన్న మెటీరియల్ ,వెరిఫికేషన్ అఫిడవిట్ తో పాటు ,6 సెట్లు తెలుగు లేదా ఇంగ్లీషులో బీసీ కమిషన్‌కు అందజేయవచ్చని ఆమె తెలిపారు.

## అభివృద్ధి పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/యాచారం :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తుందని నల్లవెల్లి ఎంపిటిసి ఈదుల కంటి లక్ష్మి పతిగౌడ్ అన్నారు. అదివారం మండల పరిధిలోని నల్లవెల్లి గ్రామంలో దాదాపు 25 లక్షల రూపాయల వ్యయంతో అండర్ డ్రైయినేజి పనులను ప్రారంభించారు. ఈ సంధర్భంగా అయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మంజూరు చేసిన నిధులతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. గ్రామంలోని ఈదమ్మ గుడి పాకాల మడుగు వరకు అండర్ డ్రయినేజీ పనులు చేయిస్తామన్నారు. అభివృద్ధి పనులకు గ్రామస్తులు సహకరించాలని అయన కోరారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు..

# మహానగరి

## నిధులు మంజూరు చేయాలని మంత్రికి వినతి



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** వనస్థలిపురం డివిజన్ అభివృద్ధికి నిధులు మం జూరు చేయాలని జిల్లా ఇన్‌చార్జీ మంత్రి శ్రీధర్‌బాబును ఆదివారం వారి నివాసంలో వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధి దిశగా ఉంటుందని మంత్రిని కోరగా సంబంధిత అధికారులతో మాట్లాడి నిధులు మంజూరు అయ్యే విధంగా సహకరిస్తామని మంత్రి తెలిపారన్నారు.

## కాలనీ సమస్యలు పరిష్కారం చేయాలని కార్పొరేటర్‌కు విజ్ఞప్తి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్లోని శ్రీశ్రీనివాస కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కారం చేయాలని స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి నివాసంలో ఆదివారం కాలనీ సంక్షేమ సంఘం వాసులు కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం వాసులు మాట్లాడుతూ కాలనీలో త్రీఫేస్ కరెంట్, డ్రైనేజీ లైన్, పార్క్ అభివృద్ధి, వీధి దీపాలు, రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కాలనీ వాసులు వినతి పత్రంలో కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న ప్రతి సమస్యను పరిశీలించి వాటి పరిష్కారం దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కాలనీ కార్యవర్గంను కార్పొరేటర్ అభినందించారు. కార్యక్రమంలో కాలనీ నూతన అధ్యక్షులు చిత్రాంజన్, ఉపాధ్యక్షులు సైదులు, అరుణ, ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, కోశాధికారి రామ్ నాయక్, జాయింట్ సెక్రెటరీ చరణ్ సింగ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శేఖర్, లీగల్ అడ్వైజర్ అమర్నాథ్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాల అభివృద్ధికి ఆర్థిక చేయూత అభినందనీయం



**ప్రజాపక్షం/షాబాద్ :** రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని సాయిరెడ్డి గూడ గ్రామంలో అతిపూరాతనమైన శ్రీ మల్లిఖార్జున స్వామి దేవాలయ అభివృద్ధి కోసం ఆ గ్రామానికి చెందిన ఆలయ కమిటీ సభ్యుడు దోనూరి గోపాల్ కురుమ దేవాలయ నిర్మాణానికి రూ. 31 లక్షల రూపాయ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుడు దోనూరి గోపాల్ మాట్లాడుతూ గ్రామంలో దేవాలయ అభివృద్ధికి సహాయం చేస్తున్న భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికంగా ఆలోచిస్తే గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. మారుమూల గ్రామమైన దేవాలయ అభివృద్ధి కోసం గ్రామస్తులందరూ సహకారం చేయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ నిర్వహకులు మాజీ సర్పంచ్ అనంత్ రెడ్డి, లక్ష్మయ్య, సులోచన శేఖర్ రెడ్డి, బోకుల లింగం, దోనూరి విఠలయ్య, ముత్యాల్ రెడ్డి, హనుమంతు, గోపాల్ రెడ్డి, శశిధర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

## సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉచిత వైద్యశిబిరం



**ప్రజాపక్షం/నార్సింగి :** సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం మణికొండ మున్సిపల్ సర్దార్ పటేల్ పార్క్ వాక్ మేట్స్ సహాయ సహకారాలతో ఆదివారం డాక్టర్ ఆర్కే క్లినిక్స్ వారి సమక్షంలో నిర్వహించారు. మణికొండ మున్సిపల్ వైస్‌చైర్మన్ నరేందర్ రెడ్డి, కౌన్సిలర్ వందల నగేష్ వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఈ శిబిరాన్ని ఉపయోగించుకొని ఆరోగ్యపరమైన సమస్యలను పరిష్కరించుకోవచ్చని సూచించారు. సీనియర్ వైద్యులు డాక్టర్ కడియాల శ్రీరాములు, డాక్టర్ సజ్జ సోమశేఖర్, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ నివేదిత, డాక్టర్ సిఆర్ నాగార్జున, వైద్యనిపుణుల ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించడం జరిగింది అని తెలియజేశారు .ఈ కార్యక్రమంలో తిప్పరాజు ,రమేష్ బాబు ,ప్రధాన కార్యదర్శి, అధ్యక్ష, ఉపాధ్యక్ష, సహాయ కార్యదర్శి, కోశాధికారి కార్యవర్గ సభ్యులు మరియు సర్దార్ పటేల్ పార్క్ వాక్ మేట్స్ ప్రజలు పాల్గొన్నారు.

## అక్రమాలపై నిగ్గు తేల్చాలి

### మల్కిజ్‌గూడ గ్రామ బుక్ కీపర్‌పై విచారణ చేపట్టాలి..

### గ్రామస్తుల డిమాండ్

### నేడు మహిళ సంఘాలతో సమావేశం

**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని మల్కిజ్‌గూడ గ్రామంలోని బుక్ కిఫర్ రాణి చేసిన అక్రమాలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేసి ఆమె చేసిన అక్రమాలపై నిగ్గు తేల్చాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. గ్రామంలో గత నెల క్రితం ఓ గ్రూపులో అక్రమాలు జరిగాయని గ్రామస్తులు ఐకెపి అధికారులకు, ఎంపిడిఒ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మరో ఇందిరా గ్రూపులో దాదాపు 16 లక్షల రూపాయల అక్రమాలు జరిగాయని ఆ గ్రూపు సభ్యులు యాచారం బ్యాంక్ మేనేజర్‌రు. యాచారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పొదుపు సంఘాల్లో చదువు రాని వారిని ఎంచుకొని పక్కా ప్లాన్ ప్రకారం అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు తెలిసింది. బ్యాంక్ అధికారులకు కల్ల బొల్లి మాటలు చెప్పి తనకు సన్నిహితంగా ఉన్న మహిళలల అకౌంట్‌లోకి బుక్ కిఫర్ రాణి తెలివిగా ట్రాన్స్ ఫర్ చేసింది. ఈ విషయం తెలిసి గ్రామంలోని అన్ని సంఘాలకు చెందిన మహిళలు నివ్వెర పోతున్నారు. గ్రామంలోని అన్ని గ్రూపుల్లో జరిగిన లెక్కల వివరాలు బయట పెట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. సోమవారం గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసి అన్ని గ్రూపులకు సంబంధించిన వివరాలు వివరిస్తామని బ్యాంక్ మేనేజర్ తెలిపారు. ఈ విషయాన్ని యాచారం పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

## ప్రణాళికాబద్ధంగా ఆరు గ్యారంటీల అమలు



షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని సాయిరాజా ఫంక్షన్ హాల్‌లో ప్రజా పాలన ప్రజా విజయోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. రాష్ట్రంలోనే మొదటి సారిగా షాద్‌నగర్‌లో నిర్వహించారు. ఆరు గ్యారంటీ పథకాలపై పాటలు, నృత్యాల రూపంలో కళాకారులు ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి పాలన అందిస్తున్న ఘనచరిత్ర కాంగ్రెస్ పార్టీదేనన్నారు. శాసన సభ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తుంటే బిఆర్ఎస్ నేతలు అడ్డుకోవడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. రాష్ట్రానికి చివరగా ఉన్న కొడంగల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తుంటే మాజీ మంత్రి కెటిఆర్ రెచ్చగొట్టే విధంగా వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకుల పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు కాస్మోటిక్ చార్జీలు, మెస్ చార్జీలను పెంచడంతోపాటు తగిన సౌకర్యాలు కల్పిస్తున్నామని వివరించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేస్తేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాల చర్యలు తీసుకుంటుందని వివరించారు. అధికారం పోయిందనే అక్కసుతోనే బిఆర్ఎస్ నేతలు అనేక అడ్డంకులు సృష్టిస్తున్నారని, ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని, ఈ కుయుక్తులను తెలంగాణ ప్రజలు పూర్తి స్థాయిలో గ్రహిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ఆర్‌డిఒ సరిత, రాష్ట్ర నాట్యమండలి సాంస్కృతిక శాఖ చైర్‌పర్సన్ అలేఖ్య, మాజీ జడ్పిటిసిలు పి.వెంకట్‌రాంరెడ్డి, విశాల శ్రావణ్‌రెడ్డి, మండల పార్టీల అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, వీరేష్, చెన్నయ్య, హరినాథ్‌రెడ్డి, జంగ నర్సింలు, కృష్ణారెడ్డి, రాజు, మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వం, బాబర్‌ఖాన్, మహ్మద్ ఇబ్రహీం, రఘునాయక్, లింగారెడ్డిగూడ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్–3 పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** రంగారెడ్డి జిల్లా తట్టి అన్నారంలోని శ్రేయాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల, హయత్ నగర్‌లోని వర్డ్ అండ్ డీడ్ ఎడ్యుకేషనల్ అకాడమీలో ఏర్పాటు చేసిన గ్రూప్–3 పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదివారం పరిశీలించారు. పరీక్ష నిర్వహణ గదులను, పరీక్ష కేంద్రాలో సౌకర్యాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రూప్–3 పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశామన్నారు. అభ్యర్థులకు పరీక్ష కేంద్రాలలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేసినట్టు వివరించారు. పరీక్షా సమయంలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జిల్లాలో మొదటి రోజు గ్రూప్–3 ప్రశాంతంగా జరిగినట్టు కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. కలెక్టర్ వెంట ఇబ్రహీంపట్నం ఆర్‌డిఒ అనంత్‌రెడ్డి, తహసీల్దార్ సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.



## సమగ్ర సర్వేకు సహకారం

### కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మహ్మద్ ఇబ్రహీం



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ సర్వేకు ప్రజలు సహకరించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మహ్మద్ ఇబ్రహీం కోరారు. ఆదివారం షాద్‌నగర్ మున్సిపాలిటి పరిధిలోని ఫరూఖ్‌నగర్‌లో నిర్వహిస్తున్న కుల గణన సర్వేలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మహ్మద్ ఇబ్రహీం ఇంట్లో మున్సిపల్ అధికారులు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మహ్మద్ ఇబ్రహీం మాట్లాడుతూ సమగ్ర సర్వేలో కాంగ్రెస్ నేతలు పాల్గొని ముందుకు తీసుకువెళ్ళాలని సూచించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ భారత్ జోడో పాదయాత్రలోనే కుల గణనపై స్పష్టమైన ప్రకటన చేశారని, అందుకే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సర్వేలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నేతలు ముందుండి సర్వే నిర్వహిస్తున్న సిబ్బందికి సహకరించి విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. సామాజిక న్యాయం కోసం రాహుల్‌గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని వివరించారు. ఇప్పటికే షాద్‌నగర్ మున్సిపాలిటీలో సగం వరకు సర్వే పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

## మధ్యాహ్న భోజనానికి పూర్తిస్థాయి నిధులు

### ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్ చౌహాన్ డిమాండ్



**ప్రజాపక్షం/కొందుర్గు:** మధ్యాహ్న భోజనానికి పూర్తి స్థాయిలో నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎం.పవన్ చౌహాన్ డిమాండ్ చేశారు. ఆదివారం కొందుర్గు మండల కేంద్రంలో హాస్టల్ విద్యార్థులతో కలిసి ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా పవన్‌చౌహాన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అంధించేందుకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం సకాలంలో నిధులు కేటాయించకపోవడంతో విద్యార్థులు భోజనానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. మధ్యాహ్న భోజనానికి నిధులు కేటాయించడంతోపాటు వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అంధించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. మెస్, డైట్ చార్జీలు పెంచుతున్నామని ప్రభుత్వం ప్రకటనలు చేశారే తప్పా ఆచరణలో అమలు చేయలేదని, ఈవిషయంలో ప్రభుత్వం ఆలోచించాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మెస్ చార్జీలతోపాటు కాస్మోటిక్ చార్జీలను చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు.

## మూసీ బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

### మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** మూసీ బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని మల్కాజ్‌గిరి ఎంపి ఈటెల రాజేందర్ అన్నారు. ఆదివారం చైతన్యపురి డివిజన్ పరిధిలోని ఫణిగిరి కాలనీలో బస్తీ నిద్ర చేసిన అనంతరం తెల్లవారుజామున మల్కాజ్గిరి ఎంపి ఈటల రాజేందర్ న్యూ మారుతి నగర్, సత్యా నగర్, పణిగిరి కాలనీలలో పాదయాత్ర చేస్తూ కాలనీల వాసులకు ధైర్యంగా ఉండాలని మీకు మేము అండగా ఉన్నామని చెప్పడంతో కాలనీల వాసులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఫణిగిరి కాలనీ సాయిబాబా గుడి ఆవరణలో మూసి బాధితులతో కలిసి ఎంపీ ఈటల విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అస్తవ్యస్తంగా ఉందని అన్నారు.మూసీ నది సుందరీకరణ పేరుతో పేద ప్రజలను గత మూడు నెలల నుండి నిద్రాహారాలు లేకుండా చేసిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసి పరివాహక ప్రాంత ప్రజలకు ఇల్లు కోల్పోతున్న బాధితులకు నష్టపరిహారం చెల్లించి వారికి హామీ ఇస్తే అభివృద్ధికి అందరం సహకరిస్తామని వారు తెలిపారు.ఈ కాలనీలో ప్రజలు ఇండ్లు కోల్పోతామని ఆవేదనతో బ్రేన్ స్టాక్, హార్ట్ స్ట్రోక్,పలు రోగాల బారిన పడి ఉన్నారని, అలాంటి బాధిత కుటుంబాలకు బిజెపి పార్టీ అండగా ఉంటుందని వారు తెలిపారు. హైదరాబాదులో మూసి పరివాహకం అంటే చైతన్యపురి డివిజన్ ఒకటే కాంగ్రెస్ ప్రభుత్వానికి కనిపిస్తుందని ఇక్కడ గజం ధర లక్షలు పలకడం వలన ప్రభుత్వం వీటిపై ఎక్కువగా దృష్టి సారించినట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రులకు ఏమాత్రం అవగాహన లేదని తల ఒక మాట మాట్లాడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఈ బాధిత కుటుంబాలకు తగిన నష్టపరిహారం చెల్లించి మూసి పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు రంగా నరసింహా గుప్త, బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, నాయకోటి పవన్ కుమార్, కొప్పుల నరసింహ రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వివరాలు అందించేందుకు కృషి

### తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి



**ప్రజాపక్షం/కేశంపేట:** సమగ్ర సర్వేకు అధికారులకు ప్రజలు వివరాలు అందించాలని కృషి చేయాలని కేశంపేట మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కేశంపేట మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో విశాల శ్రావణ్‌రెడ్డి ఇంటిలో నిర్వహించిన సమగ కుటుంబ సర్వేలో పూర్తి వివరాలను అందజేశారు. ఈ సందర్భంగా విశాల మాట్లాడుతూ ప్రజల జీవన విధానాలను పూర్తి స్థాయిలో తెలుసుకునేందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సర్వేను మొదలు పెట్టారని వివరించారు. ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వేలో కాంగ్రెస్ నేతలు పాల్గొని ముందుకు తీసుకువెళ్ళాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నేతలు ముందుండి సర్వే నిర్వహిస్తున్న సిబ్బందికి సహకరించి విజయవంతం చేసేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. సామాజిక న్యాయం కోసం రాహుగాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని వివరించారు. ఇప్పటికే కేశంపేట మండలంలో సగం వరకు సర్వే పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

## అధికారులు మారినా.. ఆగని అక్రమ నిర్మాణాలు

### శేరిలింగంపల్లి సర్కిల్‌లో అక్రమ నిర్మాణాల జోరు

### నిద్రమత్తులో అధికారులు

**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో అధికారులు మారినా అక్రమ నిర్మాణాలు ఆగడం లేదు. శేరిలింగంపల్లి సర్కిల్ 20 పరిధిలోని కొండాపూర్ డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీ, రాజరాజేశ్వరి కాలనీలతో పాటు గచ్చిబౌలి డివిజన్ పరిధీలోని ఖాజాగూడ, నానక్‌రామ్ గూడ, ప్రశాంతి హిల్స్, శేరిలింగంపల్లి డివిజన్‌లోని శ్రీరామ్‌నగర్, గచ్చిబౌలి, మసీద్ బండ ప్రాంతాలలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఈ అక్రమ నిర్మాణాలపై ఎన్ని ఫిర్యాదులు వచ్చిన అధికారులు కన్నేత్తి చూడడం లేదని నిద్ర మత్తులో ఉన్న జిహెచ్ఎంసి అధికారులపై సర్కిల్ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మారడంతో కొత్తగా వచ్చిన అధికారులు శేరిలింగంపల్లి జోన్‌కు వచ్చే అదాయానికి గండి పడకుండా చూడకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిహెచ్ఎంసి ఆదాయాన్ని సమకూర్చుకునే ఏన్నో అవకాశాలు ఉన్నా అధికారులకు ఉన్న ఆశతో అక్రమ నిర్మాణాలకు ఊతం పలుకుతూ తమ జేబులు నింపుకుంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైన అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుని జిహెచ్ఎంసి ఆదాయనికి గండి పడకుండా చూస్తూ శేరిలింగంపల్లి అభివృద్ధికి కృషి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. సక్రమ మార్గంలో వెళ్ళే ప్రజలను, పేద వారు ఓ చిన్న ఇల్లు కట్టుకుంటే వారిని ఎన్నో ఇబ్బందులు పెట్టే అధికారులు అక్రమ మార్గంలో నిర్మాణాదారులకు ఎర్ర తివాచీ వేసి స్వాగతం పలుకుతున్నారన్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాఘవేంద్రకాలనీ, రాజరాజేశ్వరి కాలనీలలో అనుమతుల కంటే ఎక్కువ అంతస్థుల అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. అక్రమ నిర్మాణాలపై జిహెచ్ఎంసి జోనల్ స్థాయి అధికారుల నుంచి కింది స్థాయి అధికారుల వరకు మామ్ముళ్ళు అందడంతో ఈ అక్రమ నిర్మాణాల వైపు కన్నెత్తి చూడడం లేదన్నారు. ఇప్పటికైన అక్రమ నిర్మాణాలపైన, జోనల్ కమీషనర్, డిప్యూటీ కమీషనర్లు కఠిన చర్యలు తీసుకొవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.








## వివాహానికి సేవా నిరతి అందజేత



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** సామాజిక సేవా దృక్పథంతో మల్కాజిగిరి నియోజకవర్గం వినాయకనగర్ డివిజన్‌లోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పిట్టల నాగరాజు పేదరికంతో కుమార్తె వివాహం చేస్తున్న ఓ కుటుంబానికి ఆర్థిక సాయంగా మంగళసూత్రం, కాలి మెట్టెలను అందిం చారు. కాప్రా డివిజన్ సాయిబాబా నగర్‌లో నివసించే కుటుంబ సభ్యులను వారి ఇంటికి వెళ్లి అందించారు.

# మహానగరి

## నేడు విద్యుత్‌కు అంతరాయం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట సబ్‌స్టేషన్ పరిధిలోని దేవరయాంజాల్, తూంకుంట ఫీడర్‌కు సంబంధించి నేడు(సోమవారం) విద్యుత్ అంతారాయం ఉంటుందని ఎఇ రాఘవేందర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శామీర్‌పేట గ్రామంతో పాటు మోడి బిల్డర్స్, పారిజాత హోమ్స్, మైసిటీ, ఒఆర్ఆర్ రోడ్డు టోల్‌గేట్, సెలబ్రిటి రిసార్ట్స్ మేయిన్ గేట్, మహిళా డిగ్రీ కళాశాలకు విద్యుత్ సరఫరా ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అంతరాయం ఉంటుందని తెలిపారు. చెట్ల కొమ్మల నరికివేస్తున్న క్రమంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని ఆ ప్రకటనలో ఎఇ కోరారు.

## వక్ఫ్ బోర్డు భూముల రిజిస్ట్రేషన్లు నిలిపేయాలంటూ ర్యాలీ



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** వక్ఫ్ బోర్డు భూముల రిజిస్ట్రేషన్లను నిలిపి వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయాన్నివ్యతిరేకిస్తూ మౌలాలి డివిజన్ పరిధిలోని పలు కాలనీల నివాసితులు ఆందోళన బాట పట్టారు. సుధానగర్ కాలనీ, న్యూ వెంకటేశ్వరకాలనీ, ద్వారకామయి కాలనీ ఫేస్2 కాలనీవాసులు 'పేదల భూములపై వక్ఫ్ బోర్డు పెత్తనాన్ని వ్యతిరేకిస్తూ రిజిస్ట్రేషన్లు అమలు చేయాలంటూ' రాసిన బ్యానర్లతో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. తామంతా కాయకష్టం, చిరుద్యోగాలతో పైసా పైసా కూడబెట్టుకొని చేసుకొన్న తమ ఇళ్లపై ఆంక్షలు సరైనవి కాదన్నారు.

**భయం వద్దు, అండగా ఉంటా : మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి**

వక్ఫ్ బోర్డు రిజిస్ట్రేషన్లను నిలిపి వేస్తూ తీసుకొన్న నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి డిమాండ్ చేశారు. ఆందోళన బాట పట్టిన స్థానికులకు మద్దతుగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ విషయంలో ఎవరూ భయపడాల్సిన పని లేదని, తాను పూర్తి స్థాయిలో మద్దతుగా ఉంటానన్నారు. అవసరమైతే ప్రజల పక్షాన తాను అన్ని ఖర్చులను స్వయంగా భరించి సుప్రీంకోర్టును సైతం ఆశ్రయించి పోరాటం చేస్తానంటూ హామీ ఇచ్చారు. మూడు దశాబ్దాల క్రితం ఏర్పాటైన కాలనీలకు ప్రభుత్వపరంగా అన్ని వసతులు కల్పించి హఠాత్తుగా వారి హక్కులుగా ఉండే రిజిస్ట్రేషన్లను నిలిపివేయటం అర్థరహితమన్నారు.

## సర్దార్ పటేల్ నగర్ ప్రాంతంలో రైల్వే స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన



**ప్రజాపక్షం /మల్కాజిగిరి :** మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని సర్దార్ పటేల్ నగర్ ప్రాంతంలో రైల్వే స్టేషన్ నిర్మాణానికి అవసరమైన స్థలం కోసం స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ రైల్వే అధికారులు ఏడిఈ ఎన్.శ్రీధర్,రామకృష్ణ, సుబ్బారావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సర్దార్ పటేల్ నగర్ వద్ద నిర్మించనున్న రైల్వే స్టేషన్‌కు హైదరాబాద్, సికింద్రాబాద్ రైల్వే డివిజన్‌లకు అనుకూలంగా ఉంటుందని, ఇక్కడికి రాకపోకలు చేసే వారికి అనుకూలమైన రహదార్లు, పార్కింగ్ స్థలాలకు అవసరమైన స్థలాలు ఉన్నాయని, దీనికి సంబంధించిన ప్రతిపాదనలు పూర్తి చేసి వీలైనంత త్వరగా పనులు చేపట్టాలని కోరారు. ఆనంద్‌బాగ్ ఆర్‌యుబిని సైతం పరిశీలించిన ఇక్కడ మరో రైల్వే స్టేషన్ నిర్మాణాన్ని పరిశీలించాలని కోరారు.

## శుభకార్యాలకు హాజరైన ఎంఎల్ఎ



**ప్రజాపక్షం/తాండూరు :** తాండూరు నియోజకవర్గంలో జరిగిన పలు శుభ కార్యక్రమాలకు స్థానిక ఎంఎల్ఎ బుయ్యాని మనోహర్‌రెడ్డి హజరైనారు. ఆదివారం జరిగిన పలు వివాహాది శుభకార్యాలకు హజరైన ఎంఎల్ఎ వధు వరులను ఆశీర్వదించారు. తాండూరు పట్టణంలోని ఆర్యవైశ్య,ఎఆర్ గార్డన్ తదిత పంక్షన్ హలలో జరిగిన వివాహాధి కార్యక్రమాలకు ఎంఎల్ఎ పాల్గొన్నారు. వారి వెంట తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి, మాజీ జెడ్‌పిటిసి ధారాసింగ్ నాయక్, నాయకులు మహిపాల్‌రెడ్డి, పట్లోల నర్సిములు, మల్లేశం, జీతెందర్‌రెడ్డి, లొంక నర్సిములు, డివై నర్సిములు, ఉత్తమ్‌చంద్ తదితరులు ఉన్నారు.

## భక్తి శ్రద్ధలతో గణపతిని ఆరాధిస్తే కార్యసిద్ధి

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** భక్తి శ్రద్ధలతో గణపతి దేవున్ని ఆరాధిస్తే కార్యసిద్ధి తథ్యమని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కెపి వివేకానందలు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లిలోని దేవీ హోమ్స్‌లో నూతనంగా నిర్మించిన కార్యసిద్ధి గణపతి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ రాజు, ఎమ్మెల్యే కెపి వివేక్‌లు విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎలాంటి పనులు చేయాలన్నా ముందు కార్యసిద్ధి గణపతిని పూజించాలని అన్నారు. ఆ గణపతి కృపా కటాక్షలతో ప్రజలంతా సుభిక్షంగా జీవించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ దన్‌రాజ్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ ఎన్ఎంసి అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, నాయకులు రవికాంత్, రాజ్ కుమార్, కృష్ణారావు పాల్గొన్నారు.

**ఐక్యతను చాటడానికి వనభోజనాలు దోహదం: ఎమ్మెల్యే కెపి**

ఐక్యతను చాటడానికి వనభోజనాలు దోహదపడతాయని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేక్ అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్ కమాన్ వద్ద కాపు కార్తిక వనభోజన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే కెపి వివేక్ విచ్చేసి మా ట్లాడుతూ వనభోజనాలు కుల బాంధవులలో ఐక్యతను, సామాజిక స్పృహ ను పెంపొందిస్తాయన్నారు. ప్రతిఒక్కరు కలిసి కట్టుగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ దన్‌రాజ్ యాదవ్, బిఆర్ఎస్ ఎన్ఎంసి అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, కార్పొరేటర్‌లు, నాయకులు పాల్గొన్నారు.



## గ్రూప్-3 అభ్యర్థులకు పరీక్షా కేంద్రాలోకి
# అరగంట ముందువరకే అనుమతి





### పర్యవేక్షించిన జిల్లా ఉన్నతాధికారులు

**ప్రజాపక్షం/ మేడ్చల్ ప్రతినిధి :** తెలంగాణా పబ్లిక్ సర్వీసెస్ కమిషన్ రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న గ్రూప్3 పరీక్షలు మొదటి రోజైన ఆదివారం మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా జరిగాయి. 1365 పోస్టులకు గాను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న రాత పరీక్షలకు గాను మేడ్చల్ జిల్లాలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసారు. పోలీసు విభాగం ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసారు. అటు పరీక్షలు జరుగుతున్న తీరును జిల్లా కలెక్టర్ గౌతం, అదనపు కమిషనర్ విజయేందర్‌రెడ్డి, రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబులు వేర్వేరు పరీక్షా కేంద్రాల్లో పరిశీలించి అవసరమైన సూచనలిచ్చారు. ఎప్పటి లాగే పరీక్షా సమయాని కంటె అర గంట ముందు వరకే అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించి ఆ తర్వాత వచ్చిన వారిని అనుమతించకపోవటంతో పలు సెంటర్ల నుండి ఆలస్యం కారణంగా వచ్చిన వారు రోదిస్తూ వెనుతిరిగారు. ఒక్క నిమిషం ఆలస్యం నిబంధనను అధికారులు ఖచ్చితంగా పాటించటంతో ఉరుకులు పరుగులతో వచ్చిన వారు పలు సెంటర్ల వద్ద బతిమిలాడటం కనిపించింది. తొలి రోజైన ఆదివారం ఉదయం 10 గంటలకు, మ



ధ్యాహ్నం 3 గంటలకు పేపర్1, పేపర్2 పరీక్షలు జరుగగా సోమవారం ఉదయం పేపర్3 జరుగనుంది. కూకట్‌పల్లిలోని డిగ్రీ ప్రభుత్వ కళాశాల, అవినాష్ డిగ్రీ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో జిల్లా కలెక్టర్ గౌతం, ఆల్వాల్ లోని ఆదర్శ్ జూనియర్ కళాశాల, చైతన్య కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, రామంతాపూర్‌లోని ఐటిఐ కళాశాల, మెగా కళాశాల, ఒమెగా డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు, ఎస్ఓటి డిసిపి నరసింహా రెడ్డి, ట్రాఫిక్ విభాగ డిసిపి మనోహర్‌లు పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలు, తనిఖీ చేస్తున్న తీరు తదితర విషయాలను అడిగి తెల్సుకొని అవసరమైన సూచనలిచ్చారు.

## ప్రజాసేవయే పరమావధిగా ఆసుపత్రి సేవలు అందించాలి



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** ప్రజాసేవయే పరమావధిగా ఆసుపత్రి సేవలను అందించాలని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన తక్ష్ డెంటల్ హబ్ ఆసుపత్రిని ఎమ్మెల్సీ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ అత్యాధునిక పరికరాలతో ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని, లాభాపేక్ష లేకుండా ఆసుపత్రిని నడుపుతూ ఆసుపత్రి దినదినాభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ దన్‌రాజ్ యాదవ్, కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు, ఆసుపత్రి నిర్వాహకులు సుమరోహిత్ పాల్గొన్నారు.

## పార్టీలకు అతీతంగా అభివృద్ధి



**ప్రజాపక్షం/నాగారం :** పార్టీలకు ఆతీతంగా మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తానని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి తెలిపారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు ప్రభాకర్ కాలనీలో రూ.12 లక్షలతో సిసి రోడ్డు,డ్రైనేజీ పనులు,శ్రీనివాస్ నగర్ కాలనీలో 6 లక్షల రూపాయలతో డ్రైనేజీ పనులకు స్థానిక కౌన్సిలర్ అన్నంరాజు లావణ్య శ్రీనివాస్‌తో కలసి చైర్మన్ శంకుస్థాపన చేశారు.మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేసి మున్సిపాలిటీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు అన్నంరాజు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/నాగారం :** రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఎస్ఐ హరిందర్ తెలిపిన వివరాల ప్రకారం కుషాయిగూడ సోనియా గాంధీ నగర్‌కు చెందిన డేవిడ్(44) చక్రీపురం నుండి సూరానా చౌరస్తా వైపు నడుచుకుంటు వెళ్తుండగా మైనర్ బాలుడు తన డియో ద్విచక్ర వాహనంపై నిర్లక్షంగా అతివేగంగా నడుపుతూ డేవిడ్‌ను కెవిఆర్ కంపెనీ వద్ద ఢీకొట్టాడు. సమాచారం అందుకున్న పోలీసులు చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించగా శనివారం మృతి చెందాడు.దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## ప్రజా విజయెత్సవాలకు అన్ని ఏర్పాట్లు

### జిల్లా అధికారులకు వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశం



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్రపాలనకు ఏడది పూర్తైన సందర్భంగా వికారాబాద్ జిల్లాలో ప్రజాపాలన కళా యత్రను తెలంగాణ సంస్కృతిక సారథి కళాకారులతో నంవంబర్ 19నుండి డిసెంబర్ 7వరకు ప్రజాపాలన కళా యాత్ర చేపట్టాలని ప్రభుత్వం సంకల్పించడం జరిగిందని దీనికి సంబంధింత అధికారులకు సూచించారు. జిల్లా యంత్రాంగం జిల్లా పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో పని చేస్తున్న సాంస్కృతిక సారథి కళాకారులచే జిల్లాలోని పెద్ద గ్రామ పంచాయతీలలో ఈ నెల 19వ తేదీ నుండి డిసెంబర్ 07 వరకు గ్రామాల్లో తిరుగుతూ ఆరు గ్యారంటీలపై అవగాహన కల్పిస్తూ ప్రజాపాలన ప్రజా విజయెత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అదేశించారు. ఈ నెల 18న కొడంగల్ సోమవారం సాయంత్రం 6గంటలకు ప్రొపెసర్ అలేఖ్య పుంజల బృందంచే ప్రజావియెత్సవాల కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు. డిసెంబర్ 7న అంతడుపుల నాగరాజు బృందంచే కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శాసన సభ సభాపతి ప్రసాద్‌కుమార్ ముఖ్య అతిథిగా విచేస్తారని తెలిపారు.

**ప్రశాంతంగా గ్రూప్ -3 పరీక్షలు**

మున్సిపల్ పరిదిలో నిర్వహిస్తున్న గ్రూప్3 పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ సందర్శించారు. శ్రీ అనంతపద్మనాభ ఆర్ట్స్ , సైన్స్ అండ్ , కామర్స్ కళాశాల ,సిద్దార్థ బాలికల జూనియర్ కళాశాల లో జరుగుతున్న పరీక్ష కేంద్రలను కలెక్టర్ పరిశీలించారు. పరీక్ష నిర్వహణ గదులను ,వైద్య,ఇతర సౌకర్యాలను కలెక్టర్ తనిఖీ చేశారు. అదేవిధంగా జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి పలు సెంటర్లను సందర్శించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్ ,ఆర్డీఓ వాసు చంద్ర , తహసీల్దార్ లక్ష్మి నారయణ తదితరులు పాల్గోన్నారు.

## వేరే వేరు ఘటనలో ముగ్గురు మృతి





**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని గాంధీకాలనీలో సోమేశ్వర్ అనే 85 సంవత్సరాల వృద్ధుడు రైస్ కుక్కరు పేలి మృతి చెందారు. విద్యుత్ స్టవ్‌పై పెట్టిన రైస్ కుక్కర్ అకస్మాత్తుగా పేలి మంటలు చెలరేగి వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా కూతురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మరో ఘటనలో మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లాకు చెందిన విక్రమ్ మహంతి స్టాఫ్‌వే ర్ ఉద్యోగం చేస్తు ఆర్థిక పరిస్థితి బాగా లేనందున మనోవేదనతో ఇంట్లో నుండి ఎవ్వరికి తెలియకుండా వికారాబాద్ కు స్కూటిపై వచ్చి తిరిగి వేళ్తున్న సందర్భంలో ప్రమాదవశాత్తు అదుపు తప్పి శివరెడ్డి పేట్ చేరువులోకి స్కూటితో సహ నీటిలో పడి చనిపోయడని ఇట్టి విషయంలో కుసాయిగూడ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైందని సిఐ తెలిపారు. వికారాబాద్ మున్సిపల్‌లోని దుర్గ భవాని హోటల్ దగ్గర గుర్తు తెలియని వ్యక్తి మృత్తి చెందారని వయస్సు 40సంవత్సరాలు గల వ్యక్తి అహరం సరిగ్గా లేక చనిపోయినట్లు తెలుస్తుంది. శవాన్ని గుర్తు పట్టిన వారు సిఐ ఫోన్ నెంబర్ 8712 670030 నంబర్‌కు సమాచారం ఇవ్వలని వికారాబాద్ సిఐ బీమ్ కుమార్ తెలిపారు.

## కోతలు పూర్తయ్యాక కొయ్యలు తగలబోట్టొద్దు : వ్యవసాయాధికారి

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** వరి కోతలు పూర్తయ్యాకా కొయ్యలను తగుల పెట్టవద్దని మేడ్చల్ జిల్లా వ్యవసాయాధికారి రైతాంగానికి సూచించారు. పర్యావరణానికి నష్టం కలిగించే కొయ్యలను తగుల బెట్టే విధానానికి స్వస్తి చెప్పి వాటిని నేలలోనే కలుపాలన్నారు. నేలలో కలిసి పోయే కొయ్యలు సేంద్రియ పదార్థాలుగా మారి భూసారాన్ని పెంచుతాయన్నారు. అంతే కాకుండా కొయ్యలను కంపోస్టు తయారీలో ఉపయోగించటం వల్ల పంటలకు సహజ ఎరువుగా పని చేస్తాయని, వరి కొయ్యలు పశువులకు మేతగా సైతం వినియోగించటం ద్వారా వాటికి పోషకాలు అందించవచ్చని, నియంత్రిత ఆక్సిజన్ లేకుండా కొయ్యలను తగుల బెట్టి బయోచార్ తయారు చేయవచ్చని, దీంతో నేల తేమను నిల్వ చేయటంతో పాటు భూసారాన్ని మెరుగు పరచుకోవచ్చన్నారు. మరో పక్క వరి కొయ్యలను మల్చింగ్ పదార్థంగా వాడటం వల్ల నేల తేమను కాపాడుకొంటూ మొక్కలకు అనుకూల వాతావరణం లభిస్తుందన్నారు. అదే కొయ్యలను పాత పద్ధతిలో తగుల బెట్టటం వల్ల భూమిలో నైట్రోజన్, పాస్పరస్, పొటాషియం వంటి పోషకాలు ఆవిరై పోతాయని, తద్వారా భవిష్యత్ పంటలకు నష్టం వాటిల్లుతుందని, వాయు కాలుష్యంతో ఊపిరితిత్తుల సమస్యలకు దారి తీస్తాయని, తగుల బడకుండా ఉన్న అవశేషాలు, కీటకాలు వ్యాధులకు కారణాలవుతాయని, భూమి సంతులనం కోల్పోతుందని వ్యవసాయాధికారి తెలిపారు.

## నర్సింహ్మా స్వామిని దర్శించుకున్న మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్

**ప్రజాపక్షం/తాండూరు :** కర్నాటక రాష్ట్ర బీదర్‌లో వెలసిన బీదర్ లక్ష్మి నర్సింహా స్వామిని తాండూరు మున్సపల్ మాజీ చైర్‌పర్సన్ సునీతాసంపత్‌కుమార్ దంపతులు దర్శించుకున్నారు. ఆదివారం బీదర్ వెళ్ళిన వారు బీదర్ లక్ష్మి నర్సింహా స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని దర్శించుకున్న వారిలో మాజీ సర్పంచ్ మల్లారెడ్డి దంపతులు ఉన్నారు.



## ఆలస్యంగా వచ్చిన వారికి అనుమతి నిరాకరణ

### పరిక్షా కేంద్రాలను పర్యవేక్షించిన సబ్‌కలెక్టర్, డిఎస్‌పి



**ప్రజాపక్షం/తాండూరు :** మొదటి రోజు గ్రూప్3 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. తాండూరు పట్టణంలో గ్రూప్3 పరిక్షల నిర్వహణకు 11కేంద్రాలను ఏర్పాటు చేసిన విషయం తలిసిందే. పలు కేంద్రాల వద్ద ఆలస్యంగా వచ్చిన వారికి పరీక్ష హల్‌లోకి అనుమతించను లేదు. గ్రూఫ్3 పరీక్షలు ప్రశాంతంగా జరిగే విధంగా కేంద్రాల వద్ద గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. రెండు సేషన్‌లో మొదటి రోజు జరిగిన పరిక్షలు ప్రశాంతంగా జరిగాయి. పరీక్ష కేంద్రాలను సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, డిఎస్‌పి బాలకృష్ణారెడ్డి పరివేక్షించారు.

## శ్రీ విష్ణు శివాలయంలో మహాన్యాస రుద్రాభిషేకం



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మండలం ఉద్దెమర్రిలోని శ్రీ విష్ణు శివాలయం లో కార్తీకమాసం పురస్కరించుకుని ఆదివారం మహాన్యాస ఏకదశి రుద్రాభిషేకం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితుల మం త్రోచ్చరణలతో ఆలయ ప్రాంగణం మార్మోగిం ది. ముందుగా గణపతి పూజ, నవగ్రహ హో మం, మణుసుక్త హోమం, మంటపారాధన, లలిత సహస్ర విష్ణు పారాయణం, కుంకుమార్చనలు చేశారు. కార్తీకమాసంలో విశిష్టమైన మా ఘ మాసం సందర్భంగా శివుడికి అత్యంత ప్రీతికరమైన కార్తీకమాసంలో శివుడికి పంచామృతభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. గాయత్రీ మిత్ర మండలి, ఉద్దెమర్రి శ్రీ విష్ణు శివాలయ కమిటీ సహయ సహకారాలతో మహాన్యాస రుద్రాభిషేకం నిర్వహించినట్లు వేద పండితులు తెలిపారు. ఈ యాగం వలన గ్రామం చుట్టు పక్కల ప్రజలందరూ అష్టైశ్వర్యాలతో సుఖ సం తోషాలతో ఉండాలని భగవంతుడిని కోరుకుని యాగం చేసినట్లు వారు తెలిపారు. అక్కన్న మా దన్నలు నిర్మించిన పురాతన ఆలయ విశిష్టతను తెలుసుకుని ఆలయాన్ని సందర్శించడం జరిగిందని ఆలయం చాల ప్రసిద్ధి ప్రాచుర్యం పొందిన ఆలయంగా చరిత్ర చెబుతుందని చెప్పారు. ఈ ఆలయంలో మహాన్యాస రుద్రాభిషేకం చేయ దం పూర్వజన్మసుకృతంగా బావిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మిత్రమండళి బృందం సభ్యులు, ఆలయ కమిటి నిర్వాహకు లు, భక్తులు పాల్గొన్నారు.

## బోడుప్పల్‌లో ఘనంగా అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** అణగారిన వర్గాలకు తాను రచించిన రాజ్యాంగం ద్వారా సముచిత న్యాయం చేసిన గొప్ప మహనీయుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని మాజీ ఎంపి, చెన్నూరు ఎంఎల్ఎ వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం బోడుప్పల్ మున్సిపల్ కార్పోరేషన్‌లో అంబేద్కర్ విగ్రహానికి నత్తి మైసయ్య ఆధ్వర్యంలో 300వ జ్ఞానమాల సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, బోడుప్పల్ మేయర్ అజయ్‌యాదవ్‌లు విచ్చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తన జీవితాన్ని ధారపోసి భారతదేశానికి రాజ్యాంగాన్ని వరంగా అందించిన మహనుబావుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని కొనియయాడారు. ఈ సందర్భంగా నత్తి మైసయ్యను ఎంఎల్ఎ వివేక్ వెంకటస్వామి అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి మేయర్ కొత్త స్రవంతి కిషోర్‌గౌడ్, బోడుప్పల్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి, కార్పోరేటర్లు కల్యాన్‌కుమార్, సుమన్, చీరాల నర్సింహా, కాంగ్రెస్ నాయకులు రమేష్, వెంకటేష్‌యాదవ్, యాదగిరి, లోకేష్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.



# క్రీడ

## ఇప్పుడు భారత జట్టుకు రోహిత్ అవసరం: గంగూలీ



సొంతగడ్డపై న్యూజిలాండ్ చేతిలో ఘోర పరాజయాన్ని చవిచూసిన భారత్ మరో టెస్టు సిరీస్ సమరానికి సిద్ధమవుతోంది. నవంబర్ 22 నుంచి ఆస్ట్రేలియాతో అయిదు టెస్టుల సిరీస్ ఆడనుంది. వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ (2024–25)లో టీమిండియాకు ఇదే చివరి సిరీస్. ముచ్చటగా మూడోసారి డబ్ల్యూటిసి ఫైనల్‌కు చేరాలంటే రోహిత్ సేనకు ఈ సిరీస్ అత్యంత కీలకం. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని కనీసం 4–0తో విజయం సాధిస్తే ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడకుండా భారత్ ఫైనల్‌కు చేరుకోగలదు. మరోవైపు ఆస్ట్రేలియాకు ఈ సిరీస్ ఎంతో కీలకం కానుంది. శ్రీలంక సిరీస్‌తో కలిపి ఆడాల్సిన ఏడు మ్యాచ్‌ల్లో అయిదు విజయాలు సాధించాల్సి ఉంది. అయితే సిరీస్ ప్రారంభంకాక ముందే టీమిండియాకు ఊహించని కష్టాలు ఎదురయ్యాయి. వివిధ కారణాలతో కీలక ఆటగాళ్లు అందుబాటులో ఉండట్లేదు. తాను రెండోసారి తండ్రైయిన నేపథ్యంలో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ పెర్త్ వేదికగా జరిగే తొలి టెస్టుకు దూరం కానున్నాడు. అయితే రోహిత్ స్థానంలో జట్టు బాధ్యతలు జస్‌ప్రీత్ బుమ్రా చూసుకుంటాడని కోచ్ గౌతమ్ గంభీర్ ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే. గతంలో కెప్టెన్సీపై ఎంతో ఆసక్తితో ఉన్నట్లు బుమ్రా కూడా పేర్కొన్నాడు. కంగారూల గడ్డపై సవాలుతో కూడిన టెస్టుల్లో టీమిండియాను నడిపించడానికి ఉత్సుకతతో ఉన్నాడు. అంతేగాక బుమ్రాకు సలహాలు అందివ్వడానికి అనుభవజ్ఞుడైన విరాట్ కోహ్లి కూడా జట్టులోనే ఉన్నాడు. అయితే బుమ్రా ప్రత్యామ్నాయంగా ఉన్నప్పటికీ భారత జట్టుకు నాయకుడిగా రోహిత్ శర్మ ఎంతో అవసరమని మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ అన్నాడు. రోహిత్ త్వరగా ఆస్ట్రేలియాకు వెళ్లాలని, టీమిండియాకు నాయకత్వం వహించాలని పేర్కొన్నాడు. హిట్ మ్యాన్ స్థానంలో తాను ఉన్నా వీలైనంత త్వరగా కంగారూల గడ్డకు చేరుకుంటానని చెప్పాడు. ''రోహిత్ శర్మ అతి త్వరలో ఆస్ట్రేలియాకు వెళ్తాడని ఆశిస్తున్నా. ఎందుకంటే జట్టుకు అతను ఇప్పుడు ఎంతో అవసరం. తన భార్య కుమారునికి జన్మనిచ్చిందని తెలిసింది. కాబట్టి అతను ఇక ఆసీస్‌కు వెళ్తాడనుకుంటున్నా. అతను వీలైనంత త్వరగా వెళ్లాలి. అతని స్థానంలో నే నున్నా అదే చేస్తాను. రోహిత్ పెర్త్ టెస్టు ఆడాలి. తొలి మ్యాచ్‌కు మరో వారం రోజుల సమయం ఉంది. ఆస్ట్రేలియాతో పెద్ద సిరీస్ జరగనున్న నేపథ్యంలో ప్రారంభం నుంచే రోహిత్ నాయకత్వం టీ మిండియాకు అవసరం. అతను అద్భుతమైన కెప్టె న్'' అని గంగూలీ పేర్కొన్నాడు. రోహిత్ భార్య రితి కా శుక్రవారం పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది.

## శ్రేయస్ అయ్యర్‌పై కన్నేసేది ఆ రెండు జట్లే: సునీల్ గవాస్కర్



ఐపిఎల్ మెగా వేలానికి ముహూర్తం ఖరారైంది. సౌదీ అరేబియాలోని జెడ్డా వేదికగా నవంబర్ 24, 25వ తేదీల్లో మెగా ఆక్షన్‌ను నిర్వహించనున్నారు. భారత కాలమాన ప్రకారం మధ్యాహ్నం 3 గంటలకు వేలం ప్రారంభం కానుంది. విదేశాల్లో ఐపీఎల్ వేలాన్ని నిర్వహించడం వరుసగా ఇది రెండోసారి. వేలానికి 1574 మంది ఆటగాళ్లు తమ పేర్లను నమోదు చేసుకోగా, అందులో ఫ్రాంచైజీల సూచనల మేరకు బీసీసీఐ 574 మందినే షార్ట్ లిస్ట్ చేసింది. వాళ్లలో మొత్తంగా 204 ప్లేయర్లను కొనుగోలు చేయడానికి ఫ్రాంచైజీలు సిద్ధమయ్యాయి. ఇందులో 70 మంది విదేశీ ప్లేయర్లు ఉండనున్నారు. షార్ట్ లిస్ట్ అయిన వాళ్లలో 366 మంది భారత ఆటగాళ్లు, 208 మంది విదేశీ ప్లేయర్లు ఉన్నారు. అయితే ప్లేయర్లందరిలో శ్రేయస్ అయ్యర్, రిషభ్ పంత్, కేఎల్ రాహుల్‌కు వేలంలో భారీ డిమాండ్ నెలకొంది. ఈ ముగ్గురిపై కాసుల వర్షం కురువడం గ్యారెంటీ. అయితే శ్రేయస్ అయ్యర్ ఏ జట్టును దక్కించుకోనుందా దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. ఐపిఎల్ 2024లో కేకేఆర్‌ను శ్రేయస్ అయ్యర్ ఛాంపియన్‌గా నిలిపాడు. సారథిగా సీజన్ ఆద్యంతం కేకేఆర్‌ను విజయపథంలో నడిపించాడు. అయితే కోల్‌కతా నైట్ రైడర్స్.. రింకూ సింగ్ (రూ.13 కోట్లు), వరుణ్ చక్రవర్తి (రూ.12 కోట్లు), సునీల్ నరైన్ (రూ.12 కోట్లు), ఆండ్రీ రసెల్ (రూ. 12 కోట్లు), హర్షిత్ రాణా (రూ.4 కోట్లు), రమణ్‌దీప్ సింగ్ (రూ. 4 కోట్లు)లను రిటైన్ చేసుకుంది. రూ.69 కోట్లు వెచ్చించి ఈ ఆరుగురు అట్టిపెట్టుకుని కెప్టెన్‌ను వదిలిపెట్టింది. గాయం కారణంగా 2023 సీజన్‌కు దూరమైన శ్రేయస్.. 2024 సీజన్‌లో 39 సగటుతో 351 పరుగులు చేశాడు. కాగా, శ్రేయస్ అయ్యర్ గురించి సునీల్ గవాస్కర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. 'కెకెఆర్ విజేతగా నిలిచినప్పుడు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్. అయితే రిషభ్ పంత్ విషయంలో చెప్పినట్లుగా ఫీజు విషయంలో భిన్నాభిప్రాయాలు రావొచ్చు. అయితే వేలంలో శ్రేయస్ వచ్చినప్పుడు కెకెఆర్ కూడా బిడ్ వేయొచ్చు. అలాగే ఢిల్లీ క్యాపిటల్స్ కూడా అతని కోసం ప్రయత్నించవచ్చు. పంత్ దక్కని సందర్భంలో కెప్టెన్ కోసం ఢిల్లీ క్యాపిటల్స్ శ్రేయస్ కోసం తప్పక ట్రై చేస్తుంది. అలాగే పంత్ కోసం ఢిల్లీ ఫ్రాంచైజీ ఆర్‌టీఎమ్ కార్డ్ ఉపయోగిస్తుంది'' అని సునీల్ గవాస్కర్ పేర్కొన్నాడు.

## చరిత్ర సృష్టించిన పూరన్.. పొలార్డ్ ఆల్‌టైమ్ రికార్డు బద్దలు!



వెస్టిండీస్ విధ్వంసకర బ్యాటర్ నికోలస్ పూరన్ మరో అరుదైన ఘనత సాధించాడు. విండీస్ తరపున అత్యధిక టీ20లు ఆడిన ప్లేయర్‌గా చరిత్రకెక్కాడు. సెయింట్ లూసియా వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన నాలుగో టీ20తో ఈ ఘనత అందుకున్నాడు. 29 ఏళ్ల పూరన్ 2016లో అంతర్జాతీయ టీ20ల్లో అరంగేట్రం చేశాడు. ఇప్పటివరకు 102 మ్యాచ్‌లు ఆడాడు. 26.83 సగటుతో, 137 స్ట్రైక్‌రేటుతో 2254 పరుగులు చేశాడు. పూరన్ కంటే ముందు ఈ రికార్డు ఆల్‌రౌండర్ కీరన్ పొలార్డ్ పేరిట ఉండేది. 2008 నుంచి 2022 వరకు వెస్టిండీస్ తరపున పొలార్డ్ 101 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. 1569 పరుగులు, 42 వికెట్లు పడగొట్టాడు. ఈ జాబితాలో తర్వాతి స్థానాల్లో డ్వేన్ బ్రావో (91 మ్యాచ్‌లు), కెప్టెన్ పావెల్ (87 మ్యాచ్‌లు), రసెల్ (83 మ్యాచ్‌లు), క్రిస్ గేల్ (79) ఉన్నారు. కాగా, సెయింట్ లూసియా వేదికగా జరిగిన నాలుగో టీ20లో వెస్టిండీస్ అయిదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. సొంతగడ్డపై జరుగుతున్న అయిదు టీ20ల సిరీస్‌ను రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే కోల్పోయినప్పటికీ నామమాత్రపు మ్యాచ్‌ల్లో చెలరేగుతోంది. 219 పరు గుల భారీ లక్ష్యాన్ని ఓవర్ మిగిలుండానే ఛేదించి పరువు కాపాడుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ నిర్ణీత 20 ఓవర్లలో అయిదు వికెట్లకు 218 పరుగులు చేసింది. జాకోబ్ బెతెల్ (62 నాటౌట్; 32 బంతుల్లో, 4 ఫోర్లు, 5 సిక్సర్లు), ఫిలిప్ సాల్ట్ (55; 35 బంతుల్లో, 5 ఫోర్లు, 4 సిక్సర్లు) అర్ధ శతకాలతో సత్తాచాటారు. విండీస్ బౌలర్లలో మోటియ్ రెండు వికెట్లు, రోస్టన్ ఛేజ్, అల్జారీ జోసెఫ్ చెరో వికెట్ తీశారు. అనంతరం ఛేదనలో వెస్టిండీస్ 19 ఓవర్లలో అయిదు వికెట్లు కోల్పోయి 221 పరుగులు చేసింది. ఓపెనర్లు ఎవిన్ లూయిస్ (68; 31 బంతుల్లో, 4 ఫోర్లు, 7 సిక్సర్లు), షై హోప్ (54; 24 బంతుల్లో, 7 ఫోర్లు, 3 సిక్సర్లు) విధ్వంసకర ఇన్నింగ్స్‌లు ఆడారు. కెప్టెన్ పావెల్ (38; 23 బంతుల్లో, 2 ఫోర్లు, 3 సిక్సర్లు), ఫెర్పేన్ రూథర్‌ఫర్డ్ (29 నాటౌట్; 17 బంతుల్లో, 3 సిక్సర్లు) కీలక పరుగులు సాధించారు. ఇంగ్లండ బౌలర్లలో రెహాన్ మూడు వికెట్లు తీశారు.

# రీల్

## అదిరిపోయే గెటప్ తో పుష్ప-2 ట్రైలర్..




ప్రస్తుతం పాన్ ఇండియా సినిమా దగ్గర భారీ హైప్ లో ఉన్న అవైటెడ్ సీక్వెల్ సినిమా ఏదన్నా ఉంది అంటే అది పాన్ ఇండియా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా రష్మికా మందన్నా హీరోయిన్ గా దర్శకుడు సుకుమార్ కాంబినేషన్ లో చేస్తున్న భారీ చిత్రం పుష్ప 2 ది రూల్ అనే చెప్పాలి. మరి ఈ బిగ్ ప్రాజెక్ట్ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తుండగా నేడు మేకర్స్ భారీ ఈవెంట్ తో పాట్నాలో ట్రైలర్ ని లాంచ్ చేశారు. ఊహించని లెవెల్లో ఈ ట్రైలర్ వచ్చేసింది. మరి ఈ ట్రైలర్ మాత్రం నెక్స్ట్ లెవెల్లో ఉందని చెప్పాలి. ఈసారి అంతా కొత్తగా కనిపిస్తూ జగపతిబాబు తో మొదలై పుష్ప పాత్రని మరింత పవర్ఫుల్ గా ఉండేలా అనిపిస్తుంది. సిండికేట్ లో పెద్ద ఎత్తున డబ్బుతో పాటుగా శత్రువులిని కూడా పెంచుకున్నాడని చెప్పాలి.మరి ఈ ట్రైలర్ ని మేకర్స్ పర్ఫెక్ట్ బ్లెండ గా కట్ చేసారని చెప్పాలి. తన రోల్ తన ఫ్యామిలీ తన రూల్ ఇలా అదిరే లెవెల్లో ఈ ట్రైలర్ ఉంది. అలాగే రశ్మికపై కూడా ఇంట్రెస్టింగ్ సీన్స్ తన కాలితో తన గడ్డాన్ని సవరించడం ఇక వీటితో పాటుగా ఫహద్ ఫాజిల్ పై కూడా సాలిడ్ పోర్షన్స్ ని చూపించడం క్రేజీ లెవెల్లో ఉందని చెప్పాలి.అలాగే పుష్ప చిన్ననాటి షాట్స్ తన రోల్ ని మరింత లెవెల్లో ఎలివేట్ చేసే డైలాగ్స్ ఇంకా క్రేజీ యాక్షన్ సీన్స్ తో షాట్స్ తో ఒక కంప్లీట్ ప్యాకెడ్ ఎంటర్టైనర్ లా అనిపిస్తుంది. ఇక ఈ బిగ్గెస్ట్ ట్రైలర్ లో బ్యాక్గ్రౌండ స్కోర్ కూడా అడ్వానడ్స్ గా ఉందని చెప్పాలి. మరి పుష్ప 2 ఈ డిసెంబర్ 5న ఎలాంటి ట్రీట్ ఇస్తుందో చూడాల్సిందే.

## కాంతార-1 రిలీజ్ డేట్ వచ్చేసింది..!

కన్నడ ప్రముఖ టాలెంటెడ్ హీరో అలాగే దర్శకుడు కూడా అయినటువంటి రిషబ్ శెట్టి నటించి తన స్వీయ దర్శకత్వంలోనే తెరకెక్కించిన భారీ హిట్ చిత్రం కాంతార కోసం పాన్ ఇండియా ఆడియెన్స్ కి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. మొదట కన్నడలో విడుదల అయ్యి నెమ్మదిగా తెలుగు, హిందీలలో కూడా వచ్చి భారీ వసూళ్ళని ఈ చిత్రం అందుకుం ది. ఇలా ఏకంగా 400 కోట్లకి పైగా వసూలు చేసిన ఈ చిత్రానికి ప్రీక్వెల్ గా కాం తార చాప్టర్ 1 ని రిషబ్ శెట్టి భారీ లె వెల్లో ఇపుడు తెరకెక్కిస్తున్నాడు. మరి దీనిపై మే కర్స్ ఇపుడు బిగ్ అప్డేట్ ని అయితే అందించారు. ఈ ప్రీక్వెల్ ని వచ్చే ఏడాది అక్టోబర్ 2 న పాన్ ఇండియా లెవెల్లో రిలీజ్ కి తీసుకొస్తున్నట్టుగా కన్ఫర్మ్ చేశారు. . ఇక ఈ చిత్రానికి హోంబళే ఫిలమ్స్ నిర్మాణం వహిస్తుండగా అజనీష్ లోకనాథ్ సంగీతం అందిస్తున్నాడు.






## 'రాజా సాబ్'లో సెన్సేషనల్ సాంగ్ రీమిక్స్..

సాధారణంగా స్టార్ హీరోల సినిమాలో ఓ సూపర్ హిట్ సాంగ్‌ను రీమిక్స్ పెట్టాలని దర్శకనిర్మాతలు ప్లాన్ చేస్తుంటారు. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కూడా తన సినిమాలో ఓ రీమిక్స్ సాంగ్‌తో ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేయనున్నట్లు తెలుస్తోంది.ప్రభాస్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'ది రాజా సాబ్' ఇప్పటికే ఎలాంటి అంచనాలు క్రియేట్ చేసిందో అందరికీ తెలిసిందే. ఈ సినిమాను దర్శకుడు మారుతి డైరెక్ట్ చేస్తుండగా హార్రర్ కామెడీ జోనర్‌లో ఈ సినిమా రానుంది. ఈ సినిమాలో ఓ సెన్సేషనల్ సాంగ్ రీమిక్స్ పెట్టేందుకు దర్శకుడు మారుతి ప్లాన్ చేస్తున్నాడట. బాలీవుడ్‌లో 1994లో వచ్చిన 'ఇన్‌సాఫ్ అప్నే లహోసే' అనే సినిమాలో ''హవా హవా..'' అనే పాట అప్పట్లో సెన్సేషనల్ హిట్‌గా నిలిచింది. ఇక ఇప్పుడు ఈ సాంగ్ రీమిక్స్ రైట్స్‌ను 'రాజా సాబ్' మేకర్స్ దక్కించుకున్నట్లుగా తెలుస్తోంది. దీంతో ప్రభాస్ సినిమాలో ఈ రీమిక్స్ సాంగ్ మంచి మాస్ బీట్స్‌తో థమన్ కంపోజ్ చేశాడని.. ఈ పాటకు థియేటర్లలో అభిమానులు డ్యాన్సులు వేయడం ఖాయమని చిత్ర వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఈ పాట కోసం భారీగా ఖర్చు కూడా పెట్టారని తెలుస్తోంది. మరి నిజంగానే 'రాజా సాబ్' మూవీలో రీమిక్స్ సాంగ్ మరోసారి సెన్సేషన్ క్రియేట్ చేస్తుందా అనేది వేచి చూడాలి.

# సాగునీటి ప్రాజెక్టులు, నదీ జలాల సమస్యపై అఖిలపక్షం

**సిపిఐ ఎపి రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్**

**రేపు విజయవాడలో విద్యుత్ చార్జీలు తగించాలని వామపక్ష పార్టీల నిరసన**

**అమరావతి:** రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు, నీటి కేటాయింపులపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఆ రాష్ట్ర సీపీఐ కార్యదర్శి కె.రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక హనుమాన్‌పేట్ దాసరి భవన్లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్‌తో కలిసి విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి ఆంధ్రప్రదేశ్కి కేంద్ర ప్రభు త్వం తీరని అన్యాయం చేస్తున్నదని ఆగ్రహం వ్య క్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డు ఒకవైపు నదుల అనుసంధానం గురించి మాట్లాడుతుంటే... మరోవైపు పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించే ప్రయత్నాలు కేంద్ర ప్రభుత్వం చేస్తుందని విమర్శించారు. ఎత్తు తగ్గిస్తే ఆ ప్రాజెక్టు ప్రయోజనాలు దెబ్బతింటాయని అన్నారు. పోలవరం ఎత్తు తగ్గిస్తే రూ.25 వేల కోట్లు కేంద్రానికి ఆదా అవుతుందన్నారు. కుడి, ఎడమ కాల్వ సామర్థ్యాన్ని తగ్గిస్తున్నారని, దీంతో నిధులు ఆదా చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నదని మండిపడ్డారు. కేంద్ర చర్యల వల్ల పోలవరం ప్రాజెక్టు ప్రయోజనాలు దెబ్బ తింటాయన్నారు. సీఎం చంద్రబాబు ఈ అంశంపై స్పష్టత ఇవ్వడం లేదని, కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కృష్ణా ట్రైబ్యునల్ మొదటి కేటాయింపులు చేసిందన్నారు. విభజన చట్టానికి వ్యతిరేకంగా కేటాయింపులు తగ్గించాలని చూస్తున్నారని మండిపడ్డారు. దీనిపై పారదర్శకంగా చర్చ జరగాలని సూచించారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని చంద్రబాబు మంచి నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నామన్నారు. ఈ విషయంపైన అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని కోరారు. ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రానికారణంగా ప్రజా సమస్యలు చర్చకు రావటం లేదన్నారు. అందువల్ల చంద్రబాబు అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలన్నారు.



**స్థలాల సాధనకు నేడు సచివాయాల్లో వ్యక్తిగత అర్జీలు సమర్పణ:**

పేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు నివేశన స్థలాలు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పేదలకు ఇళ్ల స్థలాల సాధన కోసం సీపీఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టాయని చెప్పారు. ఈ నెల 18వ తేదిన ఇళ్ల లబ్దిదారులు సచివాలయాల్లో వ్యక్తిగత అర్జీలు సమర్పించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ శ్రేణులు ఇళ్ల లబ్దిదారులకు సహకారం అందిస్తారని చెప్పారు. ఇళ్ల స్థలాల అంశాన్ని గతంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుతాన్ని సీపీఐ విన్నవించినా లెక్కచేయలేదన్నారు. ఒక్కో కుటుంబానికి ఒక్క సెంటు స్థలం కేటాయించి, ఇంటి నిర్మాణానికి లక్షా ఎనభైవేలు మాత్రమే ఇచ్చిందన్నారు. చాలా చోట్ల ఇళ్ల స్థలాల లే అవుట్లు అసంపూర్తిగా ఉన్నాయని, కొన్ని ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం మధ్యలోనే ఆగిపోయిందన్నారు. ఇసుక, ఇటుక, ఇనుము, కంకర ధరలు పెరిగిన కారణంగా ప్రతి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లబ్ధిదారులను భారీ ఎత్తున సమీకరించి అన్ని సచివాలయాల్లో పెద్ద సంఖ్యలో అర్జీలు సమర్పించేలా సీపీఐ నాయకత్వం బాధ్యత తీసుకోవాలన్నారు. వారం రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

**రేపు విద్యుత్ చార్జీలను వ్యతిరేకిస్తూ విజయవాడలో వామపక్ష పార్టీల నిరసన:**

ఎఫ్పీపీసీఏ చార్జీల పేరిట ప్రజలపై రూ. 6,072 కోట్ల భారాన్ని విధిస్తూ ఏపీ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ జారీ చేసిన ఉత్తర్వును వెంటనే ఉపసంహరించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. మరో రూ.11820 కోట్ల విద్యుత్ సర్దుబాటు చార్జీల పెంపుపై ఏపీఈఆర్సీ విధించిన అభ్యంతరాల గడువును నవంబర్ 19 వరకు ఇచ్చిందని, సీపీఐ తన అభ్యంతరాలను తెలియజేస్తుందన్నారు. ఎన్నికల సందర్భంగా చంద్రబాబు నాయుడు తాము అధికారంలోకొస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ చార్జీలను పెంచబోమని, వీలైతే తగ్గించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారని గుర్తు చేశారు. ఇప్పుడు దాదాపు రూ.18 వేల కోట్ల విద్యుత్ భారాలను రాష్ట్ర ప్రజలపై మోపేందుకు సిద్ధమవ్వడంపై విచారం వ్యక్తం చేశారు.

# వైవిధ్యమైన కవితల సమాహారం 'హృదయ విరులు'

**కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యుడు నాళేశ్వరం శంకరం**



**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్:** భిన్నమైన అంశాలతో వైవిధ్యమైన కవితలతో కూడినది హృదయ విరులు కవితా సంపుటి అని కేంద్ర సా హిత్య అకాడమీ అడ్వైజరీ బోర్డు సభ్యుడు, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం అన్నారు. భవానీ సాహిత్య వేదికపై వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన ఆదివారం స్థానిక ఫిలిం భవన్‌లో జరిగిన సాహిత్య సభకు ముఖ్య అతిధిగా హాజరై వర్ధమాన కవయిత్రి మాంకాలి సుగుణ రచించిన హృదయ విరులు కవితా సంపుటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక అంశాలు, దేశభక్తి అనుబంధాలు, కుటుంబ సంబంధాలతో పాటు కార్మికులు, రైతులు, సైనికులు, ప్రకృతి తదితర అంశాలు కవితా సంపుటిలో చోటు చేసుకున్నాయని, తన మనసులో కలిగిన భావాలను అక్షరాలుగా కూర్చి కవితలుగా అందించిందన్నారు. విశిష్ట అతిధిగా హాజరైన సినీగీత రచయిత, నటులు, గాయకుడు, తెలుగు విశ్వవిద్యాలయం బంగారు పతక గ్రహీత సాధనాల వెంకటస్వామి నాయుడు మాట్లాడుతూ ప్రగతిశీల భావాలతో , సామాజిక బాధ్యతతో ప్రకృతి పట్ల ఎనలేని మమకారంతో రాసిన కవితల సమాహారమే హృదయ విరులు అని, కవులు అధ్యయనంతో తమ కవిత్వాన్ని మెరుగుపరుచుకోవాలని అన్నారు. గౌరవ అతిధులు ముల్కనూర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ హర్జిత్ కౌర్ మాట్లాడుతూ సుగుణ హృదయం నుంచి విరిసిన విరులే ఈ కవితలని అన్నారు. తెలంగాణ తెలుగు బాషా సంరక్షణ సంఘం ప్రధాన కార్యదర్శి బొమ్మకంటి కిషన్, కవయిత్రి జ్యోతిలక్ష్మి ఆహ్వానం పలికిన సభలో నీలగిరి అనిత పుస్తకాన్ని సమీక్షించారు. కార్యక్రమంలో తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు కొత్త అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి దామరకుంట శంకరయ్య, ప్రముఖ కథారచయిత బివిఎన్ స్వామి, ముదుగంటి సుధాకర్‌రెడ్డి, బాల సాహితీవేత్త పెందోట వెంకటేశ్వర్లు, డా.ఏదునూరి వెంకటేశ్వర్లు, బోయిని సంపత్, రాము ఇటిక్యాల్, జనగాని యుగంధర్, కోరుకంటి శశి కిరణ్మయి, యోగాచార్య సంపత్ కుమార్, పాక రాంమోమన్, తడిగొప్పుల కుమారస్వామి, వెల్ముల జయపాల్‌రెడ్డి, కసిరెడ్డి జలంధర్ రెడ్డి, మాసం సీమ, పెద్దిరాజు సత్యనారాయణ రాజు, కవయిత్రి సోదరులు బాపు, బంధు మిత్రులు పాల్గొన్నారు.

## 'మహా'లో ఉపాధి కొరత

(మొదటి పేజీ తరువాయి)

'లడ్కీ బెహిన్'పై రాష్ట్రంలోని మహాయుతి ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రియాంకా మాట్లాడుతూ మ హిళలు ఉజ్వల భవిష్యత్తు కోసం ఓటు వేయాలని, నేలకు రూ. 1500 పొందుతున్నందుకు కాదన్నారు. ప్రతిపక్ష మహావికాస్ అఘాడీ (ఎంవిఎ) అధికారంలోకి వస్తే రైతులు పండించే సోయాబీన్ పంటకు క్విం టాల్‌కు రూ. 7 వేల ఎంఎస్‌పి ఇస్తుందని హామీనిచ్చారు. మహారాష్ట్రలో 2.5 లక్షలకుపైగా ఉద్యోగ ఖా ళీలు ఉన్నాయన్నారు. ఫోక్స్‌కాన్, ఎయిర్‌బస్ ప్రాజెక్టుల వంటివి గుజరాత్‌కు తరలించుకుపోవడంతో మ హారాష్ట్ర అనేక ఉద్యోగాలును కోల్పోయిందని చెప్పారు. యువత ఎన్నికల ప్రయత్నాలు చేసినా, కొత్త నైపుణ్యాలు సాధించినా ఉద్యోగాలు మాత్రం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిపైనే ప్రభుత్వం ప్రాథమికంగా దృష్టి పెట్టాలని కానీ, ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయడంలో పూర్తిగా విఫలం చెందిందని విమర్శించారు. ఉద్యోగాల కొరత వల్ల మహారాష్ట్రలో యువత ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. దేశంలోనే అత్యధికంగా మహారాష్ట్రలో యువత బలవన్మరణానికి పాల్పడుతుందని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో బిజెపి ప్రభుత్వం విఫలమైందనడానికి యువత ఆత్మహత్యలే నిదర్శనమని ప్రియంకాగాంధీ చెప్పారు. ఎన్నికల ప్రచారంలో బిజెపి నేతలు 'ఎక్ హై తో సేఫ్ హై' అంటూ నినదిస్తున్నారని, సేఫ్ అనే పదం రెండు అర్థాలనిస్తుందని చెప్పారు. ఒకటి భద్రత కాగా, మరొకటి ఖజానా అనే అర్థం ఇస్తుందన్నారు. కానీ ఈ దేశంలో ఎవ్వైరనా భద్రతంగా ఉన్నారా అంటే అది అదానీ మాత్రమేనని పేర్కొన్నారు. ప్రభుత్వ ఖజానాలోకి అదానీకి మాత్రమే అనుమతి ఉందన్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఎయిర్‌పోర్టులు, పోర్టులు, ఇతర పెద్ద కంపెనీలన్నీ అదానీ ఆధీంనలోనే ఉన్నాయని, ప్రభుత్వ విధానాలన్నీ ఒక వ్యక్తికే అనుకూలంగా ఉన్నాయని ఆమె ఆరోపించారు. ఒక వ్యక్తికే దేశ ఆస్తులను ధారాదత్తం చేయడానికి బదులు ఉద్యోగ కల్పనపై ప్రభుత్వం సారించాలని సూచించారు. అదే విధంగా పాలనలో జవాబుదారీతన కొరవడడంపై ఆమె తీవ్రంగా మండిపడ్డారు. ఛత్తీస్‌గఢ్ వంటి కొన్ని రాష్ట్రాల్లో అదానీ కంపెనీలకు గిరిజనల భూముల కేటాయింపునుకూడా ఆమె ఈ సందర్భంగా లేవనెత్తారు. కాగా, ఎంవిఎ అధికారంలోకి వస్తే జవాబుదారీతనంపై, ఉద్యోగకల్పనపై, ప్రజల మద్దతుపై దృష్టి సారిస్తామన్నారు.

## ఫోటోషూట్ కోసమే

(మొదటి పేజీ తరువాయి)

మందు కొట్టారని, కాళ్ళకు సాక్సులు వేసుకుని కిషన్ రెడ్డి అక్కడ నిద్రపోయారని తెలిపారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపి బలరాం నాయక్‌తో కలిసి మహేష్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ మూడు నెలలు మూసీ ప్రాంతంలో ఉంటే ప్రజల అవస్థలు తెలుస్తాయని, మూడు నెలల బస చేయాలని సిఎం సవాల్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. 'మీ'తో పాటు తానూ మూడు నెలలు అక్కడే బస చేసేందుకు సిద్ధమని, వస్తారా? అని ఆయన కిషన్ రెడ్డిని ఆహ్వానించారు. బిఆర్ఎస్ గ్రాఫ్ పడిన ప్రతీసారి కిషన్‌రెడ్డి బయటకి వస్తారని, ఆ పార్టీని రక్షించేందుకు ఆయన ప్రయత్నిస్తారని మహేష్‌కుమార్ ఆరోపించారు. కిషన్ రెడ్డి ఒక్క రోజు నిద్ర చేసి ఏం సాధించారని, అక్కడి ప్రజల అవస్థలు ఏం తెలుసుకున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బిజెపి,బిఆర్ఎస్ ఎవ్వరికీ ఆపదొచ్చినా ఒకరినొకరు పరస్పరం ఆదుకుంటున్నాయని ఆరోపించారు. లగచర్ల దాడిలో కెటిఆర్ ఉన్నట్టు తేలడంతోనే ,ఈ ఘటన నుంచి దృష్టి మళ్లించేందుకే కిషన్ రెడ్డి ఇప్పుడు మూసీ ప్రాంతంలో ఒక రోజు బస చేశారని ఆరోపించారు. డిపిఆర్ వచ్చిన తర్వాత రిటర్నింగ్ వాల్ నిర్మించాలా? లేదా తెలుస్తుందన్నారు. సబర్మతి రివర్ ఫ్రంట్‌కు ఒక న్యాయం?, మూసీ రివర్‌కు మరో న్యాయమా అని ఆయన బిజెపి నేతలను ప్రశ్నించారు. మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్ రూమ్ ఇచ్చి ఆదుకుంటామని, వారి పిల్లలకు విద్య అవకాశాలు కల్పిస్తున్నామని వివరించారు. బిజెపి నాయకులు గుజరాత్ గులాములుగా ఎందుకు వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. ప్రపంచంతో తెలంగాణ పోటీ పడుతుందనగానే బిజెపి నాయకులకు భయం పట్టుకున్నదని, గుజరాత్ రాష్ట్రాన్ని ఎక్కడ తెలంగాణ వెనక వేస్తుందో అనే భయం వారిని వెంటాడుతోందని మహేష్ కుమార్ తెలిపారు. తమది యోగి అధిత్యనాథ్ బుల్‌డోజర్ పాలన కాదన్నారు. ఎవరికి కూడా అన్యాయం కాకుండా చూసుకునే భాధ్యత తమ ప్రభుత్వానిదని, మూసీ ప్రక్షాళన చేసి తీరుతామని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ఎం.పి బలరాం నాయక్ మాట్లాడుతూ ఎస్‌సి,ఎస్‌టి కమిషన్‌కు ఫార్మా సిటీపైన తాను వివరణ ఇస్తానని, ఈ విషయమై పార్లమెంట్‌లో కూడా ప్రస్తావిస్తానని తెలిపారు. వెనుబడిన వర్గాలను బిఆర్ఎస్ నాయకులు రెచ్చగొడుతున్నారని ఆరోపించారు.

## విశ్వ సుందరిగా డెన్మార్క్ భామ



**మెక్సికో :** ప్రపంచవ్యాప్తంగా అందాల పోటీల్లో మిస్ యూనివర్స్‌కు ఎంతో ప్రాధాన్యత ఉన్న విషయం తెలిసిందే. తాజాగా జరిగిన పోటీల్లో డెన్మార్క్‌కు చెందిన విక్టోరియా కెజార్ హెల్విగ్ గెలుపొందారు. విశ్వసుందరి కిరీటాన్ని అందుకున్నారు. మెక్సికో వేదికగా ఈ పోటీలు జరిగాయి. 125 మంది పోటీ పడగా 21 ఏళ్ల విక్టోరియా కెజార్ విజయాన్ని సొంతం చేసుకున్నారు. నైజీరియాకు చెందిన చిడిమ్మ అడెట్షినా, మెక్సికోకు చెందిన మరియా ఫెర్నాండా బెల్‌ట్రాన్ మొదటి, రెండో రన్నరప్‌లుగా నిలిచారు. ఈమేరకు షెన్నిస్ పలాసియోస్ (మిస్ యూనివర్స్ 2023) విజేతకు కిరీటాన్ని అందజేశారు. ''కొత్త శకం మొదలైంది. 73వ విశ్వ సుందరిగా గెలుపొందినందుకు అభినందనలు. ప్రపంచవ్యాప్తంగా మహిళల్లో స్ఫూర్తి నింపేలా మీ ప్రయాణం సాగాలని కోరుకుంటున్నాం'' అని మిస్ యూనివర్స్ టీమ్ పేర్కొంది. ఆమెకు ఫ్యాషన్ ప్రియులు అభినందనలు తెలిపారు. మరోవైపు, ఈ పోటీల్లో భారత్ తరపున రియా సింఘా పాల్గొన్నారు. టాప్ 5లోనూ ఆమె నిలవలేకపోయారు. విశ్వ సుందరి కిరీటాన్ని అందుకున్న తొలి డెన్మార్క్ భామ విక్టోరియానే. 2004లో సోబోర్గ్‌లో జన్మించిన ఆమె బిజినెస్ అండ్ మార్కెటింగ్‌లో డిగ్రీ పొందారు. వ్యాపారవేత్తగా మారారు. డ్యాన్సులోనూ శిక్షణ తీసుకున్నారు. మానసిక ఆరోగ్యం, మూగ జీవాల సంరక్షణ వంటి విషయాలపై పోరాటం చేస్తున్నారు. అందాల పోటీల్లోకి అడుగుపెట్టాలనే ఉద్దేశంతో మోడలింగ్‌లోకి వచ్చారు. మిస్ డెన్మార్క్‌గా తొలిసారి విజయాన్ని అందుకున్నారు. 2022లో జరిగిన మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్ పోటీల్లో టాప్ 20లో నిలిచి.. అందరి దృష్టిల్లో పడ్డారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com